Website : www.saisadguruvani.org

జన్మదిన ప్రత్యేక సంచిక


శ్రీ భరద్వాజ

# సద్గురువాణి



సంపుటి-21

జనవరి, ఫిబ్రవరి, మార్చి - 2021



సంచిక-1



శ్రీ దత్తసాయి మాస్టర్ సంప్రదాయ ప్రచార విజ్ఞాన త్రైమాస పత్రిక

శ్రీ భరద్వాజ

# సద్గురువాణి

సంపుటి - 21 జనవరి, ఫిబ్రవరి, మార్చి - 2021 సంచిక - 1

**శ్రీ దత్తసాయి మాస్టర్ సాంప్రదాయ ప్రచార విజ్ఞాన త్రైమాస పత్రిక**



ప్రధాన సంపాదకులు :
**శ్రీ వి.వి. పూర్ణచంద్రరావు**


'జన్మదిన' ప్రత్యేక సంచిక


నిర్వహణ :
**శ్రీ సాయి మాస్టర్ భక్త బృందము**




"బోధించేదేముంది, చెట్టును చూసి నేర్చుకో"
- శ్రీ శిరిడీ సాయిబాబా

## చందా వివరములు

| | | | |
|---|---|---|---|
| విడి ప్రతి | - | రూ॥ | 10/- |
| సంవత్సర చందా (పోస్టేజితో) | - | రూ॥ | 50/- |
| 3 సం॥ల చందా | - | రూ॥ | 150/- |
| 5 సం॥ల చందా | - | రూ॥ | 250/- |
| పోషకులు (ఉదారులు) | - | రూ॥ | 1000/- |


మనియార్డర్లు పంపవలసిన చిరునామా :

**శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్**

**C/o. శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు,**

ప్లాట్ నెం. 13, పవర్ సిటీ, గౌతులచ్చన్న నగర్ దగ్గర,
పరవాడ (మం), విశాఖపట్నం - 531 021.
సెల్ : 9849645224

E-mail : poorna.sai09@gmail.com
Website : **www.saisadguruvani.org**
Facebook : **Sri Shiridi Sai Seva Trust**
Co-Ordinator at USA : **Sri K. KARUNAREDDY**


## విషయ సూచిక


1. విషయసూచిక ..... 1
2. మా మాట ..... 2
3. అవధూత శ్రీ రామిరెడ్డి తాత ..... 4
4. నూతన సంవత్సర సందేశం ..... 5
5. సాయి మాస్టర్ భక్త సమ్మేళనం ..... 6
6. ఆ ఒక్క సంఘటన గుర్తుంచుకుంటేచాలు ..... 7
7. శ్రీగురు చరితామృతము ..... 9
8. పండుగలు - పర్వదినాలు ..... 11
9. మన సంప్రదాయాలు-సంక్రాంతి ..... 12
10. ఒక్కక్షణం ..... 13
11. ఆచార్యవాణి ..... 14
12. జిజ్ఞాస ..... 15
13. పూర్ణ అంతరంగాలు ..... 17
14. ట్రస్టు వార్షికోత్సవం ..... 20
15. శ్రీ సాయి గ్లోబల్ హారతి ..... 21
16. ఆధ్యాత్మిక - సామాజిక సేవలో ..... 22
17. మేము సహితం ..... 23
18. ఆధ్యాత్మిక-సామాజిక సేవలో చిత్రమాలిక ..... 24
19. జన్మదిన శుభాకాంక్షలు ..... 26
20. అవధూత శ్రీ దొంతులమ్మ ..... 32
21. శ్రీ పాకలపాటి గురువుగారు ..... 33
22. అవధూత శ్రీ కాశిరెడ్డినాయన ..... 35
23. పెనుమత్స శ్రీ మహాయోగిని ..... 36
24. అవధూత శ్రీ మాలపిచ్చమ్మ ..... 37
25. అవతార్ మెహర్‌బాబా ..... 38
26. ఆదర్శమూర్తి స్వామి వివేకానంద ..... 39
27. స్ఫూర్తి ప్రధాత (గాంధీజీ) ..... 41
28. కొత్తలంక బాబా ..... 42
29. బాలవికాశం ..... 43
30. పుస్తక పరిచయం ..... 44
31. తెలుసుకుందాము ..... 45
32. అన్నదానం ..... 46
33. ట్రస్టు ప్రణాళిక ..... 47
34. ఏరిన ముత్యాలు ..... 48













# మా మాట

**పాఠకులకు, ప్రకటన కర్తలందరికీ ఆంగ్ల నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు.**

నూతన శతాబ్దిలో అప్పుడే రెండు దశాబ్దాలు గడిచి మూడవ దశాబ్దములోకి అడుగు పెట్టేము ఈ శతాబ్దములో. గత 20 సంవత్సరాలుగా ప్రతి ఆంగ్ల నూతన సంవత్సరానికి, తెలుగు సంవత్సరాదికి ఇంకా అనేక సందర్భాలలో సాటివారికి శుభాకాంక్షలు చెబుతూనే ఉన్నాము, అందుకుంటూనే ఉన్నాము. ఎప్పటిలాగే గత సంవత్సరము ఆరంభంలో కూడ ప్రపంచములోని వారందరము ఒకరికొకరము శుభాన్ని ఆకాంక్షించాము, మరి మనం అనుకున్న రీతిలో శుభం జరిగిందా? కంటికి కనిపించని ఒక సూక్ష్మజీవి ప్రభావంతో ప్రపంచమంతా గడ గడ లాడిపోయింది. కొన్ని లక్షల మంది అసువులు బాసేరు. వారిలో సామాన్యుల దగ్గర నుండి అసమాన్యుల వరకు ఉన్నారు. అంతేకాకుండా లక్షల, కోట్లాది జీవితాలలో అనుకోని పెనుమార్పులు సంభవించాయి, కొందరి జీవితాలు అతలాకుతలమయిపోయినాయి. కొన్నివేల కుటుంబాలు ఇప్పటికీ ఆర్థికంగా కోలుకోలేని దుస్థితికి వెళ్ళిపోయాయి. గతంలో ఎంతో సుఖమయ జీవితం గడిపిన కుటుంబాలు నేడు ఆర్థిక మాద్యంతో అప్పులు తీర్చలేని దుర్భర స్థితిలో ఉన్నాయి. దీనికి కారణం ఏమిటి? మానవ తప్పిదమా, ప్రకృతిశాపమా! మానవజాతిపై భగవంతుడి కోపమా! దానికి కారణాలేమిటి, గత శతాబ్దపు కాలంలో ఎన్నడు ఎవ్వరూ చూడని ఒక వినూత్న, విపత్కర పరిస్థితి. దాదాపుగా మన దేశములో ప్రతి ఒక్కరూ ఏదోవిధముగా సరికొత్త పరిస్థితులను ఎదుర్కోవాల్సివచ్చింది? దానికి పర్యవసానము ఏమిటి? ఎవరికి వారు ఆలోచించుకోవాల్సిన సమయం ఇది.


సాటి మనిషికే కాదు, జంతు జీవజాలమునకు కూడ హితము చేకూరాలని కోరుకోవటమే కాదు తగురీతిన ప్రవర్తించటం మనిషి యొక్క సహజగుణం. మనము అవతల వారికి మేలు జరగాలని ఆకాంక్షిస్తే సరిపోదు, తగురీతిన జీవించిననాడే వారికి హితం చేకూరుతుంది. "ముఖానికి కవచం ధరించి (మాస్కు), ఆరడుగులు భౌతికదూరం ఉంటూ, తరచు చేతులు శుభ్రపరచుకుంటూ ఉండటము వలన కరోనా నుంచి రక్షించ బడతాము అని మనము అనుకుంటూ, ఇతరులకు చెప్పటము ద్వారానే కాకుండా, చేప్పేవారు, వినేవారు ఇద్దరూ పాటించటము ద్వారానే భౌతికంగా మనము సంపూర్ణ రక్షణ పొందినట్లుగా, అన్ని విషయాలకు ఇది వర్తిస్తుంది. "సర్వేజనా సుఖినోభవంతు, లోక సమస్తా సుఖినోభవంతు" అని అనుకుంటే, అంటే సరిపోదు. తగురీతిన మన ఆచరణ తోపాటుగా, ప్రతి ఒక్కరూ తగురీతిన, ప్రవర్తించిననాడు మనమే ఇతరులకు నిజమైన శ్రేయస్సు కలిగించిన వారలము అవుతాము. "బోధించే దేముంది, చెట్టును చూసి నేర్చుకో!" అన్నారు శ్రీసాయి. "ప్రకృతి అంతా తన వంతు చందాలేసుకొని మనిషి మనుగడ సవ్యంగా సాగటానికి సహకరిస్తున్నాయి, ఉదయం నిద్ర లేచిన దగ్గరనుండి రాత్రి పడుకొనేబోయే వరకు, కట్టుకునే వస్త్రం దగ్గరనుండి తినే తిండితోపాటు, ఉపయోగించుకునే ప్రతి వస్తువు, ప్రకృతినుంచి రూపాంతరం చెంది మనకు లభించినవే. ప్రకృతి కరుణించకపోతే, చేతినుండి నోటికి అన్నం ముద్ద రాదు. అది తెలిసి ప్రకృతి పట్ల, సాటి జీవుల పట్ల కృతజ్ఞత గలిగి ఉండమని ప్రకృతి బోధ. మనం తినే ప్రతి ముద్దకు మనం జవాబుదారీ కావాలి" అంటారు శ్రీ భరద్వాజమాస్టారుగారు శ్రీ పాకలపాటి గురువుగారి చరిత్రలో. అతిథి అంటే ఐదున్నర అడుగుల మనిషి, బ్రాహ్మణుడే అని నీభావన. ఆకలి గొన్నవన్నీ ఆహారం కోసం అన్వేషిస్తూ ఉంటాయి. "కాకబలికి సమృద్ధిగా అన్నం బయట విడిచి పెట్టిరా! దేనిని పిలవ వద్దు, తరమవద్దు అలాచేస్తే నీవు లక్షలాది మందిని సత్కరించినట్లే" అన్నారు శ్రీసాయి. "సాయి అంటే ఐదున్నర అడుగుల మనిషి, శిరిడీలోనే ఉన్న భౌతికరూపం అనుకుంటే నీవు నన్ను అసలు చూడనట్లే నీవు చూసేదంతా కలసి నేను" అనటమే కాకుండా, మన కంటికి కనిపించే సకల చరాచర దృశ్యమానమంతా తన స్వరూపమేనని శ్రీశిరిడీసాయిబాబా ప్రత్యక్ష అనుభవాలను కూడ ప్రసాదించారు.

"లివింగ్ ఇన్ ద ప్రజన్స్", " ఆర్ట్ ఆఫ్ ది లివింగ్" – "వర్తమానంలో జీవించు, ఎలా జీవించాలో తెలుసుకొని జీవించు" అంటారు మాస్టర్ ఇ.బి. "గతం చిత్తుకాగితం, వర్తమానం వార్తాపత్రిక, భవిష్యత్ ప్రశ్నాపత్రం, జీవితం జవాబు పత్రం" అని ఎక్కడో చదివినట్లు గుర్తు. గతంలోని అనుభవాలను సోపానాలుగా మార్చుకొని వర్తమానంలో జీవిస్తూ భవిష్యత్తుకు బాటలు వేసుకోవటమే మన కర్తవ్యం. ఆ కర్తవ్య నిర్వహణలో అలసత్వం, అలసట కూడదు, తద్వారా మనము భావితరాలకు అందమైన సౌధాన్ని అందించగలము. మన జీవితమే కాదు, సృష్టిలోని ప్రతిజీవి జీవితం భగవంతుడు ప్రసాదించిందే. గడ్డిపరక నుంచి చెట్టువరకు చలి చీమ దగ్గరనుండి గజరాజు వరకు, పిచ్చుక నుంచి గ్రద్ద వరకు ప్రకృతిలోని ప్రతిదీ భగవంతుని సృష్టిలోని భాగమే మనతో కలిసి పుట్టిన ప్రతి జీవి గతించే వరకు, ప్రతిదీ ప్రకృతికి ఏదో ఒక రూపంగా సహకరిస్తూనే ఉన్నాయి. గడ్డి తిని పాలనిచ్చే పశువులు విసర్జించిన పదార్థము

కూడ అనేక రూపాలుగా ఉపయోగపడుతున్నది, మరి మనిషి సంగతి ఏమిటి?కేవలం భౌతిక శుచి, శుభ్రత మాత్రమే సరిపోదు, దానికి తోడు అంతరంగం పరిశుద్ధమై ఉండాలి. మరి మనలాగే భౌతికరూపం కలిగి ఎటువంటి పరిశుభ్రత లేక, అపరిశుభ్రమైన ప్రదేశాలలో ఉన్నా, అవధూత నుంచి సుగంధమే రావటానికి కారణం! కళ్ళు పుసులుకట్టి, జుట్టు జడలు కట్టి, వస్త్రాలు చినిగిపోయి, ఎన్నో రోజులుగా స్నానం చేయని కారణంగా మురికిగా కనిపించే శరీరంతో బోధకాలు నుంచి కారే రసిపై ఈగలు వ్రాలు తుండగా, ఒక మురికి కాలువ ప్రక్కన గల చెత్తకుండీ దగ్గర కూర్చొని చీరాలలో జనులకు దర్శనమిచ్చే అవధూతను దగ్గరనుండి పరికిస్తూ, అటుగా వెళ్ళేవారు వారినుంచి వెలువడే సుగంధ భరితమైన వాసనలు చూసి, ఆశ్చర్యపోయి అవధూత చీరాలస్వామిని "సువాసనలస్వామి" అని పిలుస్తూ వారి చెంతచేరి, తమ జీవితాలను ధన్యత చెందించుకున్నారు. కనుక బాహ్యశుచి మాత్రమే కాకుండా, అంతఃశుచిని కలిగిన నాడు మనం మనుషులుగా మనగలుగుతాము. మంచిలో కూడ చెడును చూడటం మాని, ప్రతి చెడులోను మంచిని గ్రహిస్తూ, దానిని పెంపొందించుకుంటూ ముందుకు సాగటం ద్వారా జీవిత పరమార్ధం నేరవేర్చుకోగలుగుతాము. "పోటీలు, వంతులు, కీచులాటలు మాని, భగవంతుడు ఎట్లా సృష్టించాడో, ఎలా స్పృశించాడో అట్లా ఉండటముతో తృప్తిపడు, రాజై ఉండికూడ భిక్షగాని దుస్తులు ధరించే వాడే (సామాన్యముగా జీవించేవాడే) నాకిష్టుడు. రుచులకు పోవద్దు, ఒకటి రెండు వంటకాలతో తృప్తిపడు, ఆకలిగొన్నవారికి అన్నం పెట్టు, గుడ్డలు లేనివారికి వస్త్రాలు ఇవ్వు. ఎవరైనా నీ దగ్గరకు వస్తే ఇవ్వశక్యమైతే ఇవ్వు లేదా ఇప్పించు అంతేకాని అవహేళనచేయవద్దు, దేనినీ చులకనగా చూడవద్దు, అంతటా అన్నిటా నేనే ఉన్నాను అని గుర్తించు" అన్న సాయి బోధలు మనకు శిరోధార్యం కావాలి. చీకటికి వెలుతురంటేను, వెలుతురుకు చీకటంటే భయం. నీ జీవితంలోకి చీకటి అనే అజ్ఞానాన్ని చేరనీయకు" అంటూ బాబా మశీదులో నిరంతరం దీపాలు వెలిగించటమే కాకుండా లెండీ వనములో అఖండ దీపాన్ని వెలిగించారు. జ్ఞానమనే వెలుగు ప్రసరించినంత మేరకు, అజ్ఞానమనే చీకటి పటాపంచలయిపోతుంది. పరిసరాలలోని చెత్తాచెదారము తీసి, పరిశుభ్ర పరుస్తాము, అలానే మన హృదయంలో వెలిగే సద్గురుజ్యోతి వెలుగులో మనలోని మాలిన్యాలు, చెడుభావాలను తొలగించుకొని, హృదయాన్ని పరిశుభ్రపరచుకుందాము. ఒకజ్యోతి మరొకజ్యోతిని వెలిగించినట్లు, గుండె గుడిలో వెలిగే సాయిజ్యోతిని మరొక గుండెలో వెలిగేలా ప్రయత్నిద్దాము. అందుకు శ్రీసాయిచరిత్ర, శ్రీగురుచరిత్ర పారాయణ  చేస్తూ అందులోని బోధలు అర్థంచేసుకొని ఆచరించటము ద్వారా మనకే కాదు, సాటివారికి కూడ శ్రేయస్సు కోరటముతో పాటు, కలిగించిన వారలము అవుతాము. జీవితంలో ఎదురయ్యే ప్రతి సంఘటన ఒక పాఠం నేర్పుతూనే ఉంటుంది. గతించిన దానిని గురించి విచారించే దానికన్నా, వర్తమానంలో జీవిస్తూ, జీవన విధానంలో సంభవించిన దానిలోని ఉన్నతమైన విధి విధానాలను, విలువలను పెంపొందించుకుంటూ, సమాజ శ్రేయస్సుతో కూడి మన శ్రేయస్సు ముడిపడి ఉందని ఎరుక కలిగి జీవిద్దాము. మార్పు అనేది వ్యక్తితో ప్రారంభమయ్యి, సమిష్టిగా మారి వ్యవస్థ మార్పుకు దారితీస్తుంది. అందరికీ సుఖసంతోషాలతో, పాటు నూతన క్రాంతి, ఉత్సాహం ఉత్తేజం కలిగించే దిశగా, ప్రతి ఒక్క అడుగు ముందుకు సాగాలని మనసారా కోరుకుంటూ, ఆ శక్తిని సర్వులకూ ప్రసాదించాలని శ్రీదత్తసాయి భరద్వాజులను మనసారా కోరుకుంటున్నాము.

విశ్వరూపుడైన శ్రీసాయి స్వరూపులైన అవధూతలను, మహాత్ములను తాను దర్శించి, శ్రీసాయి విశ్వతత్వాన్ని సాయిభక్త కోటికి తెలిపి, నిర్దుష్టమైన శ్రీసాయిమార్గంలో పయనింప చేస్తూ, శ్రీసాయిమాస్టర్‌గా వినుతికెక్కిన ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి అనుగ్రహమార్గమైన నిర్దేశకత్వంతో జగద్గురువు అయిన శ్రీసాయి విశ్వతత్వాన్ని, సర్వులతో పంచుకుంటూ, పెంచుకుంటూ సాగే అక్షరయజ్ఞ రూపమే "శ్రీ భరద్వాజ సద్గురువాణి". తద్వారా లక్షలాదిమంది సాయిభక్తులు అనేక విధాలుగా శ్రీసాయికృపకు పాత్రులవుతున్నారు. సముద్రములో నీటిబిందువు వంటి అక్షర సహకార ప్రయత్న దిశగా సాగే 'శ్రీభరద్వాజ సద్గురువాణి' ద్వారా ఆ యా సందర్భాలను అనుసరించి సాయి స్వరూపులైన అవధూత, మహాత్ముల బోధనలను, సూక్తులను మీతో పంచుకోవటానికి ప్రయత్నిస్తున్నాము.

శ్రీ సాయిమాస్టర్ స్ఫూర్తితో మేము చేస్తున్న సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొన్నవారు, మేలు పొందినవారు దానికి ప్రతి ఫలంగా, సహృదయంతో, స్వకార్యం, శ్రీసాయి కార్యం అన్న భావనతో ఇచ్చిన ప్రకటనలను పత్రికలో ప్రచురిస్తున్నాము. వీటన్నిటిని మించి, పాఠకుల దేవుళ్ళు అయిన మీ అందరి అండదండలు, ఆదరాభిమానములే మాకు అక్షర లక్షలు అయ్యి మీ అందరి ఆదరాభిమానాలతో దినదినా ప్రవర్ధమానమవుతూ **రెండు దశాబ్దాలు పూర్తి చేసుకొని 21వ వసంతం లోనికి "శ్రీభరద్వాజ సద్గురువాణి" అడుగిడుతున్న శుభ సందర్భములో** "జన్మదిన ప్రత్యేక సంచిక"గా ఎక్కువ పేజీలతో, ఆదర్శమూర్తి, స్ఫూర్తిప్రదాత, సంప్రదాయాలు, బాలవికాసం, పుస్తక పరిచయం మొదలైన అనేక నూతన శీర్షికలతోపాటుగా, కొన్ని శీర్షికలలో మార్పు తీసుకురావటానికి మా ప్రయత్నం ప్రారంభించాము, అవి మిమ్ములను అలరిస్తాయని ఆశిస్తూ,



"శ్రీ భరద్వాజ సద్గురువాణి" మీ హృదయవాణిగా తీర్చిదిద్దే విధముగా అహర్నిశలు మేము మావంతు కృషి చేస్తామని, దానికి మీ సలహా, సూచన పూర్వక ఆదరాభిమానాలు తోడవ్వాలని కోరుకుంటూ, మాకు వెన్ను దన్నుగా నిలచి ముందుకు నడిపిస్తున్న ప్రతి ఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతా పూర్వక నమస్సుమాంజలులు సమర్పించుకుంటూ...

**మీ పబ్లిషర్**

**సంక్రాంతి మరియు మహాశివరాత్రి శుభాకాంక్షలతో**

**శ్రీమతి వి.యస్. లక్ష్మీ పూర్ణచంద్రరావు**

# అవధూత శ్రీ రామిరెడ్డి తాత

కర్నూలు జిల్లా కల్లూరులో కొలువు తీరి "రామిరెడ్డి తాత"గా "రామావధూత"గా భక్తులచే కొలువబడి, పూజింపబడిన అవధూత, భక్తులపట్ల ప్రేమాభిమానములను కురిపిస్తూ, తల్లిలా ఆదరిస్తూ, భక్తులు కోరిననూ, కోరకున్ననూ వారి లౌకికపరమైన కష్టములను, సమస్యలనూ, కర్మలనూ తీసివేయడమే కాక, వారి ఆధ్యాత్మికోన్నతికి సరియైన మార్గము చూపించిన కరుణామూర్తి శ్రీరామిరెడ్డి తాత. పరిపూర్ణ అవధూత లక్షణములను సంపూర్ణముగా కలిగిన తాత శరీరధర్మములైన కాలకృత్యములను విధిగా పాటించేవారు కాదు. వారు ముఖము కడిగినా కడగకున్ననూ, స్నానమాచరించినా ఆచరించకున్ననూ ఒక సుగంధ పరిమళం నిత్యమూ వారి శరీరము నుండి వెలువడు చుండేది. అంతేకాక భక్తులను తృప్తిపరచుటకు ఒకేఒక్కరోజునందే పదిసార్లు భుజించగలిగిన తాత ఊరికి ఏదైనా ఒక కష్టము దాపురించినపుడు గాని, ఎవరినైనా ఆపదనుంచి తప్పించవలసి వచ్చినప్పుడు గాని పదిరోజులైనాసరే అన్నపానీయములకు దూరముగా ఉండేవారు. నిద్ర విషయములో కూడా తాత ఇదే పద్ధతిని అనుసరించేవారు. తాత తాను భగవంతుడినని ఎప్పుడూ చెప్పకుండా "ప్రభువు" (దైవము) అని తరచు చెపుతుండేవారు. అందరినీ రక్షించి కాపాడేది తాతే అయినప్పటికీ అది దైవము చేస్తున్న పనిగా చెప్పేవారు.



తన విషయము తానేదైనా చెప్పవలసి వచ్చినప్పుడు కూడా తాత వేరు, ఈ శరీరము వేరు అన్నట్లుగానే సంభాషించేవారు, అనగా ఎవరైనా తాతకు భోజనము పెట్టదలచిన తాతకు తినడం ఇష్టము లేకపోతే ''వాడు తిననంటున్నాడు' అనేవారు. శ్రీ రామిరెడ్డితాత బోధనావిధానము అత్యంత సులువుగాను మధురముగాను, సున్నితముగాను ఉండెడిది. ఈ ఉపదేశములను ఒక్కొక్క అవధూత ఒక్కొక్క పద్ధతిద్వారా స్పష్టపరచేవారు. ఏ విధముగా బోధించినప్పటికీ ఆ విషయము సూటిగా భక్తుల హృదయాలలో హత్తుకుపోయి ఆ ఉపదేశములు వారికి అత్యంత ఉల్లాసమును, సంతోషమును కలిగించుచుండెడివి. ఈ విషయములో తాతగారు పాటించు పద్ధతి ఎంతో ఆహ్లాదముగా సాగేది. తాత తాను చెప్పదలచుకున్న విషయమును కానీ, భక్తుల వ్యవహారశైలి కానీ, ఆధ్యాత్మిక ఉన్నతిని కానీ పాటల రూపములో అత్యంత మృదుమధురముగా గానం చేసి భక్తుల సమస్యలకు పరిష్కారమును, వారు చేయు తప్పులకు జవాబులు వంటి అనేక సందేశములు ఆ పాటల ద్వారా తెలియపరచేవారు.

తానున్నదే తరింపచేయుట కొరకు కాబట్టి తాత భక్తులను తన వద్దకు రప్పించి వారి కష్టములను కడతేర్చేవారు. తాతగారు సిగరెట్టు కానీ, బీడీకానీ తాగడం ద్వారా వారి బాధలను బాపేవారని భక్తుల నమ్మకము. అందుకనే తాతగారి వద్దకు ఎవ్వరు ఏ సమస్యతో వచ్చినా తాత ఒక బీడీనో, సిగరెట్టో తాగితే తమ సమస్య పరిష్కరింపబడినట్లు భావించేవారు, అంతేకాక తాతగారు కూడా ఊళ్ళో ఎవ్వరికే ఆపద సంభవింపబోతున్నా అపరిమితముగా బీడీలు కాల్చి పడేస్తుండేవారు.

అత్యంత కరుణామూర్తిగా వెలుగొందిన తాత ఎప్పుడు ఎవ్వరికి ఏ కష్టము వచ్చినా ఆదరించి అక్కున చేర్చుకునే వారు. అయితే తాత ఎంత కరుణామయుడో అంతకన్నా ఎక్కువ కాఠిన్యమూర్తి. భక్తుల చిన్న తప్పునైనా తాత ఉపేక్షించేవారు కారు. తాత ఎప్పుడూ 'సిస్టమ్' అని అంటుండేవారు. అనగా ప్రతి మనిషి క్రమశిక్షణతో ఉండి ఎటువంటి తప్పులు, పొరపాట్లు చేయరాదని తాతభావము.

సంఖ్య ఎంతగా పెరుగుతున్నప్పటికీ మొదటినుంచీ తాత నిర్వికారముగా, ఆడంబరములకు అతీతుడుగానే ఉండేవారు. వెల్లువలా తరలివచ్చు భక్తుల ఒరవడిని ఎప్పటికప్పుడు నిలువరిస్తూనే తన సహజస్థితియందు తాను ఉండెడివారు. నిరాడంబరముగా, నిష్కల్మషభక్తితో నిశ్శబ్దముగా చేయు ఆరాధనను అనుగ్రహించు తాత అట్టహాసములకు, ఆడంబరములకు ఎప్పుడూ అతీతుడుగానే ఉన్నారు.

తన కరుణా హృదయముతో, కృపాకటాక్షములతో భక్తుల పాప కర్మలను ధ్వంసము చేయుటయే కాక విశేషముగా లోక కళ్యాణ కార్యక్రమములు కావించుట ద్వారా సమాజములో ధర్మము ప్రతిష్ఠించి, శాంతి సౌఖ్యములు విరసిల్లేలా చేసి దేశ వ్యాప్తముగా భక్తుల బాధలు బాపి వారి యోగక్షేమములు సదా పరిరక్షించే శ్రీరామిరెడ్డి తాత 15-1-1993 కనుమ రోజు తమ భౌతిక దేహం వీడి సృష్టి చైతన్యంలో నిలచారు. వారి భౌతిక శరీరాన్ని కల్లూరులోని వారి స్వగృహములోనే సమాధిచేసి దానిపై పాలరాతి విగ్రహం ప్రతిష్ఠించటము జరిగింది. నేడు ఆ నివాసము ఎందరో భక్తులకు ఆవాసమైనది.

స్వామి సమాధి మందిరం కర్నూలు జిల్లాలో కర్నూలు పట్టణమునకు వెలుపల కల్లూరు గ్రామములో కలదు.


(జనవరి 15వ తేదీ కనుమ-శుక్రవారము-అవధూత శ్రీరామిరెడ్డితాత ఆరాధనోత్సవము సందర్భముగా సమర్పణ)

సేకరణ : **శ్రీమతి ఆర్. సాయిసృజన, బెంగుళూరు**

# నూతన సంవత్సర సందేశము

ప్రజలలో ఈ మధ్య ఆధ్యాత్మిక భావన చాల బాగా పెరిగిపోయింది అనిపిస్తుంది. మందిరాలన్నీ జనాలతో కిటకిటలాడి పోతున్నాయి. టి.వి.ఛానెళ్ళలో గంటలు గంటలు ఆధ్యాత్మిక ప్రసంగాలు కనబడుతున్నాయి. ఎక్కడ చూసిన రకరకాల దీక్షాదారులు కనపడుతున్నారు. ఇదంతా ఆధ్యాత్మికమేనా? అదే నిజమైతే దేశంలో నేరాలు, ఘోరాలు కూడా అదే స్థాయిలో పెరిగిపోయాయి కదా! గుళ్ళు ఎలా నిండి ఉన్నాయో, జైళ్ళ పరిస్థితి కూడా అలానే ఉంది. కాబట్టి ఆధ్యాత్మికత అంటే ఏమిటో లోతుగా ఆలోచించి చూద్దాం.

చాలా మంది ఆధ్యాత్మిక చింతన వృద్ధాప్యంలో ఉండాలని భావిస్తారు. జీవితంలో తాము కోరుకున్న కోర్కెలు నెరవేర్చుకోవటానికి అన్ని ప్రయత్నాలు చేసి అవి సఫలం కానప్పుడు భగవంతుడిని ఆశ్రయిస్తారు. అదే ఆధ్యాత్మికత అని భావిస్తారు. అందుకే మాస్టర్‌గారు స్పష్టంగా చెప్పారు "ఆధ్యాత్మికత మన కోర్కెలు తీర్చుకొనే సాధనం కాదు". ఎందుకంటే ఎన్ని కోరికలు తీరినా మరిన్ని కొత్త కోరికలు పుట్టుకొచ్చి వెనుకటి ఆనందం కూడా మాయం అవుతుంది. ఎలాగంటే ఒక పిల్లవాడు రోడ్డు ప్రక్కన ఏడుస్తూ ఉన్నాడట. అటుగా వెళుతున్న ఓ పెద్ద మనిషి కారణం అడిగితే తన రూపాయి పోయిందని చెప్పాడట. అప్పుడు జాలిపడ్డ ఆయన ఒక రూపాయి తీసి ఇచ్చాడట. ఆ రూపాయి



చూసిన ఒక క్షణం ముఖం వెలిగింది ఆ పిల్లవాడికి. మళ్ళీ ఏడుపు మొదలైంది. ఇప్పుడు ఏమైందిరా బాబు అంటే "పోయిన రూపాయి కూడా ఉంటే ఇప్పుడు రెండు రూపాయలు అయ్యేవి కదా! అన్నాడట ఏడుస్తూ. అలా ఉంటుంది మన జీవితం. అసంతృప్తి మనిషిని కాల్చేస్తూ ఉంటుంది. ఉద్యోగాలు, పదవులు, ధనవ్యామోహాలు, ఈ వరుసకు అంతం ఉండదు. మనం చేసే పని ఏలాంటిది అంటే ఎప్పటికప్పుడు కొమ్మలు నరికేయటం లాంటిది. మళ్ళీ కొత్త కొమ్మలు పుట్టుకొస్తూనే ఉంటాయి. ఈ సమస్య పరిష్కారం అవ్వాలంటే మూలాన్ని పెరికివేయాలి. దీనికి పరిష్కారం – ఆత్మజ్ఞానమే!

ఈ సృష్టి అంతా చైతన్యమయమని అదే చైతన్యం మనలో కూడా "నేను" అను ఎరుకగా ఉందని మహాత్ములందరూ చెబుతున్నారు. మనిషి సాధన ద్వారా తాను దేహ పరిమితుడని కానని, అంతటా ఉన్న చైతన్య స్వరూపుడనని అనుభూతి పొందటమే ఆత్మజ్ఞానమని, అదే మన జీవిత లక్ష్యం అని అన్ని మతాలు, అందరు మహాత్ములు బోధిస్తున్నారు. ఆ "నేను"ను తెలుసుకొని అనుభూతి పొందటమే ఆధ్యాత్మికత యొక్క లక్ష్యం. మిగతా సాధనలన్నీ దానికోసం మనం చేసే ప్రయత్నాలే. ఆ స్థితి పొందనంత వరకు కష్టాలు, సుఖాలు రెండూ తప్పవు. ఈ అవగాహన కలిగినప్పుడే మనకు ఆధ్యాత్మికత అంటే ఏమిటో అర్ధమైందని గ్రహించాలి.

ఇది వాచా అర్ధమైనంత మాత్రాన ఉపయోగం లేదు. ఈత ఎలా కొట్టాలో పుస్తకం చదివి ఈత కొట్టినట్లుంటుంది. సమర్ధుడైన ఈతగాడు తోడుంటే తాను ఈదుతూ, మనలను ఒడ్డుకు చేరుస్తాడు. ఇది తెలియక చాలా మంది ఎక్కువ ఉపన్యాసాలు వినటమే ఆధ్యాత్మికత అనుకుంటారు. అలాంటి వారు ఈ సంఘటనను గమనించాలి. షేగావ్‌లో గజానన్ మహారాజ్ ఉన్న చోటుకి ఒక సన్యాసి వచ్చాడు. అతడు పిచ్చివాడిలా ఉన్న స్వామిని చూసి అసహ్యించుకున్నాడు. గొప్పగా గీతా ప్రవచనం మొదలుపెట్టాడు. ఆత్మ నశించదని, దానిని కాల్చలేమని, తడుపలేమని... ఇలా మహోపన్యాసం చేస్తున్నాడు. ఇంతలో గజానన్ మహారాజ్ పీలుస్తున్న హుక్కాలోనుంచి కొన్ని నిప్పురవ్వలు మంచం మీదపడి మంచం కాలటం మొదలైంది. స్వామి నిశ్చలంగా కూర్చొని ఆ ప్రవచనకారుడితో "ఏమయ్యా ఆత్మను కాల్చేయలేమని అన్నావు కదా! వచ్చి మంచం మీద కూర్చో అన్నారు". అతనికి బుద్ధి వచ్చి స్వామి కాళ్ళ మీద పడ్డాడు. అందుకే ఆత్మజ్ఞానులను ఆశ్రయించమని శాస్త్రాలు బోధిస్తాయి.

అటువంటి ఆత్మజ్ఞాని అయిన సద్గురువును ఆశ్రయించటం ఆధ్యాత్మికతలో ముఖ్యమైన ఘట్టం. ఎందుకంటే ఆధ్యాత్మికత అంటే ఏమిటో తెలిసినా అనేక జన్మలుగా ఏర్పడిన దుష్ట సంస్కారాల వల్ల మనము జ్ఞానము పొందలేము. దీనికే రామకృష్ణులు ఒక ఉదాహరణ చెబుతారు "గ్రద్ద ఎంత ఎత్తుకు ఎగిరినా శవాలపైనే దృష్టి ఉంటుంది. అలాగే ఎంత శాస్త్రజ్ఞానము, పాండిత్యం ఉన్నా మనస్సు లౌకిక విషయాల మీదే లగ్నమై ఉంటుంది" అని.

సమర్ధుడైన సద్గురువు ఈ సృష్టి అంతా తన స్వరూపమేనని భక్తునికి అనుభవం ఇస్తాడు. అటువంటి సద్గురువులలో మేటి శ్రీ సాయినాధుడని, ఆయనను ఆశ్రయించటమే ఈ కలియుగంలో భద్రమైన మార్గమని మాస్టరుగారు తెలియజేశారు. సరియైన దేవతోపానన సద్గురువును చూపిస్తుందని శాస్త్రం. శ్రీమన్నారాయణుడు తనను ఉపాసించిన రేగేను సాయినాధుని ఆశ్రయించమని చెప్పటం, సప్తశృంగిదేవి తన పూజారిని సాయినాధుని వద్దకు పంపటం లాంటి సంఘటనలు ఈ సత్యాన్ని ధృవపరుస్తున్నాయి. నందిశర్మను చన్దలాపరమేశ్వరి, భువనేశ్వరి దేవి విద్యకోసం తనను ఆశ్రయించిన భక్తుని శ్రీగురుడి వద్దకు

పంపటం కూడా "శ్రీగురుచరిత్ర"లో చూడవచ్చు.

శ్రీ సాయినాథుడు వంటి సద్గురువును ఆశ్రయించటంతో సరిపోదు. ఆయన చెప్పినది ఆచరించగలిగినప్పుడు (లేదా ఆ ప్రయత్నం మొదలు పెట్టినప్పుడు) ఇంకొక మెట్టు ఎక్కామని గుర్తుంచుకోవాలి. సమర్థుడైన వైద్యుడిని రోజూ దర్శించి, దణ్ణం పెట్టుకుంటే మన రోగం తగ్గదు కదా! ఆయన ఇచ్చిన మందులు వాడుతూ, పత్యం పాటిస్తే మన రోగం తగ్గుతుంది. ఆధ్యాత్మికత కూడా అంతే! మరి సాయినాథుడు ఆధ్యాత్మికత గురించి ఏం చెప్పారు.

ఒక పెద్ద భవనం కట్టాలంటే ఏం చేయాలి? లోతుగా పునాది తీయాలి. లేకపోతే ఎంత పెద్ద భవనమైన కూలిపోతుంది కదా! అందుకే సాయినాథుడు బ్రహ్మము, మాయ వంటి పెద్ద పెద్ద మాటలు వాడలేదు. ముందుగా మనము చిన్నగా భావించే విషయాలపైనే దృష్టి పెట్టారు. అవి సరిచేసుకొన్నాకనే ముందుకు వెళ్ళమని చెప్పారు. స్వామి వివేకానందుడు అంటారు "ఒక వ్యక్తి గొప్పతనం అతడు చేసిన మహత్కార్యాలను బట్టి అంచనా వేయకూడదు. ప్రతి పనిని, అది చిన్న పెద్ద అని లేకుండా శ్రద్ధగా చేస్తున్నాడా అన్న దానిని బట్టి అంచనా వేయాలి". "యోగం అంటే ముందు చిన్న విషయాలను అభ్యసించడంతో మొదలుపెట్టాలి. ఎక్కడ తీసిన వస్తువు అక్కడే పెట్టడం, గేటు తీసుకొని లోపలికి వస్తే మళ్ళీ గేటు వేయటం, మన ప్రవర్తన వల్ల ప్రక్కవారికి ఇబ్బంది కలగకుండా చూసుకోవటం కూడా యోగమే" అని శ్రీ ఎక్కిరాల కృష్ణమాచార్యులుగారు అంటారు. సాయినాథులు వారు చెప్పిన ముఖ్యమైన మాట "ఒప్పుకున్న పనిని సక్రమంగా నిర్వర్తించు, లేకపోతే ఒప్పుకోకు". ఆధ్యాత్మికత అంటే ముక్కు మూసుకొని కూర్చోవటమే కాదని ఆయన చెప్పారు. పాడుబడ్డ స్థలాన్ని బాగుచేసి, మొక్కలు నాటి, తోటను పెంచి, సాటివారికి ఉపయోగపడే పనులు చేయాలని చేసి చూపించారు.

ఆధ్యాత్మికత పేరుతో మూఢ నమ్మకాలు పెంచుకోవద్దని చెప్పారు. కట్టెల బండిని నిషేధించిన ఊరి పెద్దలు మాట దాటి, కట్టెలు వేయించుకున్నారు. మనస్సును, ఇంద్రియాలను నిగ్రహించుకోకుండా కేవలం శరీరాన్ని శిక్షిస్తే ఉపయోగం ఉండదని చెప్పడానికే ఉపవాసాన్ని నిరసించారు. అతిథి సేవ అంటే మానవులను అందులో బ్రాహ్మణులను మాత్రమే అతిథిగా భావించవద్దని, మన దగ్గరకు వచ్చిన ప్రతి జీవిని భగవంతుని రూపంగా భావించి దానికి ఆహారమివ్వమని బోధించారు. మతాచారాలను మూఢంగా అనుసరిస్తూ ఇతరులను ద్వేషించటం తప్పని కేల్కర్‌కు తెలియజేశారు. ప్రక్క గదిలో ఉల్లిపాయలు తరుగుతున్న నాచ్నే అత్తగారిని ఏకాదశినాడు ఉల్లివాడుతున్నావేమిటి? అని మందలించాడు, కాసేపటికి అతని మనవరాలు కళ్ళ వెంబడి నీళ్ళు కారుతూ బాధపడుతుంది. అప్పుడు కేల్కర్ సాయి దగ్గరకు పరిగెడతాడు. ఉల్లిపాయలతో కాపడం పెట్టమంటారు బాబా. ఇప్పుడు ఉల్లిపాయ ఎక్కడ నుండి తేవాలి అన్న కేల్కర్‌తో ఆ తల్లిని అడగమంటారు బాబా. ఈ లీల ఉద్దేశ్యం మనకు నచ్చిన ధర్మాలను మనం పాటించవచ్చు కాని ఇతరులను ద్వేషించి, నిర్బంధించే హక్కు మనకు లేదని బాబా తెలియచెప్పారు.

ఈ మతాచారాలను మూఢంగా పాటించినంత మాత్రాన ఉపయోగం లేదని, రాగ ద్వేషాలను తొలగించుకోవాలని తెలపటానికే, వాడాలో సాటివారి గురించి చెడుగా మాట్లాడిన వ్యక్తితో, ఇటువంటి పనులు మానినంత వరకు షిరిడికి వచ్చినా ప్రయోజనం లేదని హెచ్చరించారు. ఇవేకాక "పూనకాలు, ప్రశ్నలు చెప్పించుకోవటాలు, పటాలనుండి విబూధి, తేనే మొదలైనవి రాలటం" ఆధ్యాత్మికత పేరుతో జరిగే మోసాలు మాత్రమే, ఇవి మన విశ్వాసాన్ని, అవగాహనను దెబ్బతీస్తాయి. వేదకాల పురుషులు, పురాణాలు, సాయితత్త్వ ప్రచారకులైన మాస్టరుగారి లాంటి మహాత్ములు కూడా వీటిని నిరసించారు.

శ్రీ సాయినాథుడిని, అటువంటి మహాత్ముడిని ఆశ్రయించిన వారు వారి చరిత్ర పారాయణ, సత్సంగ స్మరణాదులు చేసుకుంటూ జీవితంలో వచ్చే కష్ట సుఖాలను సద్గురువు ఇచ్చే ప్రసాదంగా స్వీకరించగల పరిపాకాన్ని పెంచుకోగలగాలి. మనలో రాగ ద్వేషాలు పలుచబడి సాటి వ్యక్తులను సాయి స్వరూపులుగా చూడగలగటం అభ్యసిస్తే, జీవితంలోని ఒడిదుడుకులను సమంగా స్వీకరించగలిగితే, మనం సాయి సంప్రదాయంలో, ఆధ్యాత్మిక పథంలో ముందుకు వెళుతున్నామని గుర్తు. శ్రీ సాయి మాస్టర్‌ను మనందరికీ అటువంటి అవగాహనను పెంపొందించమని ప్రార్థిస్తూ, నూతన సంవత్సర శుభాకాంక్షలతో...

సౌజన్యం : **"స్వర్ణోత్సవ సంచిక"** రచన : **"జ్ఞానేశ్వర్"**



**తేదీలు : 2021 ఫిబ్రవరి 7, 8 మరియు 9**
**(ఆది, సోమ మరియు మంగళవారములు)**


**వేదిక : శ్రీ గురు భరద్వాజ బృందావనము**
**శ్రీ శిరిడీసాయిబాబా మందిర ప్రాంగణము**
**లాయరుపేట, ఒంగోలు - 2**

**అందరూ ఆహ్వానితులే**

# ఆ ఒక్క సంఘటన గుర్తుంచుకుంటే చాలు

"సిద్ధ యోగీంద్రులు"

"సద్గురువును తెలుసుకోవాలి లేకుంటే మానవ జన్మకు ఎందుకొచ్చినట్లు పిడకలు ఏరుకోవటానికా!'' అన్నారు శ్రీసాయిబాబా. "సద్గురువు గురించి ధ్యాసలేకుండా గడిపిన ప్రతిక్షణము మృత్యువును పేనేతాళ్లు" అన్నారు మాస్టర్ ఇ.బి. సద్గురువును తెలుసుకోవటము అంటే ఆయన బాహ్యమైన రూప, గుణాలు కాక ఆయన ఆంతర్యము తెలుసుకోవాలి. సాయి అంటే ఒక రూపానికి పరిమితమై, శిరిడీలో నివశించిన వారు మాత్రమే కాదు. బాబా శిరిడీలో సజీవంగా సంచరించే సమయంలోనే "సాయి అంటే ఐదున్నర అడుగుల మనిషి, శిరిడీలోనే ఉన్నాడు అని అనుకునేవాడు నన్నసలు చూడనట్లే, నీవు చూసేదంతా కలసి నేను, నా ఈ భౌతికదేహం నుంచి నా గురువు నన్ను ఎప్పుడో విడుదల చేశారు" అన్నారు. మన ఎదుట నిలచిన సాయి రూపాన్ని వదలి, సృష్టి అంతా వ్యాపించిన చైతన్య స్వరూపి అయిన బాబాని గమనించగలమా! మరల, అందుకు సాయినే ఒక చక్కటి మార్గం చెప్పేరు, "ఎదుటగా ఉన్న నా రూపాన్ని నఖశిఖ పర్యంతం చూస్తూ ఉండు, చూసే నీవు, చూడబడే వస్తువు, చూసే క్రియ లయమయ్యి, బ్రహ్మ సమరసత కలుగుతుంది. ఎదుటగా ఉన్న నా రూపాన్ని "కేవలంగా ధ్యానించు" అన్నారు సాయి. అంటే, సాయి రూపాన్ని ఆధారంగా చేసుకొని ప్రారంభించిన సాధన, విశ్వవ్యాపకుడైన సాయిని గమనించే స్థితికి చేరుతుంది. సగుణ సాకారముతో ప్రారంభమైన సాధన, సగుణ నిరాకారమై, నిర్గుణ నిరాకారములో నిలుస్తుంది. అదే సాయిని దర్శించడం, తెలుసుకోవటం. అట్లా తెలుసుకోవాలి అంటే దానికి అవరోధముగా నిలచిన మనలోని ఇష్టా అయిష్టాలను జయించగలగాలి. అసలు గురువు దగ్గరకు ఎందుకు వెళుతున్నామో, ఏమి చేస్తున్నామో, ఏమి కోరుతున్నామో, ఎందుకు కోరుతున్నామో, ఏది పొందుతున్నామో, ఎందుకు పొందుతున్నామో పూర్తిగా తెలియని మనము, "సాయి" గురించి తెలుసుకోగలగటము సాధ్యమేనా? సాధ్యమే! అంతేకాదు, అత్యంత సులభతరము కూడ, అందుకు "ఆత్మ విచారణ ఒక్కటే ఆధ్యాత్మిక విద్యలో సరియైనది" అన్న ఆర్యోక్తిని అంటిపెట్టుకొని, ఒక్క అడుగు మనము ముందుకువేస్తే, సాయి పదిఅడుగులు మనవైపు వేసి, అక్కున చేర్చుకొని, ఆదరించి, ఆయన ప్రేమను సంపూర్ణముగా పొందలేకపోవటానికి మనలో అడ్డుగోడలుగా నిలచిన ఇష్టా అయిష్టాలను తొలగించి, జ్ఞానమార్గంవైపు నడిపిస్తారు. ఈ విషయం "ఇండోర్" హైకోర్టులో జడ్జిగా పనిచేసి రిటైరయిన శ్రీ యం.బి.రేగే జీవితాన్ని పరిశీలించి చూస్తే తేట తెల్లమవుతుంది.



శ్రీ రేగేకి తాను ఆరాధించే శ్రీమన్నారాయణుడు కలలో దర్శనమిచ్చి సాయిని చూపి, "నీవు ఈయనను ఆశ్రయించి సేవించాలి" అని చెప్పినా, సనాతన సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబానికి చెందిన తాను, కుల, మత, జాతి, తల్లితండ్రుల ప్రసక్తి లేని, పాడుపడ్డ మశీదులో నివశించి, ఫకీరులా జీవించే సాయిని సేవించటం ఇష్టం లేక, ఆశ్రయించకపోయినా, పిచ్చుక కాలికి దారంకట్టి లాగినట్లు, రేగేను సాయి తన దగ్గరకు లాగగా, తన అయిష్టాన్ని పక్కనపెట్టి, శ్రీమన్నారాయణుడి ఆజ్ఞను తన ఇష్టంగా మార్చుకొని, సాయి పాదాల చెంత చేరిన వెంటనే, సాయి ప్రేమామృతాన్ని చవిచూడగలిగేడు రేగే. **జన్మతః వచ్చే సంస్కారము ఒక్కసారిగా పోదు, అది జ్ఞానాగ్ని స్వరూపుడైన సద్గురువు సన్నిధిలోనే దగ్ధం కాగలదు. అది గ్రహించి, మన ఇష్టా అయిష్టాలను ప్రక్కనపెట్టి, నిరంతరం ఆత్మ వికాసానికై కృషి చేసన్తూ, అందుకు వర్తమానంలో ఎలా జీవించాలో తెలుసుకొని జీవించడం ద్వారా మాత్రమే సద్గురువును తెలుసుకోవటానికి అవకాశము ఏర్పడుతుంది.** శ్రీ రేగే జీవితంలోని ఈ సంఘటన ఆ విషయాన్ని చాలా విపులముగా తెలియజేస్తుంది.

ఒకసారి శ్రీ రేగే బాబా చెంత కూర్చొని ఉన్నాడు, ఇంతలో ఒక భక్తుడు ఎర్రటి అరటిపండ్లు తెచ్చి బాబాకు సమర్పించాడు. అరుదుగా లభించే ఆ పండ్లు అంటే రేగేకు చాలా ఇష్టము. ఆ విషయం బాబాకు కూడ తెలుసు. చాలా కాలం తరువాత ఆ పండ్లను చూడటంతో కొన్ని పండ్లను సాయిబాబా దగ్గరనుండి తీసుకొని, ఆరగించాలని రేగే మనస్సు తహ తహ లాడింది, పైగా సాయికి అతి సమీపంగా తానే ఉన్నాడు, బాబా చేతినుంచి ముందుగా అరటిపండును ప్రసాదంగా స్వీకరించటానికి రేగే సంసిద్ధుడయ్యాడు. బాబా అక్కడి అరటిపండ్లలోనుంచి ఒక పండు

తీసి, రేగే వైపుచూసి, ఆ పండును ఒలిచి, ముక్కలుగా చేసి, ఎదురుగా ఉన్న భక్తులకు పంచివేశారు. ఆశగా చూస్తున్న రేగేవైపు పండుపై తొక్కును విసిరి తినమన్నారు సాయి. ఒక్క క్షణం ఆలోచించి సాయి ప్రసాదంగా దానిని తినివేశాడు రేగే, ఆ తరువాత రెండవ పండును కూడ వలిచి, ముక్కలుచేసి, భక్తులకు పంచి, ఆ తొక్కును కూడ రేగేను తినమన్నారు బాబా. ఈసారీ నిరాశే మిగిలింది రేగేకు. అయిష్టంగానే ఆ తొక్కును తిన్నాడు రేగే. ముచ్చటగా మూడవ పండును కూడ వలిచి, భక్తులకు పంచి, ఆ తొక్కును కూడా రేగే వైపు విసిరేరు బాబా, దానిని ఒడిసి పట్టుకున్న రేగే, కళ్ళకు అద్దుకుని నెమ్మదిగా ఆ తొక్కును తింటూ, ఎందుకిలా జరిగింది అని ఆలోచించసాగేడు రేగే. "రుచులకు పోవద్దు, ఒకటి రెండు పదార్థాలతో తృప్తిపడు" అని బోధించటమే కాకుండా, ఘన పదార్థాలు అన్నీ జోలెలోను, ద్రవ పదార్థాలన్నీ రేకు డబ్బాలోను భిక్షగా స్వీకరించి, మశీదుకు వచ్చి, ఒక కుండలోవేసి, అన్నిటిని కలిపి అందరికీ ప్రసాదం పంచి, తాను స్వీకరించి, ఆదర్శముగా నిలచారు బాబా. అటువంటి శ్రీ సాయినాధుని ప్రేమను చూరగొని, ఆయన ప్రేమామృతాన్ని గ్రోలుతున్న నేను, నా చదువు, సంస్కారము, జ్ఞానాన్ని, విచక్షణను, ఆర్థిక స్తోమతను పక్కన పెట్టి, ఒక భక్తుడు తెచ్చిన పండు రంగు, రూపు చూసి, జిహ్వాచాపల్యంతో ముందుగా బాబా నాకే ఇవ్వాలి, ఇస్తారు అని భావించటము ఎంత నీచము. "జితం సర్వం జితే రసే" జిహ్వను జయిస్తే, సమస్తాన్ని జయించవచ్చన్న ఆర్యోక్తిని కూడ మరచి, అత్యంత పామర గుణముతో, రుచిపట్ల అనాసక్తి కలిగిన సాయి చెంత రుచికై ప్రాకులాడినందుకు సాయి నాకు తగిన గుణపాఠమే నేర్పేరు. మొదటిది ప్రసాదంగా భావించి తిన్నప్పుడు, తొక్కులోని చేదును, పండులోని మధురత్వాన్ని మనస్సు గుర్తించలేదు, ముందు ప్రసాదంగా అరుచితో స్వీకరించిన దానిని గమనించిన సాయి, రెండవ సారికూడ తొక్కును ప్రసాదించి ఆలోచించమని, హెచ్చరించారు. అప్పుడు మనస్సు, తొక్కులోని చేదుతనాన్ని, పండులోని మాధుర్యాన్ని మరచి, సాయి బోధామృతాన్ని గ్రోలటానికి ప్రయత్నించింది, అందుకే రెండవసారి కూడ ఆ తొక్కును తినగలిగేను. ఆ భావన స్థిరం చేసుకొని కొనసాగటమే సద్గురు సాంగత్యంలో పొందే అనుగ్రహఫలం అని సాయినాధుడు నాకు తెలియజేయదలచారు. అందుకే మూడవసారి కూడ తొక్కును నావైపు విసిరేరు" అని అంతరంగ శోధన చేసుకన్న రేగే, తన చేతిలో ఉన్న తొక్కును శ్రీ సాయి ప్రేమామృతాన్ని గ్రోలుతున్న భావనతో, ఆస్వాదనతో ఆరగించాడు. అతనిలోని ఆత్మ విచారణకు, ప్రతిగా, దాని బాహ్యమైన రేగే చర్యను చూసి, బాబా చిరునవ్వు నవ్వుతూ "నేను నీకేమి ఇవ్వలేదా! ఉండు!" అంటూ నాల్గవ పండు వలిచి తాను కొంచెం తిని, "ఇది చూడు, చాలా బాగుంది" అని కొంచెం తాను తింటూ, రేగే నోటికి అందించి, తినిపించి, మరల తాను కొరుక్కొని, రేగేకు తినిపిస్తూ, అట్లా పండు అంతా పూర్తి చేశారు సాయి. తన ఇష్టాన్ని పక్కనపెట్టి, సద్గురు చర్యలోని అంతరార్థాన్ని గ్రహించటానికి ప్రయత్నం చేసిన రేగే, తాను జిహ్వను జయించటమే కాక, అత్యంత అరుదైన, అమృతతుల్యమైన సద్గురువు ఉచ్ఛిష్ట ప్రసాదాన్ని, ఆయన ఆశీర్వాదంతో అందుకునే అదృష్టాన్ని పొందేడు.

ఆశించటం కాదు, అర్హత పొందాలి అప్పుడే గురువు అనుగ్రహాన్ని చవిచూడగలము. మనం గురు సన్నిధికి వెళ్ళినప్పుడు, వారి మెడలోని దండనో, శాలువానో లేక మరేదో మనకు ప్రసాదంగా ఇవ్వాలి అని ఆశిస్తాము, కాని అందుకోవటానికి తగురీతిన మనల్ని మనము సంస్కరించుకోవటానికి ప్రయత్నించము. "బాబా దర్శనము చేసుకున్నాను, సమాధిమీది పువ్వులు తెచ్చుకున్నాను, శాలువా తెచ్చుకున్నాను, బాబా మెడలో దండలు తెచ్చుకున్నాను" అని మన బంధుమిత్రులతో చెబుతాము. సాయి స్పర్శ తగిలినవి కనుక అవి పవిత్రమైనవే, అయితే, అవి ఆశీర్వాదపూర్వక ప్రసాదం మాత్రం కాదు, చాలా మంది పాదుకలను దర్శించుకొన్నపుడు దాని చిన్న తోలుగిల్లి తెచ్చుకున్నాను, ప్రసాదమని, బాబా కూర్చొన్న వేపచెట్టు బెరడు ఒలిచి తెచ్చుకున్నాను, చాలా పవిత్రమైనది, అని తాము చేసిన దాని గురించి చెబుతారు. అవి పవిత్రమైనవే కాని, మనం చేసిన పనివలన వాటిద్వారా పొందాల్సిన సంపూర్ణ అనుగ్రహం పొందకపోగా, ఒక్కొక్క సారి విపరీత పరిణామాలు కూడ కలుగుతాయి. నేను విన్న విషయం ఒక్కటి ఇక్కడ ప్రస్తావిస్తాను. అక్కల్‌కోట మహరాజ్‌గారి పాదుకలు ఒకసారి ఒంగోలు మాస్టారిగారి దగ్గరకు వస్తే, ఒక భక్తుడు పరమ పవిత్రమైన స్వామి పాదుకలపై ఒక చిన్న శకలం ఊడి ఉంటే, ఎవరు చూడకుండా తాను తెచ్చుకున్నాడు, అది అక్కల్‌కోట స్వామి మహాప్రసాదం అని భావిస్తూ, ఆ తరువాత అతనికి ఆ రాత్రి భయంతో నిద్ర పట్టలేదు, ఆ విషయము మాస్టారుగారితో విన్నవించుకోగా "స్వామికి క్షమాపణ చెప్పి, ఎక్కడ తెచ్చింది అక్కడే ఉంచమన్నారట". అందుకని ఆశించటంకన్నా, అర్హత పొందితే సద్గురువు తన సంపూర్ణ అనుగ్రహంతో దానిని ప్రసాదిస్తారు. అది మన జీవిత గమనాన్ని ఒక ఉత్తమమైన మార్గంవైపు పయనింపజేస్తుంది. దానికి మనము చేయాల్సిన మొదటిపని, ఇష్టా అయిష్టాలను జయించటము. రేగే తన విచక్షణ జ్ఞానంతో సాయి చర్యలోని భావాన్ని గ్రహించటానికి ప్రయత్నంగా ఒక్క అడుగు ముందుకు వేశాడు, ఆమోదించిన సాయి అక్కున చేర్చుకొని, "తండ్రికి తగ్గ బిడ్డడు" అని తగురీతిలో తన ఉచ్చిస్టాన్ని అందించారు బాబా. మన జీవన గమనాన్ని ఉన్నత శిఖరం వైపు పయనింపచేస్తూ, తద్వారా సద్గురువును తెలుసుకొని, ఆయన చెంతకు చేరి, వారి సంపూర్ణమైన అనుగ్రహామృతాన్ని గ్రోలటానికి ఉపయోగించే సంఘటనలు రేగే జీవితంలో అనేకం ఉన్నాయి. అటువంటి మరొక అపూర్వ మార్గదీపిక అయిన మరొక సంఘటన గురించి వచ్చే సంచికలో ప్రస్తావించుకుందాము.







# శ్రీ గురు చరిత్రామృతము

**వివరణ : వి.వి. పూర్ణచంద్రరావు**

గురువు అంటే గుణానికి, రూపానికి అతీతమై, సృష్టి అంతటా వ్యాపించి ఉన్న చైతన్యము, సకల జనోద్ధరణకై భౌతిక రూపం ధరించి, ఆర్తులను, అర్థార్థులను చేరదీసి జిజ్ఞాసులుగా మార్చి, జ్ఞానమనే వెలుగు మార్గంలో పయనింపచేసి తన స్వరూపముగా రూపొందించటమే గురువుయొక్క అవతార లక్షణం. అటువంటి జగద్గురువు చెంతచేరి మన జీవన పగ్గాలు అర్పించి, గురువు బోధలను అనుసరించి మనుగడ సాగించిననాడు మానవ జన్మ సార్థకత చెందించుకోగలము. "సాయి అంటే ఐదున్నర అడుగుల మనిషి, శిరిడీలోనే ఉన్నాడు అని అనుకునే వాడు నన్నసలు చూడనట్లే, నీవు చూసేదంతా కలసి నేను" అని సాయిబాబా చెప్పటం లోని ఆంతర్యము అదే. పూర్వపుణ్యం వలన సాటిలేని సద్గురువు చెంతకు చేరినప్పుడు, ఇష్టా అయిష్టాలను వదిలివేసి, గురువు మాటనే శాసనముగా భావించి, వారు సంప్రీతులయ్యేలా జీవిస్తూ, మర్కట కిశోరన్యాయంగా, గురువును అంటిపెట్టుకుని నిశ్చింతంగా ఉండిపోవటమే నిజమైన శిష్యుడి లక్షణం. అప్పుడు మార్జాల కిశోరన్యాయంలా గురువు చెంతనుండి గమ్యం చేరుస్తారు. అటువంటి గురువుకోసం శిష్యుడు ఎంతగా పరితపిస్తాడో, అటువంటి శిష్యుడికోసం గురువు కూడా అంతలా ఎదురు చూస్తుఉంటారు. సద్గురువు సమాగముతో జన్మ సార్థకతకు మార్గం సుగమమవుతుంది, అప్పుడు ఆ సద్గురువు చూపిన మార్గంలో పయనం చేయటము శిష్యుడి ప్రధాన కర్తవ్యం. గురు ఆదేశాలను తు.చ. తప్పకుండా పాటిస్తూ, సర్వస్య శరణాగతి చెందటమే తాను చేయవలసింది. అడవిలోని బంజారా రూపములోని సద్గురువును గుర్తించి, శ్రీసాయి ఆత్మజ్ఞానంకోసం వారివెంట వెడలగా తన గురువు బావిలో తల్లక్రిందులుగా వ్రేలాడదీసినా, ఆనందం అనుభవించారేగాని, గురువును తూలనాడలేదు. ఒక గుహలో 12 సంవత్సరాలు తన గురువు ధ్యానస్థులై ఉంటే, వారికి నిరంతరం సేవచేస్తూ ఉండిపోయారే గాని, వదలి వెళ్ళలేదు, కట్టెలు కొట్టుకునే వాడి రూపంలో ఎదురైన వ్యక్తిలోని గురుతత్వాన్ని గుర్తెరిగి, వారిపైన అపారమైన విశ్వాసముతో, దృఢమైన నమ్మకంతో గురువును అంటిపెట్టుకొని నిశ్చింతగా ఉండిపోయారు శ్రీసాయి. దానికి పర్యవసానం గురువు అనుగ్రహంతో జగద్గురువై నిలచారు శ్రీసాయి. ఆధ్యాత్మిక ప్రపంచానికి చక్రవర్తి అయిన శ్రీసాయిని నేడు లక్షలాది మంది ఆశ్రయించి, సేవించామని భావించినా, "నా గురువును నేను సేవించినట్లు నన్ను సేవించేవారు ఒక్కరూ కనిపించలేదు, అందరూ నావద్దకు వచ్చి ఇవ్వమని అడుగుతున్నారేగాని, నేను ఇవ్వదలచింది పొందదగినవాడు ఒక్కడూ కనిపించలేదు" అన్నారు శ్రీసాయి. కారణం అందరూ మనస్సనే భాండాన్ని కోరికలతో నింపుకొని సాయి చెంతకు చేరుతున్నారేగాని, వారు ఇవ్వదలచిన జ్ఞానామృతాన్ని పొందటానికి కాదు. "నా దగ్గరకు వచ్చేవి అన్నీ నిండుకుండలు లేదా బోర్లించిన కుండలు. వాటిని జ్ఞానామృతంతో ఎట్లా నింపేది" అన్నారు శ్రీసాయి. "కావాలనే కోరిక విడిచి సర్వగతుడైన భగవంతుడి మీద మనస్సు నిలుపు గమ్యం చేరుతావు" అని సాయి బోధిస్తే, కోరికల మూటలతో వారి చెంతచేరే వారలము వారిని గుర్తించి, ఏ విధముగా సేవించగలుగుతాము. అందుకే శ్రీసాయి అన్నారు "నా దగ్గరకు వచ్చేవి అన్నీ చెల్లని నాణేలే, ఒకటి అరిగిపోయి, మరొకటి విరిగిపోయి, నొక్కుకుపోయి నావద్దకు వస్తున్నాయి, వాటిని కరిగించి, మూసపోసి కొత్తవాటిగా మార్చి చెలామణి చేద్దామంటే, మధ్యలోనే చేజారిపోతున్నాయి" అన్నారు బాబా. ఎన్ని తప్పులు చేసినా, ఎన్ని దుశ్చర్యలకు లోనయినా, ఎన్ని పాపాలు చేసినా గురువు దగ్గరకు వచ్చాము కనుక, వాటి పర్యవసానాలను అంటకుండా, మనలను పవిత్రులుగా చేసి కోరినవన్నీ వెంటనే ప్రసాదించమని వేడి, అడిగింది ప్రసాదించలేదని అలిగి గురునింద చేసి, గురువు అంటే విశ్వవ్యాపకుడని మరచి, వేరొక గురువు చెంతకుపరుగెత్తే వారికి కనువిప్పు 'శ్రీగురుచరిత్ర'లోని 16వ అధ్యాయము. శ్రీసాయి బోధనలోని అంతరార్థాన్ని ప్రస్ఫుటముగా తెలియజేస్తూ, షోడశకళల పరిపూర్ణుడైన గురుచంద్రుడి సంపూర్ణ అనుగ్రహ ఆశీస్సులకై అనుసరించాల్సిన విధానాన్ని ప్రస్ఫుటముగా తెలియజేసే ఆ అధ్యాయములోని పూర్వాపరాలలోకి వెళదాము.

శ్రీగురుడిగా ప్రసిద్ధికెక్కిన శ్రీ నృసింహ సరస్వతిస్వామి వాసర బ్రహ్మేశ్వరక్షేత్రంలో, ఉదరశూల రోగబాధతో ఆత్మహత్యకు పాల్పడిన ఒక బ్రాహ్మణుడిని అపథ్య భోజనంతో రోగవిముక్తుని చేసి, తమకు ఆతిథ్యమిచ్చిన సాయందేవుడు అనే బ్రాహ్మణుడిని మరణచెర నుండి రక్షించి, వాళ్ళను ఆశీర్వదించి, తీర్థాటన గావిస్తూ వైద్యనాథం చేరేరు. అక్కడ తన గృహస్థ, సన్యాస శిష్యులకు పుణ్య, తీర్థ క్షేత్రాల ప్రాశస్త్యాన్ని వివరించి, తీర్థయాత్రలకు వెడలమని ఆదేశించి, ఒక ఏకాంత ప్రదేశములో గుప్తముగా ఉండిపోయారు. సిద్ధముని శ్రీగురుడిని సేవిస్తూ వారి చెంతనే ఉండిపోయాడు. అటువంటి సమయములో అచ్చట జనులచేత మునిగా పిలువబడుతూ ఉన్న ఒక బ్రాహ్మణుడు శ్రీగురుని చెంతకు వచ్చి ప్రణమిల్లి, శ్రీగురుడిని

పలువిధాల స్తుతించి, "స్వామీ నేను ఎన్నో సంవత్సరాల నుండి తపస్సు కొనసాగిస్తున్నా నామనస్సు మాత్రం ఏకాగ్రమవ్వటం లేదు. నా బాహ్యాచరణచూసి అందరూ నన్ను మునివర్యుడని సంబోధిస్తూ, గౌరవిస్తూ ఆదరముగా చూస్తున్నారు, వారి సేవలు అందుకున్నకొద్దీ నామనస్సు ఏదో తెలియని వ్యాకులతతో నిండిపోతున్నది, దిక్కుతోచని స్థితిలో, మీగురించి విని అజ్ఞాన సముద్రములో మునకలు వేస్తున్న నన్ను జ్ఞాన తీరానికి చేర్చే సద్గురువని తెలిసి మీ చెంతకు వచ్చాను. మీ సన్నిధిలో అప్రయత్నముగా నా మనస్సు ప్రశాంతత పొంది, హృదయం హర్ష పులకితమవుతున్నది, కనుక నిశ్చయంగా నన్ను తరింప చేయటానికి వచ్చిన భగవత్ స్వరూపులయిన సద్గురువులు మీరేనని నా మనోనిశ్చయము. సంవత్సరాల తరబడి మనస్సు స్వాధీనంలోకి తెచ్చుకోవటంలో అలసిపోయిన నేను, గురువుకు శుశ్రూషచేసి తరించే స్థితిలో నా శారీరక మానసిక స్థితులు లేవు. కనుక "జగద్గురువులైన మీరు నా అసహాయతను గుర్తించి, నామనస్సుకు శాంతి ప్రసాదించి, జ్ఞానోపదేశము చేయవలసింది" అని ముకుళిత హస్తాలతో ప్రార్థిస్తున్న ఆ బ్రాహ్మణ మునిని చూస్తూ, శ్రీగురుడు చిరునవ్వుతో "ఏ గురువు ఆదేశముతో ఇంతకాలము నీవు తపస్సు చేశావు, ఆ గురువును ఏవిధముగా సేవించి ఆశ్రయించావు, జ్ఞానాగ్ని స్వరూపుడయిన గురువు చెంతకు చేరిన వెంటనే దావానలములతో భస్మీపటలము అయిన ఎండుగడ్డివలె, అజ్ఞానము క్షణములో భస్మీపటలము కావలసిందే కదా! మరి నీలో ఆమార్పు రాకపోవటానికి కారణమేమిటి, నీవృత్తాంతము, సవివరముగా తెలియజేయ"మన్న శ్రీగురునితో ఆ బ్రాహ్మణుడు "మహానుభావా! మీరు చెప్పింది నిజమే, నేను పూర్వాశ్రమములో వేదాధ్యయనం కొరకు ఒక గురువు చెంత చేరేను, నాకు అంతఃకరణ శుద్ధి లేదని, చంచల స్వభావుడనని, అంటూ నాకు వేదశాస్త్రములు, వ్యాకరణ భాష్యాలు ఏమియూ బోధించకుండా, నా చేత అనేకమైన పనులు చేయించేవారు, వేదాధ్యాయనం కోసం వచ్చిన నేను, సేవచేయటం ఇష్టంలేక వారి ఆజ్ఞలను పాటించక వ్యతిరేకించేవాడిని. అందుచేత వారు నన్ను మరింత దూరంగా ఉంచేవారు. అయినా కొంతకాలము అక్కడే ఉన్నాను, ఒకరోజువారి కర్కశమాటలకు కోపగించుకొని వారిని వదిలివేసి, ఇక్కడకు వచ్చి నాతపస్సు కొనసాగిస్తున్నానని" చెప్పిన ఆముని మాటలు విన్న శ్రీగురుడు ముక్కున వేలువేసుకొని "ఎంత తప్పు చేశావు, నీవు నిజముగా మూర్ఖుడవే, బ్రహ్మతత్వము ఎరగవలసిన వాడివి అయికూడ ఎంతటి ఘాతుకానికి పాల్పడ్డావు, గురుసన్నిధిలో నీలోని లోపాలను సరిచూసుకుంటూ సవరించుకోవాల్సిందిపోయి, గురువులోని దోషాలను ఎంచుతూ, వారిని దూషిస్తున్నావు. నీవు చేసిన పని దేవాలయములో మలవిసర్జనచేసి, ఆక్షేపించిన వారిని తూలనాడినట్లుంది. గురువు గుణ దోషాలను గురించి విమర్శించేవారు ఇహపరాలకు రెండింటికీ దూరమవుతారు. అటువంటి వారి మనస్సుకు శాంతి ఎట్లు లభిస్తుంది. కామధేనువు వంటి గురువును వదిలి పాలకోసం అన్వేషణ చేస్తున్నట్లున్నది నీపని. గుడ్లగూబ తన కంటి దోషాన్ని గుర్తించక సూర్యుడు ప్రకాశించటం లేదని ఆక్షేపిస్తున్నట్లుగా, అల్పుడు తనలోని దోషాలను గురువుకు ఆపాదించినట్లుగా ఉన్నది నీ స్థితి. ఎవరైతే గురువుయొక్క మహత్యాన్ని ఎరిగి వారియందే దృఢమైన నిశ్చయముతో వారిసేవలో నిమగ్నమవుతారో అటువంటివారే గురువు అనుగ్రహముతో అత్యంత శీఘ్రముగా వేదశాస్త్ర జ్ఞానసంపన్నుడై, పూర్ణజ్ఞాని కాగలడు. గురువు కేవలం తన కృపాదృష్టిచేతనే శిష్యుడిని వేదశాస్త్ర పరిపూర్ణుడను చేయగలడు. అంతవరకు త్రికరణశుద్ధిగా సేవించినవాడే అందుకు అర్హుడుకాగలడు. అది మరచి, స్వార్థముతో గురువు చెంతచేరి, అనుకున్నది తక్షణమే ప్రసాదించలేదని వారిని తూలనాడి, విమర్శిస్తూ అరచేతిలోని అమృతభాండమువంటి శ్రీగురుడి అంతటి సద్గురు సన్నిధిని చేజార్చుకొని, దాహంకోసం వెంపర్లాడే నీబోటి గురుద్రోహి ముఖం చూడటం కూడ అపశకునమవుతుంది" అని తీవ్రంగా పలికిన శ్రీగురుడి మాటలకు, తాను చేసిన పని ఎంతటి హేయమయినదో గుర్తించిన ఆ బ్రాహ్మణుడు పశ్చాత్తాప హృదయముతో శ్రీగురుడి పాదాలపై ప్రణమిల్లి "గురోత్తమా! నాలోని దోషాలను గుర్తించకుండా, గురునింద చేసిన మూర్ఖుడను. మీరు వచించిన ఒక్కొక్కమాట నాలోని అజ్ఞానాంధకారాన్ని పటాపంచలు చేస్తున్నది. గురు స్వరూపాన్ని గుర్తించలేనినాకు, వారిని గుర్తించి ఎట్లు సేవించాలో తెలిపి అనుగ్రహించమని" ప్రాధేయపడిన ఆ బ్రాహ్మణుడి దయనీయ స్థితిని గాంచిన శ్రీగురుడు అతనిపై అపారకరుణతో, గురుస్వరూపాన్ని సవివరముగా తెలియజేసే మహాభారతములోని ఆదిపర్వము నందలి ధౌమ్యులవారి చరిత్ర చెప్పసాగేరు.

"ఓ బ్రాహ్మణుడా సావధాన చిత్తుడవై అత్యంత భక్తి శ్రద్ధలతో నేను చెప్పబోయే గురుసేవావృత్తాంతమును ఆలకించు. గురువు అంటే జననీ జనకులే, జన్మనిచ్చిన తల్లితండ్రులు ప్రథమ గురువులయినప్పటికి, మనకు తెలియని తత్వాన్ని బోధించిన వారందరూ గురుస్వరూపులే. జన్మసాఫల్యానికి సహకరించే గురువును బ్రహ్మ, విష్ణు, శివ స్వరూపుడైన జగద్గురువుగా భావించి సేవించిననాడు జ్ఞానస్వరూపులయిన ఆ గురువు, తక్షణమే తనంతటి వాడిగా శిష్యుడిని అనుగ్రహించగలరు. అందుకు చక్కటి ఉదాహరణయే శ్రీధౌమ్యులవారి చరిత్ర. ద్వాపరయుగాంత సమయములో ధౌమ్యుడు అనే పేరుగల ఒక ఋషీశ్వరుడు ఉండెడివారు. వారి వద్ద వేదాధ్యయనము కొరకు అరుణి పాంచాలుడు, బైదుడు, ఉపమన్యుడు అనే పేర్లు గల ముగ్గురు ఉండెడివారు. శిష్యులలోని భక్తి శ్రద్ధలను గ్రహిస్తూ, వారిలోని అహంకారాలను తొలగించి, మనస్సు శుద్ధిచేయటానికి అలనాటి గురువులు శిష్యులచేత ఆశ్రమములో సేవలు చేయిస్తూ ఉండేవారు. వారి సేవ, చిత్తశుద్ధి, గురుభక్తిని అనుసరించి వారిని అనుగ్రహించేవారు. అదేవిధముగా తన శిష్యులను పరీక్షింప తలచిన శ్రీధౌమ్యులవారు మొదటి శిష్యుడైన అరుణిని చేరబిలచి "నాయనా! ఇకనుంచి నీవు మన పొలానికి వెళ్లి, చెరువు నుండి దానికి నీళ్ళు పెట్టు. పొలమంతయూ పూర్తిగా నీటితో తడిసిన అనంతరం నీవు ఆశ్రమానికి రా!" అని ఆదేశించి అరుణిని పొలానికి పంపేరు. గురుసేవ చేసే అవకాశం లభించినందుకు అరుణి పొంగిపోతూ సుదూరములోని పొలానికి వెళ్ళి చెరువునుండి నీరు

కాలువద్వారా పొలంలోకి పంపసాగేడు. ఎంతనీరు పోసినా పొలం పూర్తిగా తడవకపోవటంతో పరికించి చూసిన అరుణికి కాలువ గట్టుకు ఒకచోట గండిపడి నీరంతా పల్లపు ప్రాంతములోనికి పోవటం గమనించి, ఆగండిని పూడ్చటానికి అనేక విధాలుగా ప్రయత్నించాడు, కాని అవి సత్ఫలితాన్ని ఇవ్వలేదు. పొలం కొంతమేర తడవకుండా ఉండిపోయింది. అరుదుగా లభించిన ఈ గురుసేవ అసంపూర్తిగా ముగించటము ఇచ్ఛగించని అరుణి, చెరువునుండి పొలానికి పుష్కలముగా నీరు పారేటట్లుచేసి, కాలువ గండికి అడ్డంగా తాను పడుకొని గురువును ధ్యానించసాగేడు. ఆచర్యవలన నీరు పుష్కలంగా పొలంలోనికి ప్రవేశించి పొలం పూర్తిగా తడువసాగింది. గురువు చెప్పిన పనిపూర్తయ్యే వరకు ఆశ్రమానికి వెళ్ళకూడదని నిశ్చయించుకొన్న అరుణి గండికి అడ్డంగా పడుకొని ఉండిపోయాడు. చీకటి పడినా శిష్యుడు ఆశ్రమానికి రాకపోవటముతో అతనిని వెదుకుతూ వచ్చిన ధౌమ్యులవారు పొలం పూర్తిగా నీటితో నిండి ఉండటము చూసి సంతృప్తులైనారు, అయితే శిష్యుని జాడ కానరాక బిగ్గరగా పిలువగా, అరుణి మూలుగువిని, చెప్పిన పని చేయటానికి అరుణి చేసిన పనిచూసి మనస్సు చలించినవారై, అతనిని లేవదీసి కౌగలించుకొని, ఆనందభాష్పాలు కారుస్తూ, అతని గురుభక్తి, సేవకు సంతసించి శిష్యుని మస్తకముపై చేయి ఉంచి ఆశీర్వదించారు. తక్షణమే అరుణి వేదశాస్త్రాది సకల విద్యాపారంగతుడయ్యాడు. "నాయనా సకల శాస్త్రపారంగతుడవయిన నీవు ఇక బ్రహ్మచర్య వ్రతాన్ని ముగించి, ఇంటికి వెళ్ళి తగిన కన్యను వివాహమాడి స్వధర్మం ఆచరిస్తూ కృతార్థుడవుకమ్మని" ధౌమ్యులవారు ఆశీర్వదించారు. గురువు అనుగ్రహముతో ఇంటికి వెళ్ళిన అరుణి గృహస్థాశ్రమము స్వీకరించి లోకపూజ్యుడయినాడు.

గురువు చెంతకు చేరి జ్ఞానం ప్రసాదించమని అడిగితే సరిపోదు అందుకు తగ్గ అర్హత సంపాదించాలి. ఆ అర్హత ఉందా లేదా అని పరిశీలించటానికే గురువు శిష్యుడిని అనేక రీతుల పరీక్షిస్తారు.

అంతఃకరణ శుద్ధి లేకుండా గడించిన విద్య పెడదారులు పట్టటానికి అవకాశము కలదు. అందుకే అలనాటి గురుకులాలలోని విద్యార్థులను పలు రీతుల పరీక్షించి, వారిలోని అంకితభావము, సేవానిరతి, గురువుపట్ల విశ్వాసము మొదలైన వాటిని పరిశీలించి, గురువు అనుగ్రహించేవారు. హృదయమనే పాత్ర శుభ్రంచేయకుండా, అమృతతుల్యమైన పదార్థము అందులో పోసినా, అది విషతుల్యమవుతుంది. "భాండ శుద్ధి లేని పాకమది ఏల" అన్నారు వేమన. అంతఃకరణను శుద్ధిచేసే విధముగా ధౌమ్యమహర్షి తన శిష్యులైన బైదుదు, ఉపమన్యువులను పరీక్షించిన విధానము వచ్చే సంచికలో ప్రస్తావించుకుందాము.

# పండుగలు - పర్వదినాలు

## జనవరి - 2021

1. ఆంగ్లనూతన సంవత్సర ప్రత్యేక సత్సంగమము – పవర్‌సిటీ
8. కంచి పరమాచార్య శ్రీ చంద్రశేఖర సరస్వతిస్వామి ఆరాధనోత్సవము
12. స్వామి వివేకానంద జయంతి
13. భోగిపండుగ
14. మకర సంక్రాంతి – ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభం
15. అవధూత శ్రీ మాలపిచ్చమ్మ ఆరాధనోత్సవము (తేదీప్రకారం)
15. అవధూత శ్రీ కాశిరెడ్డినాయన ఆరాధనోత్సవము (తేదీప్రకారం)
15. అవధూత శ్రీ రామిరెడ్డితాత ఆరాధనోత్సవము
15. కనుమ
23. శ్రీ కొత్తలంకబాబా ఆరాధనోత్సవము
26. రిపబ్లిక్ డే
27. హజరత్ శ్రీ తాజుద్దీన్‌బాబా జయంతి
30. జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి
31. అవతార మెహర్‌బాబా ఆరాధనోత్సవము

## ఫిబ్రవరి

2 శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టు 28వ వార్షికోత్సవము – పవర్‌సిటీ

7,8&9 22వ శ్రీసాయిమాస్టర్ భక్తసమ్మేళనం – ఒంగోలు

9. పెనుమత్స శ్రీ మహాయోగిని ఆరాధనోత్సవము
16. శ్రీపంచమి (వసంతపంచమి)
19. రథసప్తమి
19. శ్రీ రామకృష్ణ పరమహంస జయంతి (తేదీప్రకారం)
23. భీష్మఏకాదశి
25. అవతార శ్రీ మెహర్‌బాబా జయంతి (తేదీప్రకారం)

## మార్చి

11. మహాశివరాత్రి
    యోగిరాజు శ్రీ పాకలపాటి గురువుగారి ఆరాధనోత్సవము – నర్సీపట్నం
20. అన్నమాచార్య వర్ధంతి
28. హోళీపండుగ
28. మాతృశ్రీ జిల్లెల్లమూడి అమ్మ జయంతి (తేదీప్రకారం)

## ఏప్రిల్

12. పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ఆరాధనోత్సవము (తేదీప్రకారం)
13. తెలుగు నూతన సంవత్సరం–ఉగాది "శ్రీ ప్లవ"నామ సంవత్సరం
14. భగవాన్ శ్రీ రమణమహర్షి ఆరాధనోత్సవము
14. సాయిభక్త శ్రీ శివనేశన్‌స్వామి జయంతి
19. పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ఆరాధనోత్సవము (తిథిప్రకారం)
21. శ్రీరామనవమి
25. మహావీర జయంతి

# మన సంప్రదాయాలు - సంక్రాంతి



సూర్యుడు ఒకరాశి నుంచి మరో రాశికి మారే సమయాన్ని సంక్రమణం అని పిలుస్తాం. ఇలా సూర్యుడు ఏడాదిలో పన్నెండు రాశులలోనూ సంచరిస్తాడు. అయితే ఆయన ధనూరాశి నుంచి మకరరాశిలోకి అడుగుపెట్టే సమయానికి ఒక ప్రత్యేకత ఉంది. అప్పటివరకూ దక్షిణదిక్కుగా ప్రయాణించిన సూర్యుడు తన దిశను మార్చుకుని ఉత్తరదిక్కుగా సంచరిస్తాడు. అందుకనే దీనిని ఉత్తరాయణ పుణ్యకాలం అని పిలుచుకోవటం కద్దు. ఇలా సూర్యుడి గమనం మారడం వల్ల ఇప్పటివరకూ ఉన్న వాతావరణం కూడా పూర్తిగా మారిపోతుంది. సంక్రాంతిని సౌరమానం ప్రకారం చేసుకుంటాం కాబట్టి ఎప్పుడూ ఈ పండుగ తేదీ పెద్దగా మారదు.

భోగిపండుగ, సంక్రాంతి, కనుమ, ముక్కనుమ అంటూ నాలుగు రోజులపాటు జరుపుకునే తెలుగువారి పెద్ద పండుగ అయిన సంక్రాంతి వేడుకల వెనుక ఐదు కథలు ప్రాచుర్యంలో ఉన్నాయి. వాటి పూర్వాపరాలలోకి వెళితే

**మొదటి కథ :** పూర్వం సగరుడు అనే రాజు ఉండేవాడు. ఆయనకు అరవైవేల మంది కొడుకులు. వీళ్లంతా ఒకసారి కపిలముని ఆశ్రమంలోకి ప్రవేశించి, ఆయన తపస్సుని భంగం చేశారు. దాంతో కపిలముని వాళ్లందరినీ బూడిదగామార్చేశాడు. ఆ బూడిద కుప్పల మీద గంగ ప్రవహిస్తే కానీ, వారి ఆత్మశాంతించదని తెలుస్తుంది. ఆకాశంలో ఉండే గంగని ఎవరూ నేల మీదికి తేలేకపోయారు. సగరుడి వంశంలో పుట్టిన భగీరధుడు ఈ పని చేయగలిగాడు. ఆయన తపస్సుకిమెచ్చి సంక్రాంతి రోజునే గంగమ్మ నేల మీద అవతరించిందట.

**రెండవ కథ :** సంక్రాంతి గంగిరెద్దుల వెనుక ఓ కథ ఉంది. పూర్వం గజాసురుడు అనే రాక్షసుడు ఉండేవాడు. శివుడు తన కడుపులో ఉండేలా ఆ గజాసురుడు వరాన్ని కోరుకున్నాడు. శివుని బయటకు రప్పించేందుకు విష్ణుమూర్తి ఓ ఉపాయం ఆలోచించాడు. దేవతలంతా తలా ఓ వాయిద్యాన్నీ పట్టుకుని, నందికితో కలిసి గజాసురుడి దగ్గరకు బయల్దేరారు. వీళ్ల ప్రదర్శనకు మెచ్చుకున్న గజాసురుడు ఏదన్నా కోరుకొమ్మని అడిగాడు. ఇంకేముంది! తన పొట్టలో ఉన్న శివుడిని బయటకు పంపమని వరాన్ని అడిగేశారు. అలా ఆనాడు శివుని పొందేందుకు చేసిన హడావుడే ఇప్పటి గంగిరెద్దుల సంప్రదాయానికి నాంది అని చెబుతారు.

**మూడవకథ :** కనుమరోజు పశువులని పూజించటం వెనుక కూడా ఓ కథ వినిపిస్తుంది. ఒకసారి శివుడు నందిని పిలిచి "భూలోకంలో అందరూ రోజూ ఒంటికి నూనె పట్టించి స్నానం చేయాలి. నెలకి ఒకసారే ఆహారం తీసుకోవాలి" అని చెప్పి రమ్మన్నాడు. కానీ నంది అయోమయంలో "రోజూ ఆహారం తీసుకోవాలి, నెలకి ఓసారి నూనె పట్టించి స్నానం చేయాలి" అని చెప్పిందట. దాంతో కోపం వచ్చిన శివుడు 'ప్రజలు రోజు తినాలంటే చాలా ఆహారం కావాలి. ఆ ఆహారాన్ని పండించేందుకు నువ్వే సాయపడాలి' అని శపించాడు. అప్పటినంచి ఎద్దులు వ్యవసాయంలో సాయపడుతున్నాయట. కనుమరోజు పశువులని సాక్షాత్తు నందీశ్వరులుగా భావించి పూజిస్తుంటారు.


**నాల్గవకథ :** సంక్రాంతికి గాలిపటాలు ఎగరేస్తాం కదా! దీనికి కూడా ఓ కథ చెబుతారు. సంక్రాంతితో ఉత్తరాయణ పుణ్యకాలం మొదలవుతుంది. ఇది దేవతలకు పగలు అని నమ్మకం. దేవతలంతా ఈ కాలంలో ఆకాశంలో విహరిస్తారట. దేవతలకి స్వాగతం పలికేందుకు వారి దృష్టిని ఆకర్షించేందుకు గాలిపటాలు ఎగరవేయాలని చెబుతారు.

**ఐదవ కథ :** సంక్రాంతితో పాటు ఇంటింటా అడుగుపెట్టే హరిదాసుకి కూడా ఓ ప్రత్యేకత ఉంది. సంక్రాంతికి సాక్షాత్తు ఆ శ్రీకృష్ణుడే హరిదాసు రూపంలో మన ఇంటికి వస్తాడట. ఆయన తలమీద ఉండే పాత్ర ఈ భూమికి చిహ్నమని చెబుతారు. అందుకే ఆ పాత్రని హరిదాసులు నేలమీద పెట్టరు. భిక్ష పూర్తయి ఇంటికి చేరుకున్నాకే దాన్ని కిందికి దించుతారు. ఇవి సంక్రాంతి గురించిన అయిదు కథలు. ఇంకా గొబ్బెమ్మలు దగ్గర నుంచి భోగిపళ్ళవరకు... సంక్రాంతిలో కనిపించే ప్రతి ఆచారానికి ఓ కథ ఉంది.


సంక్రాంతి పండుగ చుట్టూ ఎన్నో ఆధ్యాత్మిక కోణాలు ఉన్నాయి. మకర సంక్రాంతి రోజున సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశిస్తాడు, మకరరాశికి అధిపతి శని భగవానుడు. శని వాత ప్రధానమైన గ్రహమని శాస్త్రం చెబుతుంది. వాతము అనేది నూనెలాంటి పదార్థాల వలన, గుమ్మడికాయ వంటి కాయల వలన తగ్గుతుంది. కనుక ఆరోజు నువ్వుపిండితో స్నానం చేసి శనీశ్వరుడి ప్రీతికోసం నువ్వులు, పండు గుమ్మడికాయ దానం చేయాలని పూర్వీకులు చెప్పేరు. గుమ్మడి పండు భూమండలానికి ప్రతీక. శ్రీ మహావిష్ణువు ఆదివరాహ రూపంతో భూగోళాన్ని పైకి తీసుకువచ్చింది సంక్రాంతి నాడే. కనుక భూమికి సంకేతమయిన గుమ్మడి పండును పేదలకు, బ్రాహ్మణులకు దానం చేస్తే భూదేవి సహిత శ్రీ మహావిష్ణువు అనుగ్రహం లభిస్తుందని చెబుతారు.

వచ్చే సంచికలో మరొక పండుగ గురించి, మనసంప్రదాయం శీర్షికలో తెలుసుకుందాము. ఈ సంక్రాంతి మనందరి జీవితాలలో నూతన క్రాంతి నింపాలని, ప్రతి ఒక్కరు సుఖ, సౌఖ్య, ఆనంద, ఆరోగ్య, సౌభాగ్యాలతో తులతూగాలని శ్రీసాయినాధుడిని ప్రార్థిస్తూ
- సంక్రాంతి శుభాకాంక్షలతో

మీ **శ్రీమతి వి.యస్. లక్ష్మీపూర్ణచంద్రరావు**




# ఒక్క క్షణం !

"మన సంస్కారాల మార్పుకోసం చేసే తీవ్రమయిన ప్రయత్నమే సాధన" అంటారు శ్రీభరద్వాజ మాస్టర్‌గారు. ఆధ్యాత్మికతను వడ్డించిన విస్తరిలాగా మాస్టర్‌గారు మనముందు పెట్టారు. ఇక దానిని ఏ రకంగా ఆస్వాదిస్తామనేది మన చేతుల్లోనే ఉంది. శ్రీ మాస్టారుగారు చెప్పినట్లుగా సాధన చేస్తూ, ఆయన వ్రాసిన గ్రంధాలను పారాయణ చేస్తూ, యోచన చేస్తూ, మన జీవితంలో మొదటి స్థానం ఎప్పుడూ ఆ దైవానికే ఇవ్వాలి. లౌకిక జీవితంలోని వాటిపై వ్యామోహాలు తొలగించుకొని, మన ఏకాగ్రత ఎప్పుడూ మన లక్ష్య సాధన మీదే ఉండాలి. అలా చేస్తున్నప్పుడు, శ్రీ భరద్వాజ మాస్టర్‌గారు, మనకు అవసరమైనప్పుడు సందేశాలు ఇస్తూ, మన సాధనలోని లోటుపాట్లు మనకు తెలియచెబుతూ, సరియైన మార్గంలో మనల్ని ప్రోత్సహిస్తూ, ప్రతి క్షణం మన ప్రక్కనే ఉంటారు. ఆ సాయినాధునికి తగిన బిడ్డలుగా మనలను తీర్చిదిద్దుతారు. కాకపోతే ఇక్కడ మనం చేయవలసినది చిత్తశుద్ధితో కూడిన ప్రయత్నం.



''మేము ఇంతకు ముందు గుడికి వచ్చేవాళ్ళము, కానీ బాబా మాగురించి పట్టించుకోవడం లేదని రావడం మానేశాము'' అని కొంతమంది, ''అందరికీ అన్నీ చేస్తున్నారు, మేము ఎంత చేసినా ఇంకా మాపై కరుణ చూపడంలేదు, ఎందుకని?" అని కొంతమంది, "మా బాధలను అర్ధం చేసుకోవడం లేదు, వున్నాడో! లేడో బాబా!'' అని మరికొంతమంది అనేక సార్లు అనడం మనము వింటూనే వున్నాము. శ్రీసాయిలీలామృతం శ్రద్ధతో పారాయణ చేసేటట్లయితే అలా మాట్లాడటానికి అవకాశమే లేదు. ఎందుకంటే "నా గురువుని 12 సంవత్సరాలు సేవించాను, ఆకలి, దప్పులు మరచి, ఏమీ కోరక తదేకంగా నా గురువునే చూస్తుండేవాడిని. 2 పైసలు దక్షిణ కోరారు. మొదటి పైసా నిష్ఠ, రెండవ పైసా స్థిరమైన విశ్వాసం, అవి సమర్పించాను. ఆయనను మరచి నాకు శాంతి ఉండేది కాదు. నా మనస్సు వారియందే నిలిచేది. ఈ విశ్వాసమే, ఈ ప్రేమే నేను సమర్పించిన మొదటి పైసా. ఆయన కోరిన రెండవ పైసా సబూరి, అంటే సంతోషం, పట్టుదలతో కూడిన ఓరిమి, అది సర్వపాపాలనూ, కష్టాలనూ తొలగించి, విజయాన్నిస్తుంది. ఆయన కృపకోసం వేచియున్నాను. ఆయన తమ మనోదృష్టిని నాపై నిలిపి నన్నుద్ధరించారు. నా ప్రయత్నమేమీ లేకనే, వారి కృప వలన నాకీ స్థితి కలిగింది" అని శ్రీ సాయిబాబా అన్నారు. మరి మనం 12 గంటలపాటైనా అలా ఉండగలుగుతామా? మనకు తోచినప్పుడు, ఒక నమస్కారం చేసుకొని, ఎప్పుడైనా టైము దొరికితే పారాయణ చేసుకునే మనం, శ్రీ బాబా మీద కోపగించుకోవడం, అలగడం, పూజ మానేయడం న్యాయమా? ధర్మమా? అని ఆలోచించుకోవాలి.

మాస్టర్‌గారు మనకు అవసరమైనప్పుడు తప్పక దర్శనమిచ్చి మార్గనిర్దేశకత్వం చేస్తారు. మనకు ఏంకావాలో, మనకు ఏది శ్రేయస్కరమో, అదే వాళ్ళు చేస్తారు. అంతవరకు మనం మన సాధనలోని లోపమో, లేక మన పూర్వజన్మ కర్మఫలం ఇంకా తీరలేదేమో అన్న అవగాహనతో "నిష్ఠ–సబూరీ"లతో మన కర్తవ్యాన్ని కొనసాగించ వలసినదే. తప్పక విజయం సాధించే తీరుతాము.

మన దుఃఖాన్ని రూపుమాపవలసినది, రూపుమాపగలిగేది ఒక్క దైవమే. మన ఆప్తులను పోగొట్టుకొని, తీవ్ర దుఃఖంతో గుండెలు పగిలేలా మనం రోధిస్తున్నప్పుడుగాని, భరించలేని కష్టాలలో కూరుకుపోయినప్పుడు గాని, మనకు ఓదార్పునిచ్చి, అక్కున చేర్చుకొని, మన దుఃఖాన్ని రూపుమాపగలిగేది ఒక్కదైవమే తప్ప మన హోదాలుగానీ, డబ్బుగానీ, బంధువులుగానీ, స్నేహితులుగానీ, కన్నబిడ్డలుగానీ, చివరకు జీవితాంతం తోడునీడగా వుంటానని ప్రమాణం చేసిన జీవిత భాగస్వామి గానీ, చుట్టూ పరిస్థితిగానీ, చెట్టూ చేమలతో సహా, అన్నీ, అందరమూ నిమిత్తమాత్రులమే (ఇది నా స్వానుభవం కూడా). ఇవి అన్నీ మధ్యలో రుణానుబంధం వలన వచ్చినవే. మన మొదటి తోడూ, చివరి తోడూ, మనకున్న సర్వస్వం ఆ భగవంతుడే! అందుకే ఆ దైవాన్ని ఎప్పుడూ వదలకూడదు. ఓరిమితో ఉండాలి.

"క్షణక్షణమూ ఆత్మ వికాసానికి కృషి చేయడం ఒక్కటే మానవ జీవిత లక్ష్యం కావాలి" అన్న శ్రీ మాస్టర్‌గారి సూక్తి, విశ్వమానవాళికి ఒక చక్కని గొప్ప సందేశం.

ఆధ్యాత్మికంగా వున్నతి సాధించాలంటే, ఆ సాయినాధులకు తగ్గ బిడ్డలుగా మనం మారాలంటే మాత్రం తప్పకుండా ప్రతిక్షణాన్ని మనం సద్వినియోగం చేసుకోవాల్సిందే. ఏ రంగంలోనైనా రిలాక్సేషన్ వుంటుందేమోకాని, ఆధ్యాత్మిక రంగంలో మాత్రం అలా వుండటానికి అవకాశమే లేదు. నిరంతర కృషి జరుగుతూ వుండాల్సిందే. నిజమైన తృప్తి, శాంతి కావాలంటే ఆధ్యాత్మికంగానే, ధర్మబద్ధమైన జీవిత నిర్వహణ ద్వారానే పొందగలం. మృత్యువు ఎప్పుడు వస్తుందో తెలియని మనకు ప్రతిక్షణం కూడా విలువైనదే. ప్రతిక్షణం మనకు పునర్జన్మ వంటిదని శ్రీ మాస్టర్‌గారు అన్నారు.

ఆధ్యాత్మిక రంగంలో ప్రతి అడుగూ జాగ్రత్తగా వేయాలి. ఎన్నో విమర్శలు, కఠిన పరీక్షలు ఎదుర్కోవాల్సి వుంటుంది. ఎప్పుడూ సహనం కోల్పోకుండా, అందరిలోనూ శ్రీ బాబానే వున్నారన్న భావనతో, భేద భావాలు లేకుండా అందరిలో శ్రీ బాబానే చూస్తూ, మన లక్ష్యం దిశగా మనం సాగిపోవాల్సిందే. ఎప్పుడయిన సహనం కోల్పోయిన, ఆ తరువాత పశ్చాత్తాపముతో దాన్ని సరిదిద్దుకొని, ముందు ముందు అలాంటి పొరపాట్లు చేయకూడదన్న ధృడనిశ్చయంతో మన కర్తవ్యాన్ని కొనసాగించాలి.

అయితే మనం దానికి తగ్గ అర్హత సంపాదించుకోవాలి. మనలోని రాగద్వేషాలను మార్చుకొని ప్రతి ఒక్కరిలో బాబానే చూస్తూ ప్రతి శ్వాసలోనూ బాబానే నిలుపుకొని ఆ తల్లికి తగిన బిడ్డలుగా మారాలి. మరి ఆ ముక్తి మార్గం పొందాలంటే మన సాధనను తీవ్రతరం చేసుకుందాం. మన జీవితం మొత్తం సాధనగా మార్చుకుందాం.

అయినవాళ్ళే రాగద్వేషాలలో చిక్కుకుని ఒకరినొకరు చంపుకుంటున్న సమాజంలో, ఒక మామూలు మనిషిగా పుట్టి, తన అన్వేషణలో తాను కనుగొన్న సత్యాన్ని, శ్రీ బాబా తత్వాన్ని మన అందరికోసం, మన భావితరాల వారికోసం అందించాలని ఆరాటపడుతూ, "ఇలా చేస్తే మీరు కూడా దైవాన్ని చూడగలర"ని ఎలా చెయ్యాలో కూడా చెప్పి, మనకోసం సులభమైన పద్ధతిలో ముక్తి మార్గాన్ని కూడా ఏర్పరచి, తాను మాత్రం శ్రీసాయి ప్రచారమనే యజ్ఞంలో సమిధగా మారిన శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టర్ గారు సాయి స్వరూపులయినారు. శ్రీ భరద్వాజగారిని సాయిస్వరూపులుగా భావించి, ఆరాధించేవారలకు వారు చూపిన మార్గంలో పయనం చేయటానికి ముందుకు అడుగువేయటమే శ్రీసాయిమాస్టర్‌కు మనమిచ్చే గురుదక్షిణ కావాలి. ఏమంటారు?

ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలతో..

రచన : **శ్రీమతి కె.పద్మ రామలింగారెడ్డి**, గుంటూరు

# ఆచార్యవాణి

శ్రీసాయిని ఆరాధించుకోవటానికి మనము ఆచరించదగ్గ ముఖ్య సూత్రములు

ఎన్నో లౌకికమైన విషయాలలో కొట్టుమిట్టాడే మనకు దైవారాధనకు సమయం వెచ్చించాలంటేనే టైం సరిపోవటంలేదని తప్పుకుంటాము.

అది నిజముగా మనముచేసే పెద్ద పొరపాటు. ఎంత సమయాన్ని మనము వ్యర్థము చేసుకుంటామో మనలను మనము ప్రశ్నించుకుంటే నిజము మనకే తెలుస్తుంది. పూజ్యులు ఆత్మద్రష్టలైన ఆచార్యుల వారిని నేను పై విషయమై ప్రశ్నించినపుడు వారు చెప్పిన విషయాలను ఇక్కడ పొందుపరుస్తున్నాను.

1. కాలము భగవత్ ప్రసాదము. చాలా విలువైనది. ఆయన ప్రసాదించిన కాలములో కొంత సమయాన్ని విధిగా ఆయనకు సమర్పించుకోటానికి కేటాయించుకోవాలి. (అంటే హారతులు / చరిత్ర పఠనము / పూజ మొ॥ వాటికి కేటాయించాలి).

2. మనము తింటున్న ప్రతి మెతుకు సద్గురువు ప్రసాదితమే. కనుక మనము ఏది తినేటప్పుడయినా సర్వజీవ స్వరూపా సాయి ఇది నీ ప్రసాదము అని కొంత ఆయనకు అర్పించి (బయటపెట్టి) మిగిలినది ఆయన ప్రసాదము అన్న భావనతో తీసుకోవాలి. అట్టి అవకాశము లేనపుడు తినబోయేముందు వారిని స్మరించి అది వారి ప్రసాదమని తినాలి.

3. నీ సంపాదనంతా ఆసద్గురుని కృపాకటాక్షమే, అట్టి భావము, ఏమారక నీ సంపాదనలో కొంతభాగము నీ శక్తిమేరకు వారికి దక్షిణగాగాని, సాయి ప్రచారానికిగాని, నిరుపేదలైన విద్యార్థులకు, అంగవికలులకు అసహాయులైన రోగార్తులకు సాయి సేవగా సహకరించటము, వెచ్చించటము అలవాటు చేసుకోవాలి.

4. వారములో ఒక్కరోజైనా సత్సంగము ఏర్పాటు చేసుకోవాలి. వీలుగాకపోతే సత్సంగము జరిగేచోటికి విధిగా వెళ్ళటము అలవాటు చేసుకోవాలి. అది నిన్ను నీవు సంస్కరించుకొనే ఉత్తమమైన సాధన.

5. విరామసమయాన్ని సొల్లు కబుర్లతో పొద్దుపుచ్చక, శాస్త్ర చర్చలతో గడపక, మహాత్ముల చరిత్రలు చదవటం చేసుకోవాలి. సాటివారికి సాయిని గురించి, వారి లీలలను గురించి చెప్పటం, వారికి సాయిని ఆశ్రయించమని ప్రోత్సహించడం చాలా మంచిది.

6 శిరిడీ సదా దర్శించాలనే భావన కలిగియుండి అందుకుగాను ఒక హుండి పెట్టుకొని నీవద్ద మిగిలిన చిల్లరను అందులో వేసుకుంటూ, "సాయి మీ దర్శనమనుగ్రహించండి, నేను శిరిడీ రావటానికి అనుమతి ప్రసాదించండి" అని వేడుకోవాలి. అందువల్ల సాయిని తలచుకొనే అవకాశము, శిరిడీ దర్శించాలనే కోర్కె తీవ్రతరమౌతుంది. ఏదో వ్యర్థమైన పనులకు ఖర్చయ్యే ఆ చిల్లర శిరిడీకి ఉపయోగపడుతుంది. అప్పుచేసే పరిస్థితి తప్పుతుంది. సంపద పరులుకూడా ఇలాచేస్తే సాయిని రోజూ స్మరించుకొనే అవకాశం లభిస్తుంది.

7. నిరుపేదలైన సాయి భక్తులకు బాబా పటము, బాబాచరిత్ర మొ॥న పారాయణ గ్రంథములుకొని ఉచితంగా యివ్వటము చాలా మంచి కార్యము. సాటివారికి మేలు జరగాలనే ఈ సంకల్పం సాయికి ఎంతో ప్రీతి పాత్రమయినది.

8. సాయి ప్రభోధామృతము చదువుకుంటూ నిన్నటి నీ ప్రవర్తనను, నేటి నీ ప్రవర్తనను గురించి యోచించి, వివేకముతో ప్రవర్తనను సరిదిద్దుకోటానికి ప్రయత్నించాలి. అట్టి సద్బుద్ధిని, ఆత్మస్థైర్యాన్ని ప్రసాదించమని వేడుకోవాలి. నియమము తప్పకుండా నీ పారాయణను చేసుకుంటూ పోవాలి. ఇంతకంటే ఉత్తమోత్తమమైన సాధన నీ సంస్కారానికి అవసరమయితే సాయియే తెలియచేస్తారు.

సేకరణ : **పెసల సుబ్బరామయ్య**, గొలగమూడి

# జిజ్ఞాస

శ్రీ భరద్వాజ సద్గురువాణి రెండు దశాబ్దాలు పూర్తిచేసుకొని 21వ వసంతంలోకి అడుగిడుతున్న సందర్భముగా జిజ్ఞాసువులు అడిగిన వివిధ ప్రశ్నలకు, సాయి స్వరూపులైన మహాత్ములు అందించిన సమాధానాలను ఒక పుష్పమాలగా చేసి జిజ్ఞాసువులకు అందిస్తున్నాము. **– సంపాదకుడు**

**ప్రశ్న : జ్ఞానికి సిద్ధులు వాటంతటవే వస్తాయా లేక అవి కావాలనుకుంటే వాటి కోసం ప్రయత్నిస్తారా?**

**భగవాన్ శ్రీ రమణ మహర్షి :** ఎవరు జ్ఞాని? అతడు నీవు చూచే శరీరమేయైతే అతడు ఇతర శరీరముల కొరకు సిద్ధులను ప్రదర్శిస్తాడు. అతడు శుద్ధ చైతన్యమేయైతే సిద్ధిలెక్కడ నుండి వస్తాయి. ఎవరికి చూపిస్తాడు. జ్ఞానులు, భక్తులు కూడా సిద్ధుల కోసం ప్రయత్నించరు. జ్ఞాని అందరిని, తన్ను గానే చూస్తాడు. తనవి కావు, ఇష్ట దేవత చేష్టలు అంటాడు. అతనికి ఏమి చేయటానికీ తన స్వంత ప్రబోధన అంటూ ఉండదు, అహంకారం ఉండదు గనుక. కాని సిద్ధులు వారిని ఛాయవలే వెన్నంటియే ఉంటాయి. ఒక చోట కుర్చీలో కదలకుండా కూర్చొని ప్రపంచం నలుమూలల నుండి వేలకొద్దీ జనాన్ని ఆకర్షించి అందులో కొందరిని పరిపూర్ణంగా మార్చివేస్తూ, మరి కొందరిని భగవంతుని చేరుకొనజేసే జ్ఞాని చేష్ట కన్నా అద్భుత సిద్ధి ఏముంటుంది?

మనుష్యులు ప్రతిరోజూ వారనుకునే సిద్ధులకంటే అద్భుత విషయాలను చూస్తూ ఉంటారు. అవి రోజూ కనిపిస్తూంటాయి గనుక వాటిని చూసి ఆశ్చర్యపోరు. దాదాపు శూన్యం నుండి పుట్టి, పుట్టినప్పుడు ఈ చిన్న ఎలక్ట్రిక్ బల్బంత ఉండి తరువాత బ్రహ్మాండమైన వస్తాదుగానో, గొప్ప చిత్రకారుడుగానో, వక్తగానో, రాజకీయనాయకుడుగానో లేక ఒక మహాత్ముడుగానో మానవుడు పరిణితి చెందటం చూచి వీరు వింతపడరు. కాని ఒక కళేబరాన్ని మాట్లాడిస్తే మాత్రం అంతులేని ఆశ్చర్యం పొందుతారు.

**ప్రశ్న : ఉపవాసం యొక్క ప్రాముఖ్యత ఏమిటి ?**

**భగవాన్ శ్రీ రమణమహర్షి :** సర్వేంద్రియాల కార్యకలాపాలు ఆగినప్పుడు మనసు ఏకాగ్రమౌతుంది. ఆ విధంగా మనసు భగవత్ చింతనలో ఏకాగ్రం కావడమే – నిజమైన ఉపవాసం. కోర్కెలే మనస్సుకు ఆహారం. వాటిని వదిలెయ్యడమే ఉపవాసం. కోర్కెలు లేకపోతే, మనస్సు అనేది వుండదు. మనో ఉపవాసం చేసేవారు – దేహోపవాసం చేయనవసరం లేదు.

**ప్రశ్న : గృహస్థులుగా ఉన్నవారు భగవత్సాక్షాత్కారం పొందగలరా?**

**శ్రీ రామకృష్ణ పరమహంస :** ఎందుకు పొందలేరు? కుమ్మరి పురుగులా సంచరించండి. అది బురదలో నివసిస్తున్నప్పటికీ దాని ఒంటికి బురద అంటుకోదు. ప్రియుడికోసం ఎదురుచూసే స్త్రీలా ఉండండి. ఇంటి పనులన్నీ ఆమె నిర్వర్తిస్తుంది. కాని మనస్సు సదా తన ప్రియుడి మీదనే లగ్నం అయి ఉంటుంది. భగవంతునిపై మనస్సు లగ్నం చేసి, సంసార విధులను అన్నిటినీ నిర్వర్తించవచ్చు. కొంతకాలం ఏకాంతవాసం చేయాలి. దాగుడు మూతల ఆటలో తల్లిని తాకుతే, పిదప భయంలేదు. బంగారం అయిపోతే పిదప ఎక్కడైనా వసించవచ్చు. ఏకాంతవాసం చేస్తూ భక్తిని పొందగలిగితే, భగవల్లాభం పొందగలిగితే సంసారంలోనూ ఉండవచ్చు. కొంతకాలం సద్గురువుతో వసిస్తే భగవంతుని పట్ల వారికి భక్తి ఏర్పడుతుంది. ఆ తరువాత వారు నిశ్చింతగా సంసారంలో జీవించవచ్చు.

**ప్రశ్న : శరణాగతి సులభమా?**

**శ్రీ రామకృష్ణ పరమహంస :** దుశ్శాసనుడు ద్రౌపది చీర లాగుతుంటే ఎంతైనా పెనుగులాడింది. తన మానం కాపాడుకునేందుకు ఆ తల్లి కృష్ణుడినెంతగానో ప్రార్థించింది. కాని, ఏ కృష్ణుడూ రాలేదు. చివరికి రెండు చేతులూ జోడించి పైకెత్తి "కృష్ణా, అన్యధా శరణం నాస్తి, త్వమేవ శరణం మమ" అంది. అప్పుడు వినిపించింది కృష్ణుడికి. ద్రౌపది మానసంరక్షణం జరిగింది. భారమంతా, భగవంతుడిమీదే వేసి, మార్జాలకిశోర న్యాయంగా నిశ్చింతగా వుండగలవారెందరూ? అట్లా ఉండగలిగిన నాడు శరణాగతి సులభము.

**ప్రశ్న : ముక్తి అనగా నేమి?**

**స్వామి వివేకానంద :** ముక్తి అనగా స్వతంత్రత – మంచీ చెడుల బంధముల నుండి విముక్తులగుట. బంగారపు సంకెళ్ళు కూడా ఇనుప సంకెళ్ల వంటి సంకెళ్లే. "కాలిలోని ముల్లు తీయుటకు మరొక ముల్లు అవసరమవుతుంది. ముల్లు తీసి వేశాక ఆ రెండు ముళ్లనీ బయట పారవేస్తాము" – అని శ్రీరామకృష్ణులు అనేవారు. అదేవిధంగా చెడు సంస్కారమును మంచి సంస్కారము ద్వారా తొలగించి ఆ తరువాత మంచి సంస్కారములపై కూడ విజయము సాధించవలెను.

**ప్రశ్న : మాష్టారూ! ఎవరో ఒకరే అవతార పురుషులైతే వాళ్ళకి దణ్ణం పెట్టుకొని తరించటానికి వీలుంటుంది. ముగ్గురో, నల్గురో అవతార పురుషులుగా చెలామణి అవుతున్నప్పుడు ఇందులో ఎవర్ని అనుసరించాలా? అని సందేహం వస్తూ ఉంటుంది. ఆ కనపడే దేవుడేదో ఒక్క రూపంలోనే కనబడితే ఈ చికాకులన్నీ ఉండవు కదా? మతాలపేరిట ప్రజలు కొట్టుకోరుకదా?**

**మాస్టర్ ఇ.కె. :** ఇన్నిసార్లు ఇన్ని రూపాలుగా దేవుడు దిగిరావడం వాడిదే తప్పంటావు. వాడి పేరిట మనం మతాలు పెట్టి కొట్టుకుంటూ, ఈ కొట్లాటలకు వాడే కారణమంటావు. కాదు! వీటన్నింటికీ సమన్వయం కుదిరేది ఎలాగ అంటావా?

రోజూ సూర్యోదయం అవుతోందికదా! నిన్న వచ్చిన సూర్యుడు, ఈ రోజు వచ్చిన సూర్యుడు ఒకడేనా అని మనకెప్పుడైనా అనుమానం వచ్చిందా? ఆ అనుమానం వచ్చిన వాడెంత పిచ్చివాడో, ఈ దిగి వస్తున్న అవతార పురుషులంతా ఒకరేనా

అన్న అనుమానం వచ్చిన వాళ్ళు కూడా అంతే. అసలువాడు, మన అందరిలో కలుపుకొని ఉన్నది 'నేనొక్కడినే', మరి రెండవది లేదంటున్నాడు. మరి దానికేం చెబుతాము?

మన ఇంటికి కరెంటు పెట్టించుకొన్నప్పుడు అవసరాన్ని బట్టి నాల్గుచోట్ల నాలుగు రకాల లైట్లు వేయించుకుంటాం. నాలుగు లైట్లు వెలిగించుకుంటాం. అందులో ఏ బల్బులో వెలుగుతున్నది నిజమైన కరెంటు అని గాని, ఏ బల్బులో మనం ఉపయోగించుకోవాలని కాని ఆలోచిస్తున్నామా? అలాగే జాతి అవసరాన్ని బట్టి దైవం కావలసినన్ని శరీరాలతో నలువైపులకి దిగివస్తాడు. ఎవరికి తగిన రీతిలో వారికి శిక్షణ ఇస్తాడు. వాళ్లలో ఎవరి ప్రణాళికకు, మన సంస్కారం దగ్గరగా వున్న రూపం దగ్గర మనం చతికిలబడతాం. దానికే మనకునచ్చటం అంటాం. ఈ రహస్యం తెలియక తొలి రోజుల్లో మనకు నచ్చిన వాడే మహానుభావుడనీ, మిగతావారు కారనీ ప్రచారాలు చేస్తాం. అప్పుడే మతాలు పుడతాయి. ఇవి చిన్న పిల్లల తగాదాల వంటివి. పరిణామంలో ముందు మెట్లు ఎక్కుతున్న కొద్దీ మతాలు కొట్టుకోవడం కోసం ఏర్పడలేదనీ, సౌకర్యంకోసం ఏర్పడినాయనీ తెలుస్తుంది.

**ప్రశ్న : ధ్యాన సమయంలో నిద్ర వస్తే నేనేం చెయ్యాలి?**

**మాస్టర్ ఇ.కె. :** ధ్యానం చేసేవారు ఎక్కువ శారీరక శ్రమ పడకూడదు. కడుపునిండా తినకూడదు. ఎక్కువ ఆహారం తీసుకుంటే, తమోగుణం ఎక్కువ అవుతుంది. కడుపు ఖాళీగా వుండాలి. అప్పుడే ధ్యానం కుదురుతుంది. అతడు ఆధ్యాత్మికంగా ఎదుగుతాడు. వీణతీగలు ఎక్కువ బిగించకూడదు. ఒదులుగానూ వుంచకూడదు. దేహాన్ని సమస్థితిలో వుంచాలి. అలాగే నిద్ర విషయం కూడా. రాత్రి కాలంలో మూడోవంతు నిద్రకు కేటాయించబడింది. రాత్రి పదిగంటలకు నిద్రపోయి ఉదయం రెండుగంటలకు లేవాలి. పగటి నిద్ర పనికిరాదు. మరొక పద్ధతి కూడా వుంది. ఎప్పుడు తెలివివస్తే అప్పుడు నిద్ర లేవాలి. నిద్ర వచ్చినప్పుడు నిద్రపోవాలి. కాని "నేను నిద్రపోయాను, నేను మేల్కొన్నాను" అని అనుకోకూడదు.

**ప్రశ్న : మన ఖర్మ ఎలా ఉంటే అలా జరిగితీరుతుందికదా? అలాంటప్పుడు సద్గురువుతో పనేముంది?**

**సాయిమాస్టర్ శ్రీ భరద్వాజ :** సద్గురువు విషయంలో సాధారణమైన సూత్రాలు పొసగవు. ఒక భక్తుడు సద్గురుని కృపకు పాత్రుడయ్యాడంటే అతనిని సద్గురువు ఎలా నడిపిస్తాడనేది చాలా చిత్రంగా ఉంటుంది. ఆ భక్తునికి సంబంధించిన భవిష్యత్తును గూర్చిన ఫిల్ము అంతా సద్గురుని పరమవుతుంది. కావాలంటే ఆ ఫిల్ములో అవసరమైన భాగాలు కాల్చేసేదానికి గాని, ఆ ఫిల్ములోని బొమ్మలు మార్చి వేరేవి వ్రాసేందుకుగాని, లేక ఆ ఫిల్ములోని కొన్ని భాగాలు ప్రస్తుత జీవితంలో అనుభవానికి రాకుండా మరొక జన్మకు మార్చేందుకుగానీ, లేక అదే జీవితంలో ఆ వ్యక్తి ఆధ్యాత్మికంగా బాగా ఎదిగి ఆ అనుభవాలకు చలించకుండా ఓర్పుతో అనుభవించే మరొక భవిష్యత్ కాలానికి మార్చడానికిగానీ ఆయనకు అధికారముంటుంది. కనుక సద్గురు కృప పొందినవారికి సద్గురువు చేయలేనిదంటూ ఏమీలేదు. ఆ భక్తుని ఆధ్యాత్మిక పురోభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని సద్గురువు చేయగలరు. ఒక్కొక్కప్పుడు ఆభక్తుని ప్రారబ్ధాన్ని స్వప్నాలలో అనుభవింపజేయడం, జాగ్రత్తులో దాని బాధ లేకుండా చేయడం కూడా మనం చూస్తాము. బాబా చరిత్రలో రక్తం కక్కుకునే క్షయ వ్యాధిగ్రస్తుని చెడ్డ కర్మలను "స్వప్నంలో టీచర్ కొడుతుంటే అరచేతులనుండి రక్తం కారుతూ అతడు తీవ్రంగా ఏడుస్తాడు. మరొకరోజు ఎవరో రోడ్డు రోలరును అతని గుండెలమీద నడుపుతున్నారు. అతడు భయంకరంగా ఏడుస్తుఉన్నాడు. తర్వాత స్వప్నం అంతరించింది". ఆ భక్తుని ఆరోగ్యం చేకూరింది. కనుక మన ఆధ్యాత్మిక, లౌకిక అభివృద్ధి దృష్ట్యా సద్గురుని పాత్ర గణనీయంగా ఉంటుంది. ఐతే సద్గురుని కృప పొందడంలోనే భక్తుని సామర్థ్యమంతా ఇమిడి ఉంటుంది.

**ప్రశ్న : మహనీయులెలా వుంటారు, గుర్తించేదెలాగు?**

**సాయిమాస్టర్ శ్రీ భరద్వాజ : ఒకటి :** ఎవరి సన్నిధిలో మన మనస్సు ప్రశాంతతపొంది, కాలగతి (టైం జరగటం) గుర్తింపులేకుండా మనం హాయిని అనుభవిస్తామో అది మహనీయుని సన్నిధి అని గుర్తించండి.

**రెండు :** ఇలాంటి మహనీయుడు అవునా కాదా అని పరీక్షించే వారిదగ్గర సాధారణంగా జరిగేందుకు వీలులేని ఒక అనుభవం జరుగవలెనని, ఆ అనుభవం ఇంత టైంలోనే జరగాలని, అలా అనుగ్రహించమని మనం మన నోటితో అడగకుండా మానసికంగా చెప్పుకొని వారి సన్నిధిలో కూర్చొనేది. కోర్చున్నంత సేపు సాయినామం మానసికంగా జపిస్తూ ఉండు. మనం మానసికంగా చెప్పుకున్న టైం లోపలే ఆ అనుభవం జరిగితే వారు సిద్ధ పురుషులని తెలుసుకొనేది.

**మూడవ విషయం :** నిజమయిన మహనీయులెవ్వరు కూడా తన పూర్వచరిత్ర వారి నోటివెంట బయట పెట్టుకోరు. సన్నిహితులైన భక్తులు మరలా మరలా అర్థించినప్పుడు "కక్కిన కూటికి ఆశపడతామా?" అన్న సందర్భాలున్నాయి. షిరిడీసాయి అక్కలకోట స్వామివంటి మహనీయులైతే కొందరికి సత్ బ్రాహ్మణులమని మరికొందరితో ఆ విషయం అడుగుతే చెప్పుతో కొడతానని అన్నారు.

**నాలుగవ లక్షణం :** వారు భక్తులనుండి ఏమీ ఆశించరు. భక్తులమీద ఎనలేని ప్రేమను అనుక్షణం కురిపిస్తుంటారు. వారి అన్నపానీయాలు పోషణ భగవంతుడే చూడాలి.

**ఐదవ లక్షణం :** కరచాలనంతో వస్తువులను సృష్టించరు. అలా సృష్టించి ప్రజలను భ్రమకొల్పరు.

**ఆరవ లక్షణం :** మనకేదైన ఆపద రాబోతుంటే పరోక్షంగా మనలను హెచ్చరించి ఆ ఆపద రాకుండా చేస్తారు. వారి మాటలకు నిజమైన అర్థం మనకా ఆపద తప్పిపోయాక మనకు అర్థమౌతుంది.



# పూర్ణ అంతరంగాలు

"సంస్కారాల మార్పుకోసం చేసే తీవ్రమయిన ప్రయత్నమే సాధన" అంటారు పూజ్యశ్రీ ఆచార్య ఎక్కిరాల భరద్వాజగారు, సంస్కారాలు రెండు రకాలు, జన్మ సంస్కారము, కర్మసంస్కారము. ఏ ఖండములో, ఏ దేశములో, ఏ రాష్ట్రంలో, ఏ జిల్లాలో, ఏ గ్రామంలో, ఏ వీధిలో, ఏ ఇంటిలో, ఏ కుటుంబములో, ఏ ఘడియలో పుట్టాలో ముందే నిర్ణయించుకొని మనము జన్మించము. అప్పటి జన్మద్వారా సంక్రమించినది జన్మసంస్కారము అయితే, విజ్ఞతద్వారా చేసే పనుల వలన కలిగే ప్రభావము కర్మ సంస్కారము. ఈరెండింటిలోనూ ఉత్తమమైన లక్షణాలను పెంపొందించుకుంటూ, తనకు, ఇతరులకు హాని కలిగించే వాటిని తొలగించుకోవటానికి చేసే ప్రయత్నమే సాధన. మన మాటలు, చేష్టలు మనలో భావాలను అనుసరించి, అవి గతజన్మ సంస్కారాలను అనుసరించి ఏర్పడతాయి. అందుకని మనలో కలిగే భావ పరంపరలను నిరంతరం గమనిస్తూ విచక్షణతో వాటిని సరిచేసుకొనటమే సాధన. తద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించిన వారెందరో కలరు. మన సంస్కారాలను సరిచేసుకోవటానికి మన చుట్టూ ఉన్న ప్రకృతే మనకు గురువై బోధచేస్తుంది. అయితే అది అర్థంచేసుకొని ఆచరణకు ఉపక్రమించడం మనవంతు. ఆదిశగా మనము ఒక్క అడుగువేస్తే, సాయి పది అడుగులు మనవైపు వేసి ముందుకు నడిపిస్తారు. సృష్టి అంతటా వ్యాపించిన గురుస్వరూపాన్ని గుర్తెరగమనే, "సాయి అంటే ఐదున్నర అడుగుల మనిషి, శిరిడీలోనే ఉన్నాడు అని అనుకునేవాడు నన్నసలు చూడనట్లే, నీవు చూసేదంతా కలసి నేను" అన్నారు బాబా. యోగిరాజు శ్రీ పాకలపాటి గురువుగారు నిరంతరము ప్రకృతిలో తాదాత్మ్యం చెంది, వాటిని పరికిస్తూ, చింతపల్లి కీకారణ్యములలో ఆశ్రమ వాసియై ఉండేవారు. "జనారణ్యము కన్నా ఈ నిర్జనారణ్యమే మేలు" అని అనేవారు బాబుగారు. ఏ ప్రకృతి మనోచాంచల్యం గలవారిపట్ల వికృతిగా మారి వారి వినాశనానికి కారణమయిందో, అదే ప్రకృతి తపోధనులకు, అన్వేషకులకు సహకారియై అండగా నిలచింది. "బ్రహ్మ నాతండ్రి, మాయ నాతల్లి, వారిద్దరి ఐక్యం వల్లనే నాకీ దేహం వచ్చింది" అంటారు సాయిబాబా. ప్రకృతిని చూసి పరవశించి పొదివి పట్టుకుంటే అది సహకారి అవుతుంది, లేకుంటే మన వినాశనానికి మనలనే కారణం చేస్తుంది. ప్రకృతి, దానిలో జీవుల పట్ల కృతజ్ఞత కలిగి జీవించమని, తద్వారా జన్మసార్ధకత చేసుకోమని హెచ్చరించారు చైతన్య స్వరూపుడయిన శ్రీసాయి. ప్రకృతి అంతా తన వంతు చందాలు వేసుకొని మన నిత్య జీవితం కొనసాగటానికి సహకారి అవుతున్నది. అది మరచిననాడు మన జీవితం అస్తవ్యస్తమవుతుంది. అంతేకాక, ఏమన్నా బోధించమని అడిగిన వ్యక్తితో "బోధించేదేముంది చెట్టును చూసి నేర్చుకో" అన్నారు బాబా. తాను ఎదగటానికి ప్రయత్నించిన ప్రతిసారి, చెట్టు ఇతరులకు సహకారి అవుతున్నది. ఇతరులకు సహాయం చేయటంకోసం తాను ఎదుగుతున్నాను అని అనుకోదు. స్వార్థం, ఇష్ట అయిష్టాలకు లోనైన మనిషే అట్లా భావిస్తాడు. భగవంతుడు, గురువు వలెనే భౌతిక రూపం కలిగిగిన మనలో కూడ, ప్రకృతి తత్వం నిబిడీకృతమయ్యే ఉంటుంది. అందుకనే ఉద్యానవనాలను, అరణ్యాలను, ప్రకృతిని చూడగానే మనస్సు పులకరిస్తుంది, అయితే

వికృత భావాలు పెరిగిన కొద్దీ అది అడుగంటి, మానవత్వం మరచి స్వార్థముతో నేను నాది, అనే దానిలో మునిగిపోతాము. అది తొలగించటానికి మరలా ఆ సృష్టిచైతన్యం సద్గురువు రూపంలో మన ఎదుట నిలుస్తుంది. "గురువు అనేది స్థూలముకాదు సూక్ష్మము" అని అంటారు భగవాన్ శ్రీ రమణ మహర్షి, సగుణ సాకారముతో ప్రారంభమయిన సాధన, సగుణ నిరాకారమై, నిర్గుణ నిరాకారములో నిలుస్తుంది. అదే ప్రకృతి తాదాత్మ్యం. ఆ అనుభూతినే 1963 ఫిబ్రవరి 9వ తేదీ శిరిడీలోని సాయినాధుని సమాధి మందిరములో పూజ్యశ్రీ ఆచార్య ఎక్కిరాల భరద్వాజగారు పొందినది.

ఉద్యానవనంలో ఏకాంతముగా కూర్చొని, నా ఆలోచనా తరంగాలలో మునిగిన నేను, మిత్రుడు వెంకట్రావు పిలుపుతో బాహ్యానికి వచ్చాను. తనతో వచ్చిన వ్యక్తిని నాకు పరిచయం చేసి, నన్ను అతనికి పరిచయం చేస్తూ, "వీరికి భరద్వాజ మాష్టారుగారితో ప్రత్యక్ష పరిచయం ఉంది. చాలా అదృష్టవంతులు. అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు" అన్నాడు. నాలోని భావ తరంగాలకు అడ్డువేసిన వెంకట్రావును చూస్తూ, "సాయిస్వరూపులై, సాయిమాస్టర్‌గా వినుతికెక్కిన శ్రీ భరద్వాజగారితో కొద్దిపాటి ప్రత్యక్ష పరిచయం ఉన్నందువల్ల నేను అదృష్టవంతుడిని అయితే, మరి సాయితో ప్రత్యక్ష పరిచయం లేని మాష్టారు గారు దురదృష్టవంతులా!" అన్నాను. ప్రశ్నార్థకమైన వారి ముఖాలను పరికించి చూస్తూ, నేను కొనసాగించాను. "నిజానికి అదృష్టం, దురదృష్టానికి ప్రత్యక్ష, పరోక్షాలతో సంబంధం లేదు. గంగానదికి వెళ్ళి ఒక్కసారి స్నానంచేస్తే మనకు పుణ్యం వస్తే, నిరంతరం దానిలో ఈదులాడే చేపకు రాలేదేమి? సాయిని ప్రత్యక్షంగా సేవించి, సాయితో సమకాలీకులైన వాళ్ళందరు, సాయి స్వరూపులై, మార్గ దర్శకులుగా నిలువలేదేమి? సాయి సమాధి అనంతరం వారిని దర్శించిన శ్రీ బి.వి. నరసింహస్వామి, శ్రీ రాధాకృష్ణస్వామి, శ్రీ స్వామి కేశవయ్య, శ్రీ శివనేశన్ స్వామి, పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు మొదలైన వారు ఎందరెందరో సాయి సంపూర్ణ అనుగ్రహం పొంది, లక్షలాది మందికి మార్గదర్శకులు కాలేదా! కనుక అదృష్టానికి, ఆధ్యాత్మిక పరిణితికి, ప్రత్యక్ష, పరోక్ష పరిచయాలతో సంబంధం లేదు. వారు చెప్పింది అర్థంచేసుకొని, ఆచరణచేయటం ద్వారా వారి అనుగ్రహానికి పాత్రులవ్వటమే నిజమైన అదృష్టం. శ్రీ శిరిడీసాయినాధుని సన్నిధిలో విశ్వచైతన్యానుభూతిని పొందిన, పూజ్యశ్రీ ఆచార్య ఎక్కిరాల భరద్వాజగారు సాయి సమకాలీకులకన్నా ఎంతో అదృష్టవంతులు, తాను చవిచూసిన సాయి అనుగ్రహాన్ని, ప్రసాదించిన అనుభవాన్ని సుస్థిరం చేసుకొని అందరికీ అందించారు, కనుకనే "సాయిమాస్టర్" గా ప్రసిద్ధిచెందేరు. ఫకీరు అయిన బాబా చెప్పిన సూక్తులకు గృహస్తు అయిన తాను ప్రత్యక్ష నిరూపణ మాష్టారు. ఒక ప్రక్క ఉత్తమ గృహస్తు జీవితాన్ని గడుపుతూనే, సాయి బోధానుసారంగా నిరంతరం తన సాధన కొనసాగించి, చివరికంటా తనకోసం కాక, సర్వులు సాయికృప పొందటంకోసం ప్రయత్నించారు అందుకే సాయి సంపూర్ణ అనుగ్రహాన్ని పొందేరు. వారు నడిచి చూపిన బాటలో నడిచే ప్రతివారు అదృష్టవంతులే" అన్నాను నేను. "మీరు చెప్పింది నిజమే గాని ఎందుకో ఎంత ప్రయత్నం చేద్దామన్నా అలా చేయలేకున్నాము. ఏదన్నా చేద్దాము అనుకున్న ప్రతిసారి ఏదో ఒక ఇబ్బందో, ఆటంకమో ఎదురవుతూ ఉంటుంది. పైగా అనేక బాధ్యతలు బంధాలు, అందరూ వారిలా కాలేము కదా!" అంటూ, ఇంతకూ, అసలు వచ్చిన విషయం మరచాము, మా సహోద్యోగి, మీకు మిత్రుడయిన శ్రీనివాసరావు పదవీ విరమణ సందర్భముగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వెళుతూ, మీరు వస్తారని తెలిసి కలసి వెళదామని వచ్చాము అన్నారు. నేను సమాయుక్తమయ్యే ఉన్నాను, సమయం కాలేదని కూర్చొన్నాను ఈలోపల మీరు వచ్చారు, పదండి బయలుదేరదాము అంటూ ముగ్గరము కలసి బయలుదేరేము.

శ్రీనివాసరావుతో గల అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ వారితో పాటుగా ముందుకు సాగేను. మేమిద్దరము బాల్య స్నేహితులము, ఇద్దరము చాలా కష్టాలు పడుతూ, ఉద్యోగం లభించేంత విద్యార్హత వరకు చదివి, ఉద్యోగం సంపాదించుకుని, మమ్ములనూ, మా కుటుంబాల్ని పోషించుకోగలుగుతున్నాము. అయితే ఉద్యోగరీత్యా, శ్రీనివాసరావు, వేరొక చోట ఉండాల్సి వచ్చినా, శ్రీ భరద్వాజగారు అందించిన సత్సంగ సాన్నిధ్యము వలన వీలయినప్పుడల్లా ఇద్దరమూ కలుసు కుంటూ ఉండే వాళ్ళము. తరచు శిరిడీనే కాకుండా, శ్రీ భరద్వాజ మాస్టారిగారి పుణ్యమా అని, దత్తక్షేత్రాల సందర్శన నిమిత్తము, యాత్రలు కూడా చేస్తుండేవాళ్ళము. సత్సంగాల కోసం అయితేనేమి, యాత్రల నిమిత్తము అయితేనేమి, తరచు ఇద్దరము సెలవులు పెట్టాల్సివచ్చేది. ఒక్కొక్కసారి జీతనష్టం కూడా జరిగేది. అయితే సహుద్యోగులు మాత్రం "వీరికి జీతం కన్నా గీతమే ఎక్కువ, ఇంతింత జీతాలు వస్తున్నా మాకు చాలక కొట్టుకుంటుంటే, వీళ్ళకు ఎట్లా సరిపోతుంది? ఏదో లాభం ఉండే ఉంటుంది, అందుకే జీతం నష్టపోయినా తిరుగుతుంటారు" అని భావించేవారు, కొందరు ముఖానే అనే వారు. చిరునవ్వే మా సమాధానం అయ్యేది. "పొయ్యేవారిని పోనిచ్చేదే కదయ్యా" అన్నారు శ్రీ వెంకయ్యస్వామి, "అట్లా ఉండక పోతే వాళ్ళు మనుషులే కారు" అన్నారు మాస్టర్ ఇ.బి. క్రమశిక్షణ, అంకితభావం ద్వారా ఉద్యోగంలో అంచెలంచెలుగా ఎదిగిన శ్రీనివాసరావు తన సంసార బాధ్యతలు కూడ అన్నీ పూర్తి చేసుకొని, ఈరోజు ఉద్యోగ విరమణ చేశాడు. ఆ సందర్భముగా జరిగే సన్మాన కార్యక్రమమే ఇది. ముగ్గురము సరాసరి సభాప్రాంగణానికి చేరేము. శ్రీనివాసరావు, కొందరు ఉన్నతాధికారులు, ప్రముఖులు, వేదికమీద ఆశీనులయ్యారు.

వేదికహాలంతా సహోద్యోగులతో నిండి ఉంది. శ్రీనివాసరావును పలకరించి, వచ్చి కూర్చున్నాను. సభ ప్రారంభమయింది, అందరూ అతన్ని పొగడ్తలతో ముంచెత్తుతున్నారు. అతని సేవ కంపెనీకి ఇంకా చాలా అవసరముందని, పదవీ కాలము అనంతరము కూడ సేవలు అందించ గలిగిన నైపుణ్యము కలిగిన అతను, నేడు పదవీ విరమణ చేయటం చాలా బాధగా ఉందని, ఒక మంచి సహోద్యోగిని, సహృదయం కలవాడిని, వృత్తి పట్ల అంకిత భావం కలవాడిని కోల్పోతున్నామని, అయినా ఉద్యోగ విరమణ ఎవరికైనా, ఎప్పుడైనా తప్పదు కనుక, అతని భావిజీవితం సుఖమయ ఆనందాలతో గడవాలని కోరుకుంటున్నామని, సంపూర్ణ ఆరోగ్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని, ఇంకా ఎన్నో, ఎన్నెన్నో చెప్పారు. వృత్తిలో ఉండగా సహకరించనివారు, భగవంతుడి పట్ల అతని భక్తిని ఎద్దేవ చేసిన వారు, సెలవలు పెట్టి, యాత్రలు జీతనష్టంతో వెళ్ళే అతన్ని మూర్ఖుడుగా పరిగణించినవారు, "అంతా బాబా చూసు కుంటారు" అనే అతని అభిప్రాయాన్ని, అమాయకత్వంగా భావించి, చాటుగా హేళన చేసినవారు, "మేమూ భక్తులమే! పండుగకు, పర్వదినాలకు గుడికి వెళ్ళి నమస్కారాలు చేస్తాము, గురువారం ఉపవాసము ఉండి రాత్రిపూట ఫలహారం చేస్తాము, అంతేగాని, ఇదేంభక్తి బాబు! ఇంత చోద్యం మేము ఎక్కడా చూడలేదు. నిరంతరం బాబా గురించేనా! సెలవలు వస్తే, ఆనందానికి, ఉల్లాసానికి విహారయాత్రలకు వెళతాముగాని, దేవుడి గుళ్ళ చుట్టూ తిరగటము, మేము ఎక్కడా చూడలేదు. ఒక అచ్చటా లేదు, ముచ్చటా లేదు" అని శ్రీనివాసరావుని ఈసడించుకున్నవారు ఇప్పుడు, అతని భక్తితత్వాన్ని వృత్తిధర్మాన్ని అందలము ఎక్కిస్తున్నారు, అట్లా అందరూ అంతలా పొగడుతుంటే నాకు చాలా ఆశ్చర్యమేసింది. "ఎవరన్నా మనిషి మనకు దూరం అవుతున్నారు అంటే, అతనిలోని మంచితనాన్నే గుర్తుపెట్టుకోవాలనే నానుడి ప్రకారం అట్లా మాట్లాడుతున్నారు" అని అనుకుందాము అంటే, మంచిని గ్రహించిన వారయితే మనిషి ముందు ఒకమాట, వెనుక ఒకమాట మాట్లాడకూడదు కదా! అంతేకాక ఆ మంచి వారి ఆచరణలోకి రావాలి కదా! మరి, పడికట్టు మాటలతో ఆప్యాయత, అనురాగం, అభిమానం, గౌరవం, వినమ్రత, భక్తి, సహకారభావం ఇట్లా అన్నీ ఒక్క నిముషం మాత్రమే ఒలకబోసి జీవించే వారు అందించేది ఆశీర్వాదం అవుతుందా! "శుభ"ఆకాంక్షలు అవుతాయా! అని నా సందేహం."క్షణక్షణమూ ఆత్మవికాసానికి కృషి చేయకపోగా, కృషి చేసేవారిని ప్రోత్సహించనివారలు, మనస్ఫూర్తిగా ఇతరుల సౌఖ్యాన్ని ఆకాంక్షించగలరా!" "వర్తమానంలో జీవించటము, అది ఎట్లా జీవించాలో తెలుసుకుని జీవించాలి" అన్నారు పూజ్యశ్రీ భరద్వాజగారు, అంటే ఇదేనా!

వర్తమానంలో జీవించటం అంటే, ఆ నిముషానికి, ఏది అనిపిస్తే అది చేసెయ్యటము, అవతలవారి మెప్పు, జనాల చప్పట్లకోసం నోటికి ఏదివస్తే అదిమాట్లాడేయటం కాదేమో! "భగవంతుడు ఎలా స్పృశిస్తే అట్లా ఉండడంలో తృప్తిపడాలి" అన్నారు శ్రీ సాయిబాబా, "భగవంతుడు ఎట్లా సృష్టించాడో ఎలా స్పృశించాడో అట్లా తృప్తిగా జీవించగలగాలి" అని నా భావన, మనలను మనుషులుగా పుట్టించాడు, ఆ విధంగా జీవించాలి అంటే, మానవత్వం వెల్లివిరిసి, అది వృద్ధిచెంది, ఆదర్శమూర్తిగా నిలవగలగాలి. మనందరినీ అట్లా తయారు చేయాలన్నది సాయి అవతార లక్ష్యం, లక్షణము కూడ. "నా దగ్గరకు వచ్చిన ప్రతిపైసాను (జీవిని) భగవంతుడికి అప్ప చెబుతాను" అన్నారు బాబా, "అయితే నా దగ్గరకు వచ్చేవన్నీ చెల్లని నాణేలే, అరిగిపోయి, విరిగిపోయి, నొక్కుపోయినవి, పోనీ వాటిని మూసపోసి (కరిగించి) కొత్తవిగా తయారుచేద్దామంటే, పూతలాగా, పిండెలాగా జారిపోయేవారే కాని, చివరకంటా నిలచినవారు చాలా అరుదు" అన్నారు. మరి చెల్లే నాణేలులాగా తయారు అవ్వటానికి సాయి పెట్టేపరీక్ష ("పుటం" చెలామణి అయ్యేవిధంగా తీర్చిదిద్దే దానిలో భాగం)ను అంగీకరించటమే వర్తమానంలో జీవించటం. అందుకు ఆలంబనగా సహస్రముఖాలుగా, సహస్రవిధాలుగా సాయి అందిస్తున్న బోధను ఆలకించి, ఆచరించటమే "ఎట్లా జీవించాలో తెలుసుకోవటం" అని నా ఉద్దేశ్యం. సరే ఏది ఏమయినా అది సభ, దాని మర్యాదను అనుసరించి నేను ఆలకిస్తూ, శ్రీనివాసరావును చూస్తూ కూర్చున్నాను. చివరకు శ్రీనివాసరావు, అతని సహోద్యోగుల కోరికపై నేను రెండు మాటలు మాట్లాడక తప్పలేదు. "పదవీ విరమణ చేసే దానికి ముందుగానే ఎట్లాగయితే మనము వసతి, భోజనాదుల కొరకు తగిన ఏర్పాట్లు చేసుకుంటామో, అట్లానే జీవుడు కూడ శరీరాన్ని వదిలేముందే వేరొక ఏర్పాటు చేసుకుంటాడు. చాలా కష్టపడి కూడబెట్టి, భావిజీవితాన్ని ఆనందంగా, సుఖ సౌఖ్యాలతో జీవించటానికి ఎట్లాఅయితే శాయశక్తులా కృషి చేస్తామో, అదేవిధంగా ఈ జీవిలో ప్రాణం ఉన్నప్పుడే జన్మ సార్థకత కోసం కూడ అంతలా కృషి చేయాలి. పుట్టినప్పుడు తల్లి తండ్రుల సంరక్షణలో జీవితం గడుస్తుంది. ఆ తరువాత తన కుటుంబ సంరక్షణ గురించి మిగిలిన జీవితం గడిచిపోతుంది. కుటుంబం, అధికారులు, బంధువులు, చుట్టుపక్కల వాళ్ళ మన్ననకోసం ముప్పావుజీవితం సరిపోతుంది. ఇక జన్మనిచ్చిన భగవంతుడి కోసం జీవించేది ఎప్పుడు? తను బాగా చదువుకొని వృద్ధిలోకి రావడం ద్వారా తల్లి తండ్రులను సంతోష పరచటం జరిగింది, వృత్తి ద్వారా సంపాదించినది కుటుంబం కోసం సద్వినియోగం చేయటము ద్వారా భార్యా, బిడ్డలు సంతృప్తిపడ్డారు, తనను తాను తెలుసుకుంటూ, భగవంతుడిని సంతృప్తి పరచేది ఎప్పుడు? సర్వం ప్రసాదించిన సద్గురువు కోసం పూర్తి కాలాన్ని వినియోగించే మహత్తరమైన అవకాశం ఇక నుంచి శ్రీనివాసరావు పొందుతున్నది. లభించిన అవకాశాన్ని శ్రీసాయి మెచ్చేలా, తాను సంతృప్తిపడేలా

జీవించాలని, ఆశక్తిని సద్గురువు సాయి అతనికి ప్రసాదించాలని మనసారా కోరుకుంటూ ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు అందజేస్తున్నాను" అంటూముగించాను నేను. వృత్తి ద్వారా వచ్చే ఎంత జీతమయినా చాలదు అంటూ వృత్తిలో ఉంటూనే లౌకిక వ్యాపారాలలో తలమునకలవుతున్న వాళ్ళు, నా మాటలకు ముసి ముసి నవ్వులు నవ్వేరు. చిరునవ్వుతో నా ప్రయాణం కొనసాగించేను. "మీ భారములు నాపై పడవేయుడు, నేను మోసెదను, నా సహాయముగాని, సలహానుగాని కోరిన తక్షణమే ఒసంగ సంసిద్ధుడను" అన్నారు బాబా. "ఏ వృతి, వ్యాపారాలలో ఉన్నా బాబాపై తన భారాన్ని ఉంచి, క్షణక్షణమూ ఆత్మవికాసానికై కృషి చేస్తూ, జన్మసార్ధకత కోసం ప్రయత్నం చేయటం నిజమైన జీవనం, మనిషి మనిషిగా జీవించటము అంటే అదే" అని నాకనిపించింది. మిగిలిన మిత్రుల దగ్గర సెలవు తీసుకొని నెమ్మదిగా నడక సాగించాను. దూరంగా స్పీకరులో నుండి సిరివెన్నెల సీతారామశాస్త్రి కలం నుండి జాలువారిన తత్వం బాలు స్వరం నుండి గంభీరంగా వినవస్తుంటే ఆలకిస్తూ, ఆలోచిస్తూ ముందుకు సాగేను.

చుట్టుపక్కల చూడరా చిన్నవాడ !
చుక్కల్లో చూపు చిక్కుకున్నవాడ !
కళ్ళముందు కటిక నిజం
కానలేని గుడ్డి జపం
సాధించదు ఏ పరమార్థం
బ్రతుకును కానీయకు వ్యర్థం
చుట్టుపక్కల చూడరా చిన్నవాడ !
చుక్కల్లో చూపు చిక్కుకున్నవాడ !

స్వర్గాలను అందుకొనాలని వడిగా గుడి మెట్లెక్కేవు
సాటి మనిషి వేదన చూస్తూ జాలిలేని శిలవైనావు
కరుణను మరిపించేదా చదువు సంస్కారం అంటే
గుండె బండలా మార్చేదా సంప్రదాయమంటే
చుట్టుపక్కల చూడరా చిన్నవాడ !
చుక్కల్లో చూపు చిక్కుకున్నవాడ !

నువ్వు తినే ప్రతి ఒక మెతుకు ఈ సంఘం పండించింది
గర్వించే ఈ నీ బ్రతుకు ఈ సమాజమే మలిచింది
ఋణం తీర్చు తరుణం వస్తే తప్పించుకు పోతున్నావా
తెప్ప తగలపెట్టేస్తావా ఏరు దాటగానే
చుట్టుపక్కల చూడరా చిన్నవాడ
చుక్కల్లో చూపు చిక్కుకున్నవాడ

ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలతో....


మీ... వి.వి.పూర్ణచంద్రరావు

---

ఓం సమర్ధ సద్గురు సాయినాథాయనమః

శ్రీ భరద్వాజ గురువేనమః





**ఆహ్వానము**

## 28వ వార్షికోత్సవము

## శ్రీ శిరిడీ సాయి సేవాట్రస్టు, పవర్ సిటీ, విశాఖపట్నము - 531021.

**తేదీ :**
**2021 ఫిబ్రవరి 2 (మంగళవారము)**

**వేదిక : శ్రీ సద్గురు పాదుకా క్షేత్రం**
**ప్లాట్ నెం.13, పవర్ సిటీ, గౌతులచ్చన నగర్ దగ్గర**
**పరవాడ మండలము, విశాఖపట్నం - 531021**

**2021 ఫిబ్రవరి 2 తేదీ (మంగళవారము) జరిగే కార్యక్రమాలు**

హారతులు, అభిషేకము, భక్తుల గోత్ర నామాదులతో పూజ, ప్రత్యేక ఆహ్వానితులచే ఆధ్యాత్మిక ప్రవచనములు, సద్గోష్ఠి, సామూహిక గురుపూజలు మొదలుగా అనేక విశేష కార్యక్రమాలతో పాటు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించబడును. వేదిక వద్ద, శ్రీ దత్తావతార, అవధూత, మహాత్ముల పాదుకలతో పాటు దివ్య వస్తు, వస్త్ర దర్శనము కలదు. ఆయా కార్యక్రమాలలో పాల్గొని శ్రీ దత్త సాయి భరద్వాజుల కృపను పొందటానికి

**అందరికీ ఇదే మా హృదయపూర్వక ఆహ్వానము**

**గమనిక : కొవిడ్ - 19 నిబంధనలను ఖచ్చితముగా పాటిస్తూ కార్యక్రమములో పాల్గొనగోరుతున్నాము.**

వివరములకు : **శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టు, పవర్ సిటీ**
**సెల్ : 98496 45224**

# శ్రీసాయి గ్లోబల్ హారతి



**శ్రీసాయి హారతి విశిష్టత :**

1910వ సంవత్సరము డిసెంబరు 10వ తేదీన ప్రారంభించిన, ఈ హారతి సేవకి డిసెంబర్ 10వ తేదీ 2020 నాటికి 110 సంవత్సరాలు పూర్తి అయ్యాయి. బాబావారి ఆశీర్వాదముతో ఆనాడు మొదలైన ఈ హారతిసేవ నేటికీ ఎంతో మందిని భక్తి మార్గంలో నడిపిస్తూ వుంది. లక్షలాది మంది భక్తులు తమ మనసే హారతిగా ఎంతో భక్తి, ప్రేమలతో కొనసాగిస్తున్నారు. బాబా వారి ప్రేరణతో, వారి అనుమతితో ప్రారంభమైన సేవయే ఈ హారతి. సాయి భక్తుల పాలిట వరదాయని. బాబా వారు, "హారతి సాయిబాబా" అనే పాటను వ్రాసిన మాధవ్ అద్కర్‌కు మగబిడ్డను అనుగ్రహించారు. జగేశ్వర భీష్మకి కలలో స్వప్న సాక్షాత్కారాన్నిచ్చి, తన దగ్గరకు రప్పించుకొని ప్రేరణ కల్పించి ఈ హారతులు వ్రాయించారు. నానా కూతురు మైనతాయికి "హారతి సాయి బాబా" అనే పాట ద్వారా సుఖప్రసవమై పునర్జన్మ పొందింది. ఈ హారతి పాటలు లక్షలాది మందికి దివ్యానుగ్రహాన్ని కలిగించాయి. ఉత్తర కాలంలో దాసగణు మహరాజ్, బి.వి.దేవ్, మరికొందరు భక్తులు వ్రాసిన పాటలను జత చేసి శ్రీ సాయి పాదాలకు సమర్పించారు. ఆ విధంగా బాబా వారు ప్రేరణ కల్గించి, వ్రాయించి, విని ఆమోదించిన ఆ పాటలు నేడు దివ్య మంత్రాలుగా భక్తుల హృదయ మందిరాలలో ప్రతి నిత్యం ప్రతిధ్వనిస్తున్నాయి.

అనేక మంది భక్తులు, ఉపాసకుల అనుభవం మీద చెప్పిన ఫలశృతి ప్రకారము నాలుగు హారతులు 40 రోజులపాటు దీక్షగా చేసిన వారికి అనేక ప్రయోజనములు కలుగుతున్నాయి. కాకడ హారతి – అనారోగ్య సమస్యలు, మధ్యాహ్న హారతి – నవగ్రహ దోషాలు, సంధ్యా హారతి – ఆర్థిక సమస్యలు, శేజ హారతి – కుటుంబ సమస్యలు పరిష్కారం అవుతున్నాయి. ఇలా 4 హారతులద్వారా ఆయా దుఃఖ విముక్తి లభిస్తుంది. భక్తి శ్రద్ధలతో పాల్గొనే వారికి మనశ్శాంతి, శీఘ్ర కార్యసిద్ధి, సద్గురు శ్రీసాయి అనుగ్రహంతో సత్వరమే అనేక సమస్యలు పరిష్కారం లభిస్తుంది.

డిసెంబరు 10వ తేదీ గురువారం రాత్రి 10.30 ని..లకు షిర్డీ నుండి ప్రత్యక్ష ప్రసారమైన శేజ హారతిని ఏక కాలంలో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సాయి భక్తులు అందరూ సాయి లీల హిందీ, తెలుగు టి.వి. ఛానెల్స్, యూట్యూబ్, ఫేస్‌బుక్, OTT ప్లాట్ఫార్మ్స్ మొదలైన మాధ్యమాలలో 2 లక్షల 16వేల మంది భక్తులు ఆన్‌లైన్ ద్వారా బాబా వారిని ప్రార్థించారు. అందరూ కలిసి బాబా వారి హారతి కీర్తిని ప్రపంచ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించారు.

110వ శేజ హారతి దినోత్సవం పురస్కరించుకొని విశ్వ శాంతి కోసం తలపెట్టిన శ్రీసాయి గ్లోబల్‌హారతి శ్రీసాయి బాబా వారి సంపూర్ణ అనుగ్రహ ఆశీస్సులలో ఘన విజయం సాధించింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శ్రీసాయి మందిర సమాఖ్య ఆధ్వర్యంలో డిసెంబరు 20వ తేదీన జరిగిన శ్రీసాయి రక్ష – హారతి దీక్ష అవగాహన సదస్సు మైలవరం శ్రీసాయి మందిరంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్రంలో నలుమూలల నుండి అనేక మంది సాయి భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భవిష్యత్ ప్రణాళికగా, హారతి విశిష్టత ప్రచారం కోసం ఒక కార్యాచరణకు శ్రీకారం చుట్టడం జరిగింది.

**తీర్మానంలో చర్చించిన ముఖ్య అంశములు :**

సద్గురు అవతారమైన సాయి బోధల ప్రచారం కోసం సాయి భక్తులందరూ కలిసి డిసెంబరు 10వ తేదీన శేజ హారతిని "హారతి దినోత్సవం"గా ప్రకటించి కార్తీక మాసంలో అన్నీ సాయి మందిరాలలో ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. అందుకోసం సాయి మందిరములవారు ప్రధానబాధ్యత తీసుకొని ఈ కార్యక్రమం ప్రజలలోకి తీసుకొని వెళ్లడం కోసం ప్రచారం చేయాలని కోరారు.

జిల్లాల వారిగా మందిరముల వారితో సమావేశం ఏర్పాటు చేసి వారికి అవగాహన కల్గించడం మరియు ఈ కార్యక్రమం నిర్వహణ కోసం జిల్లా కమిటీలను ఏర్పాటు చేయడం, ముందుగా మందిరము వారికి ఈ సమాచారం తెలియచేయాలని సూచించారు.

వచ్చే డిసెంబరు 10వ తేదీ కార్యక్రమంలో కనీసం 1008 శ్రీసాయి మందిరముల వారు పాల్గొనేలా ప్రచారం చేయడం. అవకాశం ఉన్న మందిరంలో 1008 జ్యోతులతో బాబా వారి సహస్ర దీపాలంకరణ సేవ విశేషంగా జరిపించడం.

ఈ కార్యక్రమం ద్వారా హారతి సేవ మీద అవగాహన కలిగి ఎక్కువ మంది భక్తులు హారతిలో పాల్గొనడానికి ఎక్కువ మక్కువ చూపుతారు. మందిరములలో బాబా వారి హారతిలో నిత్యము పాల్గొనే భక్తుల శాతం పెరుగుతుంది. బాబా వారి అనుగ్రహము సత్వరం పొందే సులభమైన సాధన కాబట్టి అందుకోసం శ్రీసాయి రక్ష – హారతి దీక్ష గురించి విస్తృతంగా ప్రచారం చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

హారతి దీక్ష వలన సాయి భక్తులకు క్రమశిక్షణ అలవడుతుంది. మనశ్శాంతి, ఆనందం, మధురానుభూతిని పొందుతారు.

ఈ సం..లో ప్రారంభము అయిన ఈ హారతి విశ్వ కళ్యాణం కోసం తలపెట్టిన ఈ మహాయజ్ఞంలో అందరం పాల్గొంటూ శ్రీసాయిహారతిలో ఉన్న విశిష్టతను ప్రచారం చేస్తూ, 2021 డిసెంబరు 10వ తేదీన మరింత ఘనంగా నిర్వహించటానికి అన్ని సాయి మందిరముల నిర్వాహకులు సమాయుక్తమవుదాము. శ్రీసాయిని మనస్ఫూర్తిగా ప్రార్థిద్దాం. బాబా వారి అనుగ్రహాన్ని సాధిద్దాము.

ఇట్లు : **ఆంధ్రరాష్ట్ర సాయి మందిరముల సమాఖ్య**

అధ్యక్షులు : శ్రీబోడేపూడి వెంకటేశ్వరరావు
గౌరవ అధ్యక్షులు : శ్రీసాయి శ్రీనివాస్ – 9030383838
ఉపాధ్యక్షులు : శ్రీ ఎ. చెంచలరావు
ప్రధాన కార్యదర్శి : శ్రీ వి. బాలాజీ ప్రసాద్ – 7386031972

# ఆధ్యాత్మిక - సామాజిక సేవలో శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు - విశాఖపట్నం

## (2020 అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలలో నిర్వహించిన కార్యక్రమాలు)

శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టు మరియు శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్ సంయుక్తముగా 2020 అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలలలో అనేక ఆధ్యాత్మిక సామాజిక సేవా కార్యక్రమాలు కోవిడ్ 19 నిబంధనలు, వ్యక్తి భద్రతా నిబంధనలకు లోబడి నిర్వహించటము జరిగింది. ఆధ్యాత్మిక కార్యక్రమాలు, స్వల్ప సంఖ్యలో సత్సంగ, ట్రస్టు సభ్యుల తోడ్పాటుతో నిర్వహిస్తూ, సేవాకార్యక్రమాలు వీలయినంతగా ఆ యా వ్యక్తులకు వాకిట ముంగిటనే చేరువయ్యేలా నిర్వహించటమైనది.

శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రిలోని దాదాపు 250 మంది రోగులకు, నిరుపేదలకు, శ్రీ అన్నదానసేవాసమితి ఆధ్వర్యములో జరిగే నిత్య అన్నదానానికి ప్రతి వారము అవసరమైన కూరగాయలు అందజేయటమైనది.

నిరుపేద వృద్ధులకు ఇంటి వద్దకు అన్న ప్రసాదము అందించే కార్యక్రమానికి కూరగాయలు అందజేయటము, అనాథ బాలబాలికల వసతిగృహాలకు పాలు, కూరగాయలు, నిత్యావసర వస్తువులు,

అరసవిల్లిలోని బ్రాహ్మణ నిత్య అన్నదానసత్రానికి కూరగాయలు, బియ్యం,

శ్రీకాకుళం లోని అమ్మఫౌండేషన్‌లోని అనాథ బాలబాలికల కొరకు పాలు, కూరగాయలు, ప్రతి వారము అందచేయటముతో పాటు, లోకకళ్యాణార్థము ప్రతి గురువారము ప్రత్యేక ధునిపూజ మొదలైనవి నిర్వహించటము జరుగుతున్నది.

నిరాటంకముగా జరిగే పై కార్యక్రమాలతో పాటు కొన్ని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించటమైనది. వాటి సంక్షిప్త వివరాలు

అక్టోబరు 25వ తేదీ విజయదశమి సందర్భముగా కోవిడ్ నిబంధనలను అనుసరించి, 'శ్రీసద్గురుపాదుకాక్షేత్రం'లో శ్రీ శిరిడీసాయి బాబా 102వ మహాసమాధి కార్యక్రమము నిర్వహించటమైనది. ఉదయం లోకకళ్యాణార్థము శ్రీసాయినాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మధ్యాహ్నం అన్న ప్రసాదవితరణ, తదనంతరం మధ్యాహ్నం గం॥ 2-30 ని॥ల నుంచి 4 గంటలవరకు ధ్యాన పూర్వక సత్సంగమము నిర్వహించి దాదాపు 50 మంది నిరుపేద దివ్యాంగులు, వితంతు అతినిరుపేద కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు పంపిణీ చేయటమైనది.

అక్టోబరు 30వ తేదీ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాలభరద్వాజగారి జయంతి సందర్భముగా పి.యమ్.సి. ఛానల్ కొరకు "శ్రీ భరద్వాజగారు చూపిన సాయిమార్గం" గురించి, "శ్రీ భరద్వాజగారి ఔన్నత్యం'' గురించి ఒక గంటసేపు ట్రస్ట చైర్మన్ శ్రీ వి.వి.పూర్ణచంద్రరావు ఆధ్యాత్మిక ప్రవచనము చేయటమైనది.

అక్టోబరు 30వతేదీ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాలభరద్వాజగారి జయంతి సందర్భముగా లోకకళ్యాణార్థము శ్రీ భరద్వాజగారి పాదుకలకు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరము "సాయిమాస్టర్" పారాయణ చేయటమైనది.

శ్రీకాకుళంలోని రిమ్స్ అసుపత్రిలోని నిత్యాన్నదాన సమితికి కూరగాయలు అందజేయటమైనది.

నవంబరు 6వ తేదీ "శ్రీసాయి భరద్వాజ ఆపన్నహస్తం" పేరిట నిరుపేద దివ్యాంగుల కుటుంబాలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేయటమైనది.

నవంబరు 15వతేదీ కార్తీకమాస ప్రారంభం సందర్భముగా లోకకళ్యాణార్థము శ్రీదత్తసాయి భరద్వాజులకు పూజాదికాలు నిర్వహించి అన్నప్రసాద వితరణ చేయటమైనది.

నవంబరు 19వతేదీ మండల సాయిదీక్షలు ప్రారంభించటమైనది. అందుకు అవసరమైన దీక్షామాలలు, వస్త్రాలు, పూజాసామాగ్రి ఉచితముగా అందజేయటమైనది. ఆ శుభ సమయములో శ్రీ సూర్యోపాసకులు, సౌరదీక్ష సార్వభౌమ, యజ్ఞవాచస్పతి, మహా మహోపాధ్యాయ, శ్రీసూర్యసదన్ (గరివిడి, విజయనగరం జిల్లా) పీఠాధిపతి పరమపూజ్య సద్గురువు శ్రీ శ్రీ శ్రీ కృష్ణయాజిగారి పాదుకలు గురుపుత్రులు శ్రీ సూర్యనారాయణ శర్మగారు 'శ్రీసద్గురుపాదుకాక్షేత్రం' నకు బహుకరించగా, వాటిని గురుశిష్యులైన శ్రీ రాంబాబుగారు గరివిడి నుంచి తీసుకొని రావటం జరిగింది. వాటిని దర్శించుకొని సాయి దీక్షాపరులు ఆనంద భక్తి పారవశ్యులైనారు.

నవంబరు 21వ తేదీ తిథిప్రకారము పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి జయంతి సందర్భముగా అరసవిల్లిలోని బ్రాహ్మణ నిత్యాన్నదాన సత్రానికి కూరగాయలు, నిత్యావసర వస్తువులు అందజేయటమైనది.

నవంబరు 29వ తేదీ కార్తీక పూర్ణిమ సందర్భముగా శ్రీసద్గురు పాదుకాక్షేత్రంలో ప్రత్యేక కార్యక్రమము నిర్వహించటమైనది. ఆ సందర్భముగా రావి, జమ్మి, తులసి, ఉసిరి, వేప మొక్కల సహిత శ్రీదత్తసాయి భరద్వాజులకు ప్రత్యేక పూజాదికాలు నిర్వహించి, కార్తీక దీపోత్సవము అనంతరము భక్త సమారాధన చేయడమైనది.

డిసెంబరు 6వతేదీ శ్రీ అవధూత గోపాల్‌బాబా ఆరాధనోత్సవము సందర్భముగా అనాథ బాలబాలికల అన్నదాన సత్రానికి కూరగాయలు అందజేయటమైనది.

డిసెంబరు 9వ తేదీ అర్ధమండల సాయిదీక్షలు ప్రారంభించటముతో పాటుగా అందుకు అవసరమైన పూజాసామాగ్రి ఉచితముగా గిరిజనులకు అందజేయటమైనది.

డిసెంబరు 9వ తేదీ శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్ అధినేత్రి శ్రీమతి వి.యస్. లక్ష్మీపూర్ణచంద్రరావు జన్మదిన సందర్భముగా దివ్యాంగుల నిరుపేద కుటుంబాలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేయటముతోపాటు, శ్రీకాకుళంలోని రిమ్స్ ఆసుపత్రిలోని రోగులకు, నిరుపేదలకు, మానసిక దివ్యాంగులకు దాదాపు 400 మందికి సరిపడా కూరగాయలు, బియ్యం అందజేయటముతోపాటుగా, అనాథ బాలబాలికల ఆశ్రమానికి కూరగాయలు అందజేయటమైనది.

డిసెంబరు 25వ తేదీ "శ్రీసాయిభరద్వాజ ఆపన్నహస్తం" పేరిట 50 నిరుపేద, దివ్యాంగుల కుటుంబాలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేయటమైనది.

డిసెంబరు 29వతేదీ ''శ్రీదత్తజయంతి'' సందర్భముగా లోకకళ్యాణార్థము శ్రీదత్తాత్రేయునికి ప్రత్యేక పూజాదికాలు నిర్వహించి, సామూహిక "శ్రీగురుచరిత్ర" పారాయణ, అనంతరం అన్నప్రసాద వితరణ చేయటమైనది. శ్రీ సాయిదీక్షలు విరమణ చేయటమైనది.

కోవిడ్ నిబంధనలు పాటిస్తూ ఆ యా కార్యక్రమాలు నిర్వహించటముతోపాటుగా ఆర్థికంగా చితికిపోయిన అనేక కుటుంబాలకు నిత్యావసర వస్తువులు వివిధ సందర్భాలలో ట్రస్టు ఆవరణలోను మరికొంతమందికి వారి ముంగిటనే అందజేయటమైనది.

సమీక్ష : **శ్రీమతి వి. జ్యోతిర్మయి**, విశాఖపట్నం

# మేము సహితం

ఆధ్యాత్మిక సామాజిక సేవలో భాగంగా శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టు మరియు శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్ సంయుక్తముగా 2020 అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలలలో ఆధ్యాత్మిక కార్యక్రమాలతోపాటు అనేక సామాజిక కార్యక్రమాలు కోవిడ్ - 19 నిబంధనలను అనుసరించి నిర్వహించటమైనది.

సర్వులు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలనే సంకల్పముతో ప్రతి గురువారము ప్రత్యేక ధునిపూజ నిర్వహించటముతో పాటుగా "శ్రీ సాయి భరద్వాజ ఆపన్నహస్తం" పేరిట 50 మంది అతి నిరుపేద, వితంతు, దివ్యాంగుల కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు ప్రతి నెలలోనూ ట్రస్టు కార్యకర్తల ద్వారా వారి వారి ఇంటి ముంగిటకు ఉచితముగా పంపిణీ చేయటముతోపాటు పరిసర ప్రాంత వాసులకు ట్రస్టు ఆవరణలో అందజేయటమైనది.

అంతేకాకుండా,శ్రీకాకుళంలోని అరసవిల్లిలోని బ్రాహ్మణ నిత్య అన్నదాన సత్రానికి నిత్యావసర వస్తువులు కూరగాయలు, శ్రీకాకుళం మరియు బలగంలోని అనాథ బాలికల ఆశ్రమానికి నిత్యావసర వస్తువులు, కూరగాయల, రిమ్స్ ఆసుపత్రిలోని వ్యాధిగ్రస్తులకు ప్రతివారము 250 మందికి సరిపడా కూరగాయలు, పాలు, స్థానిక వికలాంగులు, అనాథలు, వృద్ధులకు నిత్యాన్నదాన సేవాసమితి వారికి ప్రతివారం 150 మందికి సరిపడా కూరగాయలు, పాలు, నిత్యావసర వస్తువులు మొదలైనవి ట్రస్టు తరపున అందజేయటమైనది.

శ్రీసాయి దీక్షలు నిర్వహించి, విశాఖజిల్లాలోని గిరిజనులకు చిత్రపటాలు, పూజాసామాగ్రి, దీక్షామాలలు మొదలైనవి ఉచితముగా అందజేయుటవే కాకుండా, 'శ్రీసాయిలీలామృతం' 'శ్రీగురుచరిత్ర', 'స్థవనమంజరి' మొదలైన పారాయణ గ్రంథాలు అందజేయటమైనది.

"సామాజిక సేవయే సాయి సేవ"గా భావిస్తూ అర్హులైన వారికి చేయూతనిచ్చే ఈ బృహత్తరమైన కార్యక్రమానికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తున్న ప్రతి ఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతాభివందనాలు. శ్రీ దత్తసాయిభరద్వాజుల కృపానుగ్రహముతో మరింతగా సాయిసేవలో పాల్గొనే స్థితి, శక్తి వారికి కలగాలని శ్రీదత్తప్రభువును ప్రార్థిస్తూ, సహకరించిన వారి వివరాలు ఈ క్రింద పొందుపరుస్తున్నాము.

**సహాయ సహకారములు అందించిన సహృదయులు**

| | |
|---|---|
| శ్రీ డి.వి.యస్.యన్.రాజు, విజయనగరం | 5,000/- |
| శ్రీ బండారు సాంబశివరావు, నెల్లూరు | 5,000/- |
| శ్రీమతి సర్ణలత పట్నాయిక్, శ్రీకాకుళం | 5,000/- |
| శ్రీ కె. రమేష్‌బాబు, శ్రీహరిపురం, వైజాగ్ | 5,000/- |
| శ్రీ కె. హైమవతి, అప్పలరాజు, ఎన్.టి.పి.సి పరవాడ | 3,000/- |
| శ్రీ ఆర్. అప్పలరాజు, ఆర్ఆర్వి.పురం, వైజాగ్ | 1,500/- |
| శ్రీ కె. శరత్‌చంద్రబాబు, పవర్‌సిటీ, వైజాగ్ | 1,116/- |
| కుమారి కె. ప్రమీల, శ్రీకాకుళం | 1,111/- |
| శ్రీ జి. భిక్షపతి, హైదరాబాదు | 1,000/- |
| శ్రీ ఎ. రామచంద్రరావు, పుత్తూరు | 1,000/- |
| శ్రీ డి, రాఘవేంద్ర, యస్ రాయవరం | 750/- |
| శ్రీమతి బి. సుబ్రమణ్యేశ్వరి, యస్ రాయవరం | 750/- |
| శ్రీ యస్. శ్రీహరిష్, నల్లపాడు, గుంటూరు | 600/- |
| శ్రీ సుధీర్ మదీనాబాగ్ | 500/- |
| ఒక సాయిభక్తుడు | 500/- |
| శ్రీ యన్ భరద్వాజ | 200/- |
| శ్రీమతి పి. లావణ్య లోవరాజు, పవర్‌సిటీ, వైజాగ్ | 200/- |
| శ్రీ యు. సుబ్రహ్మణ్య శ్రీనివాస్, విజయవాడ | 116/- |

## అక్షర యజ్ఞానికి చేయూత

**(శ్రీ భరద్వాజ సద్గురువాణి ముద్రణకు తమవంతు సహకారము)**

| | |
|---|---|
| శ్రీ బి. సాయికిషోర్, బి.వి.నగర్, నెల్లూరు | 2,900/- |
| శ్రీ ఎ. రామచంద్రరావు, పుత్తూరు | 1,000/- |
| శ్రీ బి. సాంబశివరావు, బి.వి.నగర్, నెల్లూరు | 500/- |
| శ్రీ కె. ఉమామహేశ్వరరావు, నెల్లూరు | 500/- |

**"మేము సహితం"నకు విరాళములు పంపుటకు చిరునామా మరియు బ్యాంక్ అక్కౌంటు**

**శ్రీ శిరిడీ సాయి సేవాట్రస్ట్ (రిజిష్టర్డ్)**

**ప్లాట్ నెం. 13, పవర్‌సిటీ, గౌతులచ్చన్న నగర్ దగ్గర, పరవాడ (మం)**
**విశాఖపట్నం - 531 021. సెల్ : 9849645224**

**SRI SHIRIDI SAI SEVA TRUST®**
Online A/C No. 095510011006492
IFSC Code: UBIN0809551
Union Bank, Ukkunagaram
(Used for RTGS and NEFT Transactions)

**"శ్రీ భరద్వాజ సద్గురువాణి" పత్రిక చందా నిమిత్తము రుసుము పంపించవలసిన బ్యాంక్ అక్కౌంటు**

**SRI BHARADWAJA PUBLICATIONS**
Online A/C No. 095510011006491
IFSC Code: UBIN0809551
Union Bank, Ukkunagaram
(Used for RTGS and NEFT Transactions)

E-mail : poorna.sai09@gmail.com
Website : www.saisadguruvani.org
Facebook : SriShiridiSaiSevaTrust

**(గతంలోని ఆంధ్రాబ్యాంక్ యూనియన్ బ్యాంక్‌లో లీనమవ్వటంతో IFSC Code లో జరిగిన మార్పును, బ్యాంక్ పేరులో గల మార్పును గమనించగలరు)**

# ఆధ్యాత్మిక - సామాజిక సేవలో శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు - ఉక్కునగరం

## (2020 అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలలలో నిర్వహించిన కార్యక్రమాలు)




ఈ పేజి సమర్పించినవారు : శ్రీమతి & శ్రీ ఆర్. రామలక్ష్మి శ్రీనివాస రావు, శ్రీకాకుళం

పూర్తి వివరములకు 22 పేజీ చూడగలరు

# ఆధ్యాత్మిక - సామాజిక సేవలో శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు - ఉక్కునగరం

## (2020 అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలలలో నిర్వహించిన కార్యక్రమాలు)



ఈ పేజి సమర్పించినవారు : శ్రీ నరసింహ పట్నాయక్, శ్రీమతి స్వర్ణలత, విజయనగరం

పూర్తి వివరములకు 22 పేజీ చూడగలరు

# అవధూత శ్రీ దొంతులమ్మ

ఆంధ్రదేశము ఎందరో మహాత్ములకు, అవధూతలకు జ్ఞానధనులకు పుట్టినిల్లు ప్రత్యేకించి కృష్ణాతీరములో ఎందరో మహాత్ములు ఉద్భవించిరి. అటువంటి కృష్ణాతీరములోని కృష్ణాజిల్లాలోని మచిలీపట్టణములో 1870 సంవత్సరము ప్రాంతములో బందరు (మచిలీపట్నము) లోని కుమ్మరి వీధిలో మొట్టమొదటిగా ప్రకటమైనారు శ్రీదొంతులమ్మ. దిగంబరియై, చేత ఒక బట్టలమూట పెట్టుకొని ఒక ప్రక్కగా ఒదిగి కూర్చునేవారు. బట్టలను, అక్కడ ఇక్కడ తెచ్చిన కుండలను ఒకదానిపై ఒకటి దొంతరులుగా పేర్చుటవలన ఆమెను అందరు దొంతులమ్మగా పిలిచేవారు. కాలక్రమాన ఆమెకు అదే పేరు స్థిరపడిపోయింది. మొట్టమొదట ఆమెను పిచ్చివారిగా భావించినారు, అయితే ఆమె ఏదయినా దుకాణమునకు వెళ్ళి తనకు ఇష్టం వచ్చిన పదార్థము ఏదయినా తీసుకెళ్ళిన మరుక్షణము నుంచి వారి వ్యాపారము అనూహ్యరీతిలో వృద్ధిచెందెడిది. అది గమనించిన వారు ఆమెను ఆదరించుచుండెడివారు. అంతేకాక, ప్రజ్వలమైన ఆమె ముఖము, ఆమె సన్నిధిలో లభించే శాంతి, ఆనందాలకు ఆకర్షితులై ఆమె సన్నిధికి చేరి మనశ్శాంతి పొందేవారు ఆవూరి ప్రజలు.



శ్రీ అమ్మవారు తననాశ్రయించిన వారియందెట్టి లోపములు ఉన్నను పోగొట్టి వారికి మనశ్శాంతిని ప్రసాదించు స్వభావము గలవారు తన ఆత్మశక్తి ప్రభావమున తీర్చరాని వ్యాధులను సైతము నివారింప సమర్థత గలవారు. ఒకసారి బందరు వాస్తవ్యులైన బాసా వీరాస్వామిగారి తమ్ముడు వెంకయ్యగారు తన భార్యకు బ్రహ్మరాక్షసిపట్టి బాధింపుచుండ విముక్తిగానక, అమ్మవారిని శరణుజొచ్చిరి. ఆమె కరుణించి తన కంటి చూపులను ప్రసరింపజేయగా వెంటనే ఆ పిశాచము పరుగెత్తి పోయినది. భార్యభర్తలిరువురూ ఆరోగ్యవంతులై సుపుత్ర భాగ్యసంపన్నులై అమ్మవారి సేవలో లీనమయినారు. అట్లే బండారు సత్యన్నారాయణమూర్తిగారి మేనగోడలు పుట్టినప్పటినుండి తల్లిపాలు త్రాగక మరణమునకు దారితీయగా వారు శ్రీ అమ్మవారి పాదములపై పడి ప్రార్థించగా, ఆ పిల్లకు శ్రీ అమ్మవారే తన స్తన్యములనిచ్చి దీవించివపంపెనట. ఆ పిల్ల పాలుత్రాగి ప్రవర్థమానయై శ్రీ అమ్మవారి వలన తాను తిరిగి జీవమునుపొంది యుండుటచే ఆమె శ్రీ అమ్మవారి మఠ ప్రార్థనకై నెలకు కొన్ని రూపాయలు పంపించెడివారు. బందరులోనే శ్రీయడ్లవల్లి నాగేశ్వరరావు, శ్రీ జొన్నవిత్తుల శేషగిరిరావుగార్లు ఇద్దరు శ్రీహరి నాగభూషణరావుగారి వద్ద సంగీత విద్యాభ్యాషము చేయుచుండెడివారు. శ్రీ అమ్మవారి మహిమలను తెలిసికొనుచూ ఆమెదివ్య బోధనలకై తన గురువుగారి సంగీత పాఠము సైతము ఎగవేసి వెళ్ళు చుండెడివారు. గురువైన నాగభూషణరావుగారు ఎక్కడకు వెళ్ళారో చెప్పమని అడిగేవారు. అందుకు శేషగిరిరావుగారు ఏమి మాట్లాడెడివారు కాదు. కారణం చెప్పనందుకు గురువుగారు బాగా దండించినారు. శ్రీ అమ్మవారు ఈ విషయం గ్రహించి గురువు చెంతకు వారలను పోనీయక అమ్మవారే తన కృపావీక్షణములచే వారలను విద్యా పారంగతులు చేసినారు. ఆ విషయాన్ని "సతీ సక్కుబాయి" నాటకములో శ్రీకృష్ణపాత్రధారిగా వేసిన శ్రీ శేషగిరిరావుగారే తెల్పినారు. శ్రీ అమ్మవారు తన ఆశ్రితుల జీవితములను పరిరక్షింప సమర్థులు, ఒకసారి చల్లపల్లి వాస్తవ్యులైన చెరుకూరి పద్మనాభ ప్రసాద్ బహద్దూరు వారికి పక్షవాత మేర్పడినదట. వారి భార్య లక్ష్మీదేవమ్మగారు అమ్మవారి పాదములపైబడి అర్థించినది. వెంటనే శ్రీ అమ్మవారు రోగిని సమీపించి పాతగుడ్డనొకదాన్ని వ్యాధిగ్రస్తుని కుడికాలునకు కట్టి రెండవ చివర తన కాలునకు బంధించుకొని కొంతకాలముంచెను. వెంటనే బహదూర్‌వారికి సంపూర్ణ ఆరోగ్యము లభించినది.

శ్రీ దొంతులమ్మ అమ్మవారు ఆశ్రితుల యందనురాగంగల వారై తల్లి బిడ్డను కాపాడు రీతిగా కాపాడుచుందురు. మరియు సంపూర్ణ నమ్మకముతో అమ్మగారి సమక్షమున గురుజపము చేయుచు కూర్చున్న ఆశ్రితుల కల్మషములన్నిటిని తొలగించి మనశ్శాంతిని ప్రసాదించుచుందురు. అట్లు శ్రీ అమ్మవారి కరుణా కటాక్షముల మూలమున పవిత్రవంతమైన మనశ్శాంతిని పొంది సుఖించిన వారిలో శ్రీ పంగులూలి వీరరాఘవులుగారు ముఖ్యులు. శ్రీ అమ్మవారు సిద్ధిపొందుటకు పూర్వము కొంత కాలము సమాధియందుండిరి. శ్రీ అమ్మవారు పలుకకనే భక్తులర్పించిన ఫలములుగ్రహించి మానసికముగా దీవించి తద్వారా మనోరథ సిద్ధిగావించి పంపెడివారు. వీరి శిష్యకోటిలో అన్ని జాతులవారునూ కలరు. శ్రీ అమ్మవారు తన ఆత్మస్వరూపమునందే కళ్ళుమూసి ఆ పరమాత్మ ధ్యానమునందె పగలనియు, రాత్రియనియు అనక ఎప్పుడూ తన్మయత్వమందే యుండువారు. ఆమె స్వరూప, స్వభావ, మహిమలు తెలిసినవారానాడు శ్రీ కృష్ణమూర్తిగారు, సుబ్బమ్మగారు, లక్ష్మమ్మగారు, నెల్లూరు వాస్తవ్యులు ముత్యాల నరసమ్మగారు, బందరు వాస్తవ్యులు శ్రీ యడవల్లి నాగేశ్వరరావుగారు, శ్రీ క్రోవి సత్యనారాయణగారు, శ్రీ దాలిపర్తి పిచ్చిహరిగారు శ్రీ అహోబలరావుగారు మొదలైనవారెందరో ఉండిరి. వారందరూ ఆమెకృపకు పాత్రులైనవారే. అమ్మ ప్రజోత్పత్తి సంవత్సరం మాఘశుద్ధ తదియ మంగళవారం తేది 9-2-1932 నాడు రాత్రి 11.30 గం॥లకు దేహంచాలించారు.

(ఫిబ్రవరి 9వ తేదీ అవధూత శ్రీ దొంతులమ్మగారి ఆరాధనోత్సవము సందర్భముగా సమర్పణ)

సేకరణ : **శ్రీ యస్.యస్.ప్రసాదు**, రాజమండ్రి

# శ్రీ దామరాజు వేంకటయోగీంద్రులు

ఆంధ్రదేశములో పశ్చిమగోదావరి జిల్లా, ఏలూరునకు సమీపంలో గల ముందూరు గ్రామంలో శ్రీ దామరాజు గంగరాజు, శ్రీమతి వెంకమ్మగారు అను దంపతులకు స్వస్తిశ్రీ చాంద్రమాన విరోధికృత నామ సంవత్సర జ్యేష్ఠ శుద్ధ పూర్ణిమ ఆదివారము(తేదీ 11-6-1911) జ్యేష్ఠా నక్షత్రయుత శుభలగ్నములో మూడవ సంతానముగా ఒక కుమారుడు ఉదయించెను. ఆ శిశువునకు "వేంకటరామయ్య" అని నామకరణము చేసిరి.



చిన్నతనమునుండి వేంకటరామయ్యలో దివ్య గుణములు కానవచ్చేవి. అతడు ఏకసంధాగ్రాహి. 5 సం။ల వయస్సునకు భారత, భాగవత, రామాయణాది గ్రంథములలోని శ్లోకములను, పద్యములను ధారాళంగా వల్లెవేస్తూ ఉండేవాడు. అందరూ ఇతనిని ''వింత బాలుడని'' ప్రస్తుతించేవారు. అతి చిన్నవయస్సుననే తల్లిని పోగొట్టుకున్న ఈయనకు అయిదవ యేట ఉపనయన సంస్కారము జరిగినది. తదాదిగా సంధ్యావందనము, గాయత్రీ జపము అత్యంత శ్రద్ధతో అనుష్ఠించి, గాయత్రీమాత అనుగ్రహమున మంత్రసిద్ధి పొందిరి. నాటినుండి వారికి ఏది అవసరమో కోరకుండానే ఎప్పటికప్పుడు సమకూర్చబడేది. వేంకటరామయ్యను అందరూ గౌరవంతో "బాబు" అని పిలచెడివారు.

శ్రీ బాబుగారు ఆజన్మ బ్రహ్మచారి. దీపముక్రింద క్రీనీడ ఉన్నట్లు వారింటలోని వారు వీరిని అవగాహన చేసుకోలేకపోయారు. పైగా అవమానించేవారు కూడా. ఇటువంటి స్థితిలో అక్కడ ఉండిన సరికాదు అని తలచి తనను అభిమానించే శ్రీ గారపాటి పుల్లయ్య చౌదరిగారి ఇంట కొన్నాళ్ళు ఉండిరి. ఒకనాటి నడిరేయి గౌతమబుద్ధుని వలె తన వారిని, తన ఊరును, పుల్లయ్యగారిని విడచి రైలులో ప్రయాణించి నర్సీపట్నం ప్రాంతానికి చేరిరి. అప్పటికి ఆ ప్రాంతము దట్టమైన అటవీ సంపదతో అలరారుచుండేది.

బాబుకు పచ్చని ప్రకృతి యన్న, నిష్కల్మషమైన గిరిజనులన్న ఎంతో ఇష్టము. కాలినడకన ఆప్రాంత పర్వతారణ్యాన్నీ తిరిగి చూశారు. 'తన కన్నా ఈ ప్రపంచము వేరుకాదు' అనుభావము నిరంతరము ఉండుటచే ఆయన ఏనాడు దేనికిని బయపడలేదు. ఏ కొండశిఖరాన్నో, ఏ సెలయేటి తీరాన్నో తపస్సు చేసుకునేవారు. వారు నడయాడే పరిసరాలలో క్రూరజంతువులు సహితం సాధుజంతువులై మసలుకునేవి.

ఆనాటి రోజుల్లో బొబ్బిలి సమీపములో కలువరాయి అనే పల్లెలో ఒక గొప్ప సంపన్నుడు, మహా పండితుడు శ్రీ కావ్యకంఠ గణపతి ముని ఉండేవారు. వారి ఇంటిలో ఎన్నో ఉద్గ్రంథాలు ఉండేవి. వారి ఇంట ఒక పండిత సదస్సు జరుగుచుండగా శ్రీ బాబుగారు అచ్చటికి చేరారు.

ఒక జటిలమైన సమస్యకు పండితులు సమాధాన పడక కొట్టుమిట్టాడుచుండగా శ్రీ బాబుగారు ఆ సమస్యను పరిష్కరించారు. తపస్వి అయిన గణపతిముని శ్రీ బాబును ఆజన్మసిద్ధునిగా గుర్తించి ఆశ్రయమిచ్చారు. వారి ఇంట కొంతకాలము శ్రీ బాబుగారు ఉండి అచ్చట గ్రంథములన్నింటిని అతి తక్కువ కాలంలో క్షుణ్ణంగా అధ్యయనం గావించారు. అధ్యయనం ఒక ఇంద్రజాల విన్యాసంలా ఉండేది. ఆయన ఎంతటి గ్రంథాన్ని అయినా అలా పేజీలు తిరగేస్తూ మనము నమ్మలేనంతగా వేగంగా చదివేవారు. ఏ పేజీలో ఏమున్నదో అడిగిన వారికి క్షుణ్ణంగా చెప్పగలిగేవారు. తాను వచ్చిన పని పూర్తి అయిన పిమ్మట 'కలువరాయిని' వీడి శ్రీ బాబుగారు "పిరిడి" గ్రామంలో కొంతకాలముండి అచ్చట యువకులకు సంకీర్తన నేర్పారు. బాబుగారి సన్నిధిలో ఎందరికో ఎన్నో సమస్యలు తొలగిపోయేవి.

కస్పా జగన్నాథపురంలో శ్రీ పాలకుర్తి శ్రీరామమూర్తి అనే సంపన్నుడు శ్రీ బాబుగారికి అధ్యయనం కొరకు ప్రత్యేకముగా ఒక భవనము కట్టించి అందులో వారి కొరకు గ్రంథాలయమును ఏర్పాటుచేశారు. కాని శ్రీ బాబుగారు అచ్చట కొన్నాళ్ళు మాత్రమే ఉన్నారు. మాడుగుల సంస్థానము మేనేజరు గారింట్లో కొన్నాళ్ళు, గంగరాజు మాడుగుల మత్స్యరాజుగారింట్లో కొన్నాళ్ళు, ఒరిస్సాలోని జైపూర్ రాజా విక్రమదేవ వర్మగారి ఆతిథ్యంలో కొన్నాళ్ళు బాబుగారు ఉన్నారు. శ్రీ బాబుగారి విద్వత్తుకు జైపూర్ రాజావారు దాసోహం అన్నారు. ఒక పండితునిగా వారు కొనసాగివుంటే భారతదేశం గర్వించే ఒక గొప్ప పండితునిగా మనకు చరిత్రలో కనిపించేవారు. త్యాగమే యోగముగా జీవించిన బాబుగారు తమకున్న సమర్థత లన్నియు గొప్పలకొరకు కాక, అతి సామాన్యుల అభ్యున్నతికి వెచ్చించేవారు. ఆ సేతు హిమాచలము శ్రీ బాబుగారు పలుమార్లు పర్యటించారు. వారు ఎక్కువగా తమ శక్తిని, సమర్థతను నిష్కల్మషమైనగిరిజనుల సేవకు వినియోగించేవారు. నర్సీపట్నానికి సమీపములో గల 'పాకలపాడు'లో వారు ఆశ్రమాన్ని నిర్మింపచేసుకొని కొన్నాళ్ళు ఉండుటచే వారిని అందరూ 'శ్రీ పాకలపాడు గురుదేవులుగా' పిలువనారంభించారు. దండకారణ్య అటవీ ప్రాంతంలో వారు అనేక సంవత్సరములు పర్యటించి, గిరిజనులకు వ్యవసాయము, గృహనిర్మాణము, మానవ ధర్మములు నేర్పి అనేక వ్యసనముల బారినుండి, మూఢనమ్మకముల బారినుండి వారిని రక్షించారు. అనేక ఆపదలనుండి చివరకు మృత్యువునుండి కూడా రక్షించుటచే బాబుగారిని వారంతా తమ పాలిటి దైవముగా

ఆరాధించుచున్నారు. శ్రీ బాబుగారి మాట వారికి వేదవాక్కు. ఆయన ఇచ్చిన సూచనలమేరకు అనేక చోట్ల వందల కొలది గిరిజన గ్రామాలు నిర్మాణమైనవి. నేడు విశాఖ అటవీ ప్రాంతంలో కనిపించే అనేక గ్రామములు శ్రీ బాబుగారు స్వయంగా శంఖుస్థాపన చేసినవే! భారత, భాగవత, రామాయణ గాథలను చక్కని గేయాలతో కూర్చి వారికి నేర్పేవారు. బాబుగారు ఉండే గిరిజన ఆశ్రమములో నిత్యము అన్న సమారాధన జరిగేది. శ్రీ బాబుగారే స్వయంగా చాలా సంవత్సరములపాటు వండి అందరికి వడ్డించేవారు.

బాబుగారి ఆశ్రమము అత్యంత నిరాడంబరముగా తాటి ఆకులతో గాని, రెల్లు గడ్డితోగాని వేయబడి ఉండేది. చుట్టూ మట్టిగోడలు, గోమయంతో అలకబడి ఎంతో పవిత్రంగా పూర్వ ఋషుల యజ్ఞవాటికలా వుండేది. కేవలము కొన్ని వంటపాత్రలు, కొన్ని పుస్తకాలు, ఒక మంచము, బాబాగారి వస్త్రాలు పెట్టుకునేందుకు ఒక పెట్టె మాత్రమే ఆ ఆశ్రమములో ఉండేవి. బహుచిత్రమైన విషయము ఏమనగా బాబుగారిని దర్శించటానికి ఏ వేళలో ఎంతమంది వచ్చినా బాబుగారు వారికందరికి అప్పటికప్పుడు షడ్రశోపేతమైన భోజనము పెడుతూ ఉండేవారు. అగ్గిపెట్టెకు కూడా ఆరు వైళ్ళదూరం వెళ్ళవలసిన అరణ్యాలలో వారి ఆశ్రమాలు ఉండేవి. అయినా అన్నపూర్ణాదేవి వలె ఆయన అక్షయంగా అందరికి అన్నసమారాధన చేస్తూ ఉండేవారు. ఒకప్రక్క వచ్చిన వారితో కులాసా కబుర్లు చెబుతూనే వారు ఈ ఏర్పాట్లు అన్నీ చేస్తూ ఉండేవారు. ఇది వారి అద్భుత లీలల్లో ఒకటి.

శ్రీ బాబుగారి దర్శనానికి వివిధ ప్రాంతాలనుండి అటవీ ప్రాంతానికి భక్తులు వస్తూ ఉండేవారు. కొంతమంది దారి, తెన్ను తెలియక అవస్థలు పడుతూవుంటే 'ఫలానావారు, ఫలానాచోట నుండి మన ఆశ్రమానికి వస్తూ దారి తప్పి ఫలానాచోట ఉన్నారని, వారిని తీసుకురండి' అని తన అనుయాయులను పంపించేవారు. తాము వస్తున్నామని ముందు తెలియపరచక పోయినా తమ పేర్లు చెప్పి మరీ బాబుగారు మనష్యులను పంపిస్తే ఆ భక్తులు ఎంతో ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని పొందేవారు.

శ్రీ బాబుగారు మహోన్నత సిద్ధ పురుషులు, ఆయన పైకిమాత్రము అతి సామాన్యులుగా కనిపించేవారు. ఉతికి ఇస్త్రీ చేసిన లాల్చీ, చక్కని గ్లాస్కోపంచె, కాళ్ళకు బూట్లు, రిస్టువాచీ, శుభ్రంగా షేవింగ్ చేసుకొని హుందాగా, ఒక సంపన్నునివలె, ఒక నాయకునివలె చూపరులకు కనిపించేవారు. సాధారణంగా తపస్సంపన్నులు అనేసరికి మన మనస్సులో గెడ్డాలు, మీసాలు, రుద్రాక్షలు, విభూతిరేఖలు, కాషాయవస్త్రాలు గోచరిస్తాయి. కాని ఇవన్నియు అవసరం లేకుండానే అతి సామాన్యంగా ఒక సిద్ధపురుషుడు, ఒక తపస్సంపన్నుడు, ఒక యోగి జీవించ వచ్చునని శ్రీ బాబుగారు ప్రవర్తనద్వారా తెలిపారు.

సంకల్పమాత్రము చేతనే వెళ్ళాల్సిన చోటుకు బాబుగారు కొన్ని ప్రత్యేక సందర్భములలో వెడుతుండేవారు. ఎంతటి ఆపదనైనా 'ఫర్వాలేదులే', 'ఏంకాదు' అని వారు అన్నట్లయితే ఆ విపత్కర పరిస్థితి తొలగిపోయేది. వారి ఆశీర్వచనమునకు తిరుగులేదు. అత్యంత కరువు కాలంలో భాగవత సప్తాహమను యజ్ఞముపేర వేలాది మందికి వారముల తరబడి సర్వ సమృద్ధిగా అన్నసమారాధన జరిపించిరి. నాటి బ్రిటీషు అధికారులు వారిని పరీక్షించి చేయునది లేక వారి మహత్యమునకు నమస్కరించి వెనుదిరిగిరి. అందరి మనోభావములు వారికి తేటతెల్లము. వారు నిత్య ఎరుకతో జీవించెడివారు. ఎప్పుడూ ఖాళీగా ఉండే వారి జేబులో అవసరానికి తగ్గట్లుగా డబ్బు లభిస్తూ ఉండేది. అనుకున్నదే తడవుగా చేతికి అందినటువంటి డబ్బుతీసి కష్టాలలో ఉన్నటువంటి వారికి వారు దానం చెయ్యడం అందరిని ఆశ్చర్యపరచేది. వారు తమ మహిమలతో ఆకర్షింపబూనలేదు. ఏనాడు తన సిద్ధులను స్వప్రయోజనాలకు ఉపయోగించలేదు. కష్టించి పనిచేయవలసినప్పుడు ఎంతటి కష్టానికైనా ఆయన వెనుకంజ వేయలేదు. సామాన్యునికి వానిస్థాయిలో ఏమి చెబితే శ్రేయస్సో అది మాత్రమే చెప్పేవారు, కాని తన పాండిత్యంతో వారిని అబ్బురపరిచేవారు కాదు. ప్రేమతో పలుకరించుట, నమ్మినవారి కొరకు భాధ్యత వహించుట, దీనులను సంరక్షించుట, ఆర్తులకు స్వస్తత చేకూర్చుట, అందరిలో అన్నింటిలో అంతర్యామిని దర్శించుట, సామాన్యముగా జీవించుట అనునవి ప్రధానముగా శ్రీ బాబుగారినుండి మనము గ్రహించవలసిన ముఖ్య విషయములు.


శ్రీమాన్ ఎక్కిరాల కృష్ణమాచార్య, డా॥ శ్రీ ఎక్కిరాల వేదవ్యాస, శ్రీ ఎక్కిరాల భరద్వాజ వంటి మహనీయులెందరో శ్రీ బాబుగారిని దర్శించి వారి ఆశీస్సులు అందుకొనుచుండెడివారు. శ్రీ బాబుగారు ఏజన్సీ ప్రాంతాలలో ఆశ్రమాలలో నిష్కామయోగిగా, ఆపద్బాంధవుడిగా చిరకాలము కొలువైనారు.

శ్రీ సౌమ్యనామ సంవత్సర మాఘ బహుళ చతుర్దశి శుక్రవారం శివరాత్రి పర్వదినాన (అనగా తేదీ 6-3-1970) నర్సీపట్నం సమీపమున గల సుబ్బారాయుడు పాలెం నందు సరిగ్గా అర్ధరాత్రి లింగోద్భవ సమయమునందు శ్రీ బాబుగారు గోవిందనామ స్మరణ చేయుచూ దేహ త్యాగమును చేసిరి. వారి అంత్య క్రియలు నర్సీపట్నం సమీపమున గల ఉత్తరవాహిని తీరములో జరిగినవి. నేడచ్చట వారి సన్నిధిని ప్రసాదించుచూ ఒక అద్భుతమైన ఆశ్రమము నిర్మించబడినది. భౌతికంగా శ్రీ బాబుగారు అదృశ్యులు అయినప్పటికినీ నేటికీ నిత్య సత్యులై స్మరణమాత్రం చేతనే భక్తులకు ప్రసన్నులగుచున్నారు. సర్వ సమస్యలను తొలగించే విధముగా ప్రతి పౌర్ణమికి ఆశ్రమములో నిర్వహించే పౌర్ణమి హోమాలలో వేలాది మంది పాల్గొనుట అందుకు ప్రత్యేక నిదర్శనము. వారి జన్మదినమైన జ్యేష్ట పౌర్ణమి మరియు వారి భౌతికదేహము వీడిన మహాశివరాత్రినాడు వేలాది భక్తులతో ఆశ్రమము ఇసుకవేస్తే రాలనంతగా నిండిపోవడమే కాక అచ్చటి కార్యక్రమములు ఒక మహాజాతరను స్ఫురింపచేస్తాయి. (మార్చి 11వతేదీ గురువాము (మహాశివరాత్రి) యోగిరాజు శ్రీ పాకలపాటి గురువుగారి ఆరాధనోత్సవము సందర్భముగా సమర్పణ)

రచన : **శ్రీ యు.వి.ఎన్. రాజు**, విజయనగరం

# అవధూత కాశిరెడ్డి నాయన

నెల్లూరుజిల్లా ఉదయగిరి తాలూకా సీతారామాపురం మండలం భైరవుకొండను ఆనుకొని బెడుసుపల్ల అనే ఊరిలోని శ్రీ సుబ్బారెడ్డి అతని భార్య కాశమ్మల కడుపుపంట, శ్రీ కాశిరెడ్డి – కాశీవిశ్వేశ్వరుని ప్రసాదం. శ్రీ కాశిరెడ్డి 15–1–1895 నాడు పుష్య బహుళ పంచమి మంగళవారం నాడు జన్మించారు. పుట్టుకతోనే కాశిరెడ్డిని దైవీగుణములు వెన్నంటినవి. ఆ బాలుని ముఖవర్చస్సు ఇరుగుపొరుగు వారికి అబ్బురం కలిగించేది. ఒకనాడు తల్లి కాశమ్మ తమ పొలంలో పనిచేస్తున్న కూలీలకు అన్నం తీసుకుపోతూ కాశిరెడ్డిని చంకబెట్టుకపోయి ఒక చెట్టుక్రింద పరుండబెట్టి కూలీలకు అన్నం పెడుతున్నది. పట్టపగటియెండ శిశువు ముఖంపై పడకుండా ఒక నాగుపాము పడగవిప్పి నీడపట్టింది. కాశిరెడ్డికి ఏ కీడు జరుగనందుకు సంతోషించిన కాశమ్మ ఊరి పెద్దల కీవింత చెప్పినది. వారీ పసివాడు గొప్ప సిరిగలవాడైనా ఔతాడు లేదా గొప్ప యోగైనా ఔతాడన్నారు. కాశిరెడ్డి ముద్దుముచ్చటలు చూడకుండానే తండ్రి సుబ్బారెడ్డి కన్ను మూసినాడు. కాశమ్మ పిల్లలతో పుట్టిల్లు కొత్తపల్లెకు చేరింది. ఆమె తండ్రి అంబవరం బాలిరెడ్డి, బిడ్డను ఆదుకున్నాడు.



ఐదేండ్ల కాశిరెడ్డి వేమూరి రామయ్య వీథిబడిలో చేరి గుణితాలు, శతకాలు, రామాయణ భారతభాగవతాలు చదువుకున్నాడు. యౌవనంలోనే జిజ్ఞాసువైన కాశిరెడ్డి కొట్టాల గ్రామవాసి బ్రహ్మవేత్త కొండా రాఘవరెడ్డి సాంగత్యంతో సకల వేదాంతగ్రంథాలు జీర్ణించుకోవటంతో ఆయనలో వైరాగ్యబీజాలు మొలకెత్తినయ్యి. కృష్ణాపురంలో అత్తిరాసు గురవయ్య బ్రహ్మబోధ చేస్తాడని విని ఆశ్రయించినాడు. గురవయ్య కాశిరెడ్డిని కొన్నిదినాలు పరీక్షించి అతని అర్హతలు గుర్తించి ఒక గురువారంనాడు పంచాక్షరీ మంత్రాలుపదేశించి, హస్తమస్తకసంయోగం చేసి, తారకయోగము షణ్ముఖీముద్ర సాధించే విధానం చెప్పి అనుదినం తన సాధనానుభవాలు చెప్పమన్నారు. కాశిరెడ్డి ఒక్కొక్కమెట్టు యోగం సాధించి గురువు కెరుకపరచినాడు. ఆయన శీఘ్రప్రగతిని గమనించిన గురవయ్య "నీవు అవధూతవౌతా"వని దీవించినాడు. కాశిరెడ్డి తన పొలం అక్క కాశమ్మకిచ్చివేసి ఒక పర్ణశాల ఏర్పరచుకొని తపస్సు చేసినాడు. ఏది అయాచితంగా లభిస్తే అది తిని గురువు చెప్పిన మంత్రానుష్ఠానం, మౌనవ్రతం అష్టాంగయోగం ఖేచరీ భూచరీ అఙ్ముఖీ శాంభవీ ముద్రలు సాధన చేసి అష్టసిద్ధులు కైవసం చేసుకున్నాడు. తీవ్రసాధనతో ఆయనకు ఒకనాడు నిశ్చలసమాధి యేర్పడి భగవత్సాక్షాత్కారం లభించినది. దేహం చాలించవలెననుకున్న కాశిరెడ్డికి తాను చేయవలసిన పనులు – జీర్ణదేవాలయోద్ధరణలు, నూతన దేవాలయాల నిర్మాణం, భక్తిజ్ఞానవైరాగ్యముల ప్రచారం, నిత్యాన్నదాన కార్యక్రమాలు ఉన్నట్లు భగవదాదేశమైనది. కాశిరెడ్డి భగవదాదేశం నెరవేర్చటానికి దేశసంచారం ప్రారంభించినారు.

చేతిలో చిల్లిగవ్వ లేకున్నా కాశిరెడ్డినాయన పదులకొలది జీర్ణమైపోయిన ఆలయాలను, సమాధులను, కోనేరులను పునరుద్ధరించి పెక్కుతావులలో నూతన దేవాలయాలు నిర్మించి అన్నసత్రాలునిల్పి సత్సంగాలు నిర్వహించినారు. అది ఆయన తపోబలంచేత దయాంతఃకరణం చేత సాధ్యమైనది. ఆయనను చాలామంది నాయన అనేవారు. కొందరు తాత అనేవారు. అందువలన ఆయనకు కాశిరెడ్డినాయన, కాశిరెడ్డితాత అనే పేర్లు వచ్చినవి.

కాశినాయన చేసిన అద్భుతాలు చమత్కారాలు కోకొల్లలు. కామగమనం, తిరోహిణీవిద్య, ఒకే సమయంలో అనేక స్థలాలలో ఉండటం, క్రూరసత్త్వాలు సాత్త్వికం కావటం, రాబోయే ఆపదలు ముందుగానే చెప్పి హెచ్చరించటం వంటి పెక్కు అనుభవాలు తెలిసినవారు, సమకాలీనులైన అనుభవజ్ఞులు ఎందరో ఉన్నారు.

మహిమలు ప్రదర్శించి జనులచేత సత్కార్యాలు చేయించటం కూడ మహాత్ముల పని. కాశినాయన చందాలెత్తి అనేక దేవాలయాలు బాగుచేయించి క్రొత్త ఆలయాలు కట్టించటమే కాక తనమాట పాటించే భక్తులచేత, శిష్యులచేత అనేక జీర్ణోద్ధారాలు నూతననిర్మాణాలు చేయించినారు. కాశినాయన నూతనంగా నిర్మించిన ఆలయాలు లెక్కకు మిక్కిలి. కాశినాయన దిగువ అహోబిలములోని జ్యోతి నరసింహస్వామి ఆలయ సమీపాన భూమిలోపలి అన్నపూర్ణ విగ్రహం వెలికి తీయించమన్నారు. నాయన పర్యటనలు ఇతరస్థలాల్లో నిర్మాణాలు జీర్ణోద్ధారాల మూలంగా ఆ నిర్మాణం 1995 సంవత్సరాంతానికి పూర్తియైనది. అన్నపూర్ణ, వినాయక ప్రతిష్ఠలకోసం కాశినాయన 4–12–1995 సోమవారం మధ్యాహ్నానికి లింగాలకోననుండి కారులో కొందరు భక్తులతో వచ్చినారు, మంగళవారం ఉదయం 4 గంటలకు విగ్రహప్రతిష్ఠానంతరం నాయన పోయి కారులో కూర్చున్నారు. మిగతా భక్తులు ఇంకా జరుగుతున్న తంతులో పాల్గొన్నారు. తెల్లవారటంతో భక్తులు పోయి చూస్తే నాయన ఆత్మపరమాత్మలో కలిసిపోయినట్లు గుర్తించినారు. అది యువ సంవత్సర మార్గశిర బహుళ చతుర్దశి సోమవారం. వేలభక్తుల కన్నీటితో నాయన అభిషిక్తులైనారు. దూరప్రాంతాల నుండి భక్తులు అనేక మంది వచ్చినారు. ఉదయం కాళ్ళు చేతులు మడచి పద్మాసనంలో కూర్చుండజేసిన నాయన శరీరం సాయంకాలం 4గంటలదాకా వదులుగా ఉన్నది. ఆ సమయంలో ఎందరో ప్రముఖులు, దాదాపు లక్షమంది భక్తులు, మొదలైనవారంతా ఉన్నారు. సమాధివద్ద నిత్యార్చన, కార్తీక సోమవారాలు, నాయన ఆరాధనోత్సవాలు వైభవంగా జరుగుతున్నవి.

దిగువ అహోబిలములోని శ్రీ జ్యోతినరసింహస్వామి మందిరమునకు 2కి.మీ. దూరములోగల కాశినాయన మండలంలోని శ్రీయోగాశ్రమమున శ్రీ కాశిరెడ్డినాయనను సమాధి చేసినారు.

జనవరి 15వ తేదీ శ్రీ కాశిరెడ్డినాయిన జయంతి
సందర్భముగా సమర్పణ

సేకరణ : **శ్రీమతి ఆర్. సాయిసృజన**, బెంగుళూరు

# పెనుమత్స శ్రీ మహాయోగిని

ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాజిల్లాలోని పమిడి ముక్కల మండలము, పెనుమత్స గ్రామములో నివాసియైన శ్రీ చెరుకూరి బ్రహ్మయ్య, శ్రీ రామమ్మ పుణ్యదంపతులకు 1921వ సంవత్సరము ఆగష్టు 27వ తేదీ శుక్రవారము రోజున 4వ సంతానముగా ఆడపిల్ల జన్మించెను. తల్లిదండ్రులు ఆ బిడ్డకు పెట్టిన పేరు సీతమ్మ. తన ఐదవ ఏట అక్షరాభ్యాసము ప్రారంభించిన సీతమ్మ కేవలము 4వ తరగతి వరకు చదవగానే తల్లిదండ్రులు గండిగుంట గ్రామ వాస్తవ్యులైన 15 సంవత్సరాల శ్రీసీతారామయ్య కిచ్చి 1929లో వివాహము జరిపించిరి. 1937వ సంవత్సరములో 16 సంవత్సరాల వయస్సులో శ్రీసీతమ్మ 23 సంవత్సరాల తన భర్త దగ్గరకు మొట్టమొదటి సారిగా కాపురానికి వెళ్ళెను. భార్యాభర్తలు ఇద్దరు అన్యోన్యముగా సంసార జీవితము కొనసాగిస్తుండగా, 1939లో కుడిచేతిమీద లేచిన పుండు కారణముగా తీవ్ర జ్వరము వచ్చి ఎన్ని వైద్యాలకు లొంగక, శ్రీ సీతారామయ్య శివరాత్రి పర్వదినాన శివైక్యము చెందెను.



పుట్టింటికి తిరిగి వచ్చిన శ్రీ సీతమ్మ ఒంటిపూటే భోజనము చేస్తూ, నామాన్ని జపిస్తూ, రామకోటి వ్రాయటం మొదలు పెట్టేరు. తనలో కలిగిన తీవ్ర సంకల్పము ద్వారా 1942 సంవత్సరములో దాదాపు కఠిన నియమాలతో రోజూ 6 గంటలపాటు 6 నెలలు సూర్యోపాసన కొనసాగిచ్చారు.

1945వ సంవత్సరము తాను పూర్తి చేసిన రామకోటి వ్రాత పనిని, భద్రాచల రాముని సన్నిధిలో సమర్పించి వచ్చారు. 1946 యోగ, వ్యాయామ విద్యా ప్రవీణులు శ్రీ కమ్మల అప్పన్నగారి వద్ద యోగాభ్యాసము నేర్వటం ప్రారంభించిన శ్రీ సీతమ్మ అనతి కాలంలోనే దాదాపు 25 ఆసనాలు అతి సులభముగా నేర్చుకొని ప్రదర్శించేవారు. శ్రీసీతమ్మ ఒక చెక్క పెట్టెలో కూర్చొని, దానిని మూసివేసి, వాయుబంధనము గావించి, తన యోగాభ్యాసము కొనసాగించిరి. 1948వ సంవత్సరములో శ్రీసీతమ్మ యొక్క అద్భుతమైన యోగాన్ని చూసిన వారందరు పెనుమత్స శ్రీమహాయోగినిగా కీర్తించసాగేరు. శ్రీ రామావధూత దీవెనలతో, ధృఢసంకల్పముతో ఒక తడికెల గదిలో 4నెలలపాటు కదలక మెదలక నిర్వికల్ప సమాధి స్థితిలో నిలిచారు. శ్రీయోగిని శరీరమంతా జల్లెడవలె రంధ్రములు పడి రక్తము కారుచుండెను. అది చూసి భయపడి శ్రీ అప్పన్నగారికి కబురు చేయగా, ఆ స్థితిని చూసిన శ్రీ అప్పన్నగారు "భయపడవలసినది లేదు. ఆమె యోగనిష్ఠలో నున్నది, త్వరలో అది పూర్తయి, ఆమె శరీరము యధాస్థితికి వచ్చును" అని చెప్పెను. శ్రీయోగిని యధావిధిగా తడికెల గది(కుటీరము) మూసివేసి దాదాపు 1951వ సంవత్సరము వరకు సమాధి స్థితిలోనే ఆగదిలోనే గడిపెను. అటువంటి సమయములో అనేకమైన అద్భుతమైన దర్శనాలు తనకు కలిగెనని, "సత్యాత్మ జ్ఞాన యోగసాధన మోక్ష గ్రంథము"లో శ్రీయోగిని తెలియజేశారు. 1952వ సంవత్సరములో శ్రీ అప్పన్నగారి కోరికమేర తన గది వీడి బయటకు వచ్చి ప్రజలకు దర్శనమిచ్చేరు శ్రీయోగిని. నిరంతరము యోగనిష్ఠలో ఉండటము వలన శరీరము ఎముకల గూడువలె తయారయింది. దివ్య వర్చస్సుతో వెలిగిపోతున్న ఆమె ముఖము, పడగాకృతి వలె ఆమె తలపై గల శిరోజాలను చూసి ప్రజలు అచ్చెరువు పొందేరు. ఆమె చుట్టూ సుగంధ పరిమళం వ్యాపించి ఉండేది. 5రోజుల పాటు ప్రజలకు దర్శనమిచ్చి తిరిగి తనగదిలోకి వెళ్ళిపోయారు. 1953, 1954, 1955, 1956 సంవత్సరాలలో కూడ కొన్నిరోజులు బయటకు వచ్చి, ప్రజలకు దర్శనమిచ్చేవారు. ఆ సమయములో శ్రీయోగిని తాను వ్రాసిన హఠయోగము, రాజయోగము, ఆత్మ రామాయణము, పిండోత్పత్తి, నిర్గుణపు పుత్రేషణ మొదలైన స్వహస్త లిఖిత గ్రంధములు బయటకు ఇచ్చేవారు.

చిన్న వయస్సులోనే జీవితంలో జరిగిన విషాద సంఘటనకు కృంగిపోక, అత్యంత పట్టుదలతో, పురుషులకే పరిమితమైన యోగాభ్యాసములో అత్యున్నత స్థానానికి ఎదిగి, కేవలము తన దర్శనంతోనే ప్రజలకు ఉత్తమమైన మార్పుకు కారణమై, స్త్రీజాతికే తల మానికముగా నిలచిన, శ్రీశ్రీశ్రీపెనుమత్స మహాయోగినిగా ప్రసిద్ధికెక్కిన, శ్రీసీతమ్మ 1957వ సంవత్సరము ఫిబ్రవరి 9వ తేదీన తెల్లవారుఝామున మేళతాళములతో, భజనతోనూ వేలాది ప్రజలతో ఊరేగింపుగా తన స్వగృహము నుండి, ఆ పచ్చటి పొలాల మధ్యగల తన యోగగది వరకు ఊరేగింపుగా వచ్చి, వేలాదిమంది చూస్తుండగా, ఆ గదిలో తాను యోగముద్రలో కూర్చుని, బ్రహ్మరంధ్రము ద్వారా తుదిశ్వాస విడిచారు. ఆమె శరీరముపై అద్భుతమైన సమాధి నిర్మించారు. తిరిగి 1958 మార్చి 5వ తేదీన సజీవముగా సమాధిలో కూర్చుని అందరికీ యోగిని దర్శనమిచ్చారు. లక్షలాదిమంది ఆ జీవన్ముక్తురాలిని దర్శించి పునీతులయినారు. పెనుమత్స గ్రామములోకి అడుగిడుతూనే ఆహ్వానము పలుకుతూ దర్శనమిచ్చే ఆమె సమాధి మందిరము మనలను ఉన్నత స్థితికి ఎదగమని తెలియజేస్తూ ఉంటుంది.

(ఫిబ్రవరి 9వ తేదీ మహాయోగిని ఆరాధనోత్సవము సందర్భముగా సమర్పణ)

సేకరణ : **శ్రీమతి వి.ఎస్.లక్ష్మీ పూర్ణచంద్రరావు**

# అవధూత - శ్రీ మాలపిచ్చమ్మ

కృష్ణా జిల్లా గుడివాడ తాలూకా కురుమద్దాలి గ్రామం మాలపల్లెలోని హరిజనులైన ముత్తయ్య, వీరమ్మ దంపతులకు 1870వ సంవత్సరములో ఒక బాలిక జన్మించింది. ఆ బాలిక చిన్న వయస్సులోనే తలలో, గుండెలో అణువణువునా ఏవేవో దివ్యరాగాలు వినిపించేవి. అవి వింటూ తన్మయత్వంలో ఆ బాలిక ఉండిపోయేది. అది చూసి అందరూ ఆమెను 'పిచ్చమ్మ' అని పిలిచేవారు. అదే పేరు ఆమెకు స్థిరపడిపోయింది. క్రమేపీ ఆమెలో దివ్యత్వం వేల్కొన్నది. అది గ్రహించిన ఎంతోమంది అమ్మను ఆశ్రయించేవారు.



తన దగ్గరకు వచ్చే భక్తుల జన్మ రహస్యాలు గ్రహించి, వారి పుణ్యపాపముల కనుగుణమైన కర్మలు చేయించి, వారికి మేలు చేకూర్చేది అమ్మ. ముఖాలు చూడగానే మనుష్యుల అర్హతా, అనర్హతలను ఇట్టే చెప్పగలిగేది. జన్మలను గురించి చెప్పటం ఆ మహాతల్లికి ఒక ఆటవంటిది. మామూలుగా అమ్మ నగ్నంగానూ, అర్ధ నగ్నంగానూ ఉండేది. కామ సంకల్పం గలవారు వచ్చినపుడు "వాడి కంట్లో దోషం వున్నది కానీ, నాకు దుప్పటి కప్పండిరా! అని శరీరమంతా దుప్పటి కప్పుకునేది. నిజభక్తుల కామె నగ్నశరీరం కనిపించేది కాదు. సాధారణంగా అమ్మ తన భక్తుల కోరికలు త్రోసిపుచ్చేది కాదు. అమ్మభక్తుల ఇంటికి వెళ్ళి పూజలందుకొనేది. ఒకడు అమ్మ చూడకుండా ఆమె కప్పుకునే దుప్పటికి వెండిగ్లాసు కట్టేడు, తాను కూడా పరీక్షించాలనుకున్నాడేమో, అమ్మ ఆశ్రమానికి ఒంటరిగా వస్తున్నది. దుప్పటికి ఏదో రోత వ్రేలాడుతున్నట్టనిపించింది. దుప్పటిని ఎడంగా పట్టుకొని, దగ్గర్లో పశువులను మేపే పిల్లల్ని పిల్చి "ఈ దుప్పట్లో రోత వుంది విప్పుకోండిరా!" అన్నది. పిల్లలు సంతోషంతో కేరింతలు కొడుతూ దానిని విప్పుకొని వెళ్లిపోయారు. కొంతసేపటికి ఆ భక్తుడు వచ్చాడు. "ఇదర్రా నువ్వు చేసేపని, ఆరోత గొడ్లకాడ పిల్లల్ని విప్పుకోమన్నాను" అంది దరహాసంతో చిరునవ్వు చిందిస్తూ, అతని ముఖం వెలవెలబోయింది. అమ్మ ఎదుట సాష్టాంగ పడ్డాడు. కొందరు స్త్రీలు ఆభరణాలు అలంకరించుకొని అమ్మ దర్శనానికి వచ్చేవారు. అమ్మ వారిని ఎగాదిగా చూసి "ఒసే మాయబొమ్మా చాలా రోతలున్నాయే నీకు! ఈ తిత్తిలో గాలి పోయాక ఈ రోతలన్నీ ఏమి చేసుకుంటావే?" అని మందలించేది. అమ్మ పాటలు గీతా ప్రవచనాలై వారి జీవన రథాలను ధర్మ పథాలకు మళ్ళించేవి. బొమ్మ అంటే అమ్మ పరిభాషలో మనిషి. ధనవంతులను జూసి "ఒరేయ్ నీకు చాలా రోతవుంది కదా! అన్నదానం చేసుకోరా! ముందుదారి వుంటుంది" అని మృదువుగా మందలించేది. అమ్మ తన చుట్టూచేరే భక్తుల్ని చూసి "వీడికి, మీకు ఏనాడో రుణం రా, అందుకే అంతా పోగవుతున్నాం. ఈ జన్మలో ఎంత చేసుకుంటామో అంతా ముందు జన్మలో అనుభవింపక తప్పదురా!" అనేది. అమ్మ ఇలా తన స్వంత బాణీలో సూక్తి ముక్తావళులు వెదజల్లేది.

అది 1951 జనవరి నెల. ఒకరోజు అమ్మ తన భక్తులతో "ఈమఠం తగలబడిపోతోంది" అన్నది నిస్సంకోచంగా, భక్తుల మనస్సు కలవరపడింది. రెండు రోజులు గడిచాయి. "ఒరేయ్! వంటవాడు పైకెక్కుతున్నాడు. ఇక వంట తయారు కాదు అన్నది. అమ్మ రాశీభూతమైన శాంతిదూతలా కనిపించింది. ఇంతకాలం ఆశ్రమానికి వచ్చిన ప్రతి ప్రాణినీ అక్కున చేర్చుకుంది. ఆదరించింది. వాగామృతాన్ని ప్రోక్షించింది. ఇప్పుడు తన భౌతికకాయాన్నాశించి ఆశ్రమ ప్రవేశానికి సంసిద్ధురాలవుతున్న మృత్యుదేవతకు కూడా స్వాగతం పలికి ప్రేమాలింగనానికి సంసిద్ధురాలైంది ఆమహాతల్లి. పుష్య శుద్ధ అష్టమి తిథి పదిహేనవ తేదీన కాలయవనికను తొలగించి నిలచింది. మంచుతెరలు తప్పించుకొని సూర్యరథం మెల్లమెల్లగా ముందుకొస్తున్నది. అమ్మ రామనామం జరిపిస్తుంది. ఆశ్రమమంతా రామమయంగా ఉన్నది. గడియారం ఒకటి కొట్టింది. భక్తుల హృదయస్పందన ఆగినట్టనిపించింది. తుదిసారిగా రామనామం అమ్మ తన భక్తులకందించింది. ఆమె భ్రూమధ్యనుండి గొప్ప ధవళకాంతి ఆశ్రమమంతా నిండి ప్రకాశించింది. అమ్మ ఆఖరి శ్వాసలో అందించిన రామనామం అందరిలో వూపిరియై నిండిపోయింది. మహాచైతన్యమై ఆవరించింది. శ్రీకొమ్మరాజు లక్ష్మీకాంత యోగివర్యుల ఆధిపత్యమున అమ్మ సమాధి కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. మహా వైభవంగా అమ్మ శిలా విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. నమ్మినవారికి ఇంటింటా ఇలవేల్పు అయి వెలసింది అమ్మ. అమ్మ ఆజ్ఞననుసరించి, దేవీరూపంలో ఉన్న నల్లరాతి విగ్రహాన్ని అమ్మ సమాధిపై ప్రతిష్ఠించారు. కాబట్టి ఆ మూర్తి సిద్ధేశ్వరిగా ప్రసిద్ధిగాంచింది. భక్తులు ఆరెండు మూర్తులను నల్లమ్మ, తెల్లమ్మ అని ఆప్యాయంగా పిలుచుకుంటూ, నేటికీ కొలుచుకుంటున్నారు.


(జనవరి 15వ తేదీన అవధూత శ్రీ మాలపిచ్చమ్మ ఆరాధనోత్సవము సందర్భముగా ప్రత్యేకవ్యాసం)

అమ్మ ఆశ్రమం : కృష్ణాజిల్లా గుడివాడ తాలూకాలోని కురుమద్దాలిలో ఉంది. విజయవాడ బస్టాండు నుండి బస్సు సౌకర్యము కలదు.

సేకరణ : **శ్రీమతి విజయలక్ష్మి**, విజయవాడ

# అవతార్ మెహర్‌బాబా

మేర్వాన్ షెరియార్ ఈరానీ (మెహర్‌బాబా) ఫిబ్రవరి 25వ తేదీన 1894వ సంవత్సరంలో భారతదేశంలోని పూనా నగరంలో జన్మించారు. 1913వ సంవత్సరం మే మాసంలో దక్కను కళాశాలలో విద్యాభ్యాసం చేయుచున్న మేర్వాన్ ఒక రోజు సైకిలు పైన, ఆనాటి పంచసద్గురువుల్లో ఒకరైన హజ్రత్ బాబాజాన్ అనే మహమ్మదీయ వనిత ప్రక్క నుండి వెళ్ళుతుండగా అతనిని తన సమీపానికి పిలిచి, అతని నుదుటి పైన ముద్దు పెట్టింది. ఆ తర్వాత ఆమె మానవ రూపంలో పరిపూర్ణంగా అభివ్యక్తమయ్యే దైవస్థితిని అనగా అవతార స్థితిని, తన యదార్థ స్థితిని మేర్వాన్‌కు అనుభవ పూర్వకంగా కలుగజేసింది.



మొదట మేర్వాను ప్రాపంచిక స్పృహ కోల్పోయిన స్థితిలో ఉన్నా క్రమేపీ కొన్ని మాసాల తర్వాత పరిసరాలకు చెందిన ప్రాపంచిక స్పృహ తిరిగి రాగా దానితో షిర్డి సాయిబాబా వద్దకు వెళ్ళగా ఆయన మేర్వానును పంచసద్గురువులలో నొక్కడైన సాకోరీలోని ఉపాసనీ మహరాజు వద్దకు పంపారు. ఉపాసనీ మహరాజు హిందువు. సాయిబాబా తన మతమేమిటో చెప్పలేదు. మిగతా యిద్దరు సద్గురువుల్లో తాజుద్దీన్ బాబా మహ్మదీయుడు, నారాయణ మహరాజు హిందువు. దాదాపు ఏడు సంవత్సరాల్లో ఉపాసనీ మహరాజు మేర్వాన్ యొక్క దివ్య చైతన్యాన్ని స్థూల ప్రపంచ చైతన్యంతో అనుసంధాన పరచి ఈ యుగావతారుని పాత్రలో అతనిని ప్రతిష్టించారు. 1921వ సంవత్సరంలో తన తొలి శిష్యులను చేరదీసుకోవడం ద్వారా ఆయన అవతార కార్యం అభివ్యక్తం కావడం ప్రారంభమైనది. తొలి శిష్యులు ఆయనకు "మెహర్‌బాబా" అనగా 'దయామయుడైన తండ్రి' అనే పేరు పెట్టారు.

శిష్యులతో కలసి ఎన్నో మాసాల కఠిన శ్రమ, అవిభక్త భారతదేశంలో మరియు ఈరాను దేశంలో చేసిన ప్రయాణాల తర్వాత 1923వ సంవత్సరంలో మెహర్‌బాబా మరియు ఆయన శిష్యులు అహమ్మద్‌నగర్ సమీపాన మొదటి ప్రపంచ సంగ్రామ సమయంలో సైన్యం వారి స్థావరంగా ఉపయోగించి వదిలి వెళ్ళిన స్థలాన్ని నివాసంగా చేసుకున్నారు. ఆ నివాస స్థలానికే మెహరాబాద్ అనే పేరు వచ్చింది. ఆ చోటులోనే మెహర్‌బాబా ఉచితవిద్యాలయం, ఆసుపత్రి, పేదలకు, మతిభ్రమించిన వారికి ఆశ్రమం, అన్ని మతాలకు చెందిన బాలురకు ఉచిత పాఠశాల మొదలగు ఎన్నో సేవా కార్యక్రమాలను ప్రారంభించారు. అచ్చట ఆధ్యాత్మిక శిక్షణకు ప్రాధాన్యత యివ్వబడింది. పాఠశాలలో కులాలకు చెందిన తారతమ్యాలు పాటించబడలేదు. ఉన్నతులు, నిమ్నజాతికి చెందిన వారందరు గురుభక్తి (ప్రేమ)తో కలుపబడిన వారై కలసి మెలసి సమభావంతో ఉండేవారు. అందరికీ మెహర్‌బాబా నైతిక క్రమశిక్షణ, ఆధ్యాత్మిక అవగాహన, నిస్వార్థసేవ మరియు అన్నింటికంటె మిన్నగా దైవ ప్రేమను గురించిన పాఠ్యాంశాలను క్రమం తప్పకుండా బోధించారు.

10-7-1925 నుండి మెహర్‌బాబా మౌనం ఆరంభించే ముందు, మీ అనుచరులకు మీ సందేశాలను, బోధనలను మౌనంగా ఉంటే ఎలా చెప్పగలరనే ప్రశ్నకు మెహర్‌బాబా యిలా సమాధానమిచ్చారు. "నేను బోధించుటకు రాలేదు. మేల్కొల్పుటకు వచ్చాను". 1930వ దశకం ప్రారంభంలో మెహర్‌బాబా ఐరోపా ఖండంలోను, అమెరికా దేశంలోను చేసిన పర్యటనలు విస్తృతంగా సాగాయి. మెహర్‌బాబా స్వయంగా పేదలకు, మానసిక రోగులకు, వికలాంగులకు సేవ చేశారు. కుష్టువ్యాధి పీడితుల కోసం ప్రత్యేక శ్రద్ధ వహించారు. అనంతమైన ప్రేమతో, శ్రద్ధతో వారి పాదాలు కడిగి, మెలి తిరిగిన పాదుల లాంటి ఆ కాళ్ళతో కుంటుతూ నడిచే వారి కాళ్ళపై తన మస్తకాన్ని ఆనించి ప్రణమిల్లి, వస్తు రూపకంగా ఇవ్వబడిన అల్ప బహుమానంతో అనల్పమైన, ద్విగుణీకృతమైన ఆశతో పంపించేవారు.

మెహర్‌బాబా అవలంభించిన 44 సంవత్సరాల మౌనం 31-1-1969వ రోజు తన భౌతిక కాయాన్ని విసర్జించే వరకు అఖండంగా కొనసాగింది. ఆయన ఆఖరి సంవత్సరాలు తీవ్రమైన విశ్వకార్యక్రమాల్లోను, ఏకాంత వాసాల్లోనూ గడుపబడ్డాయి. 1968వ సంవత్సరం మధ్యభాగంలో "తన అవతార కార్యం నూటికి నూరుపాళ్లు తనకు సంతృప్తికరంగా జరిగిందని" మెహర్‌బాబాయే స్వయంగా ప్రకటించారు. ఆయన భౌతిక దేహాన్ని విడిచి వేయగా, వేల సంఖ్యలో జనం ఆఖరిసారిగా ఏడు రోజుల వరకు, మెహరాబాదు సమాధిలో ఉంచిన ఆయన దేహాన్ని దర్శించడానికి, అందరి ప్రేమనందుకొన్న ఆ రూపానికి నివాళులర్పించడానికి వచ్చారు.

ప్రతి సంవత్సరం వందలాది సాధకులు వేల సంఖ్యలో యాత్రికులు మెహరాబాదులోని అవతార్ మెహర్‌బాబా దివ్యసమాధిని, చాలా కాలం ఆయనకు నివాసస్థలంగా ఉన్న మెహరాబాద్‌ను దర్శించుకుంటారు. ఈ రెండు క్షేత్రాలు భారతదేశంలో అహ్మద్‌నగర్ పట్టణానికి సమీపంలో ఉన్నాయి.

(జనవరి 31వ తేదీ అవతార్ మెహర్‌బాబా ఆరాధనోత్సవము మరియు ఫిబ్రవరి 25వతేదీ జయంతి సందర్భముగా సమర్పణ)

సౌజన్యం: **మెహర్‌బాబా జీవిత చరిత్ర** సేకరణ: **"సత్యాన్వేషి"**

# ఆదర్శమూర్తి - స్వామి వివేకానంద

ఆధునిక యుగపు గొప్ప ఆధ్యాత్మిక వేత్తలలో పేరెన్నిక గన్నవారు స్వామి వివేకానందుడు. ఆధ్యాత్మికతకు, మతసామరస్యానికి గొప్ప సంస్కృతికి భారతభూమి నిలయమని, పాశ్చాత్యులు గ్రహించేలా చేసిన మహోన్నత వ్యక్తిత్వము గలవారు స్వామివివేకానంద. తన అద్భుతమైన వాగ్ధాటితో భారతావని ఉత్కృష్ట సంస్కృతి, వారసత్వ సంపద గురించి ప్రజలకు తెలియజేయటమే కాకుండా, వారిలో ఆత్మ విశ్వాసాన్ని, అవగాహన దృక్పధాన్ని పెంపొందించి, అణగారిన జనులను ఉద్ధరించాల్సిన అవసరాన్ని తెలియజేస్తూ, పేదల అభ్యున్నతికై పాటుపడమని యువతకు ప్రబోధించటమే కాకుండా, అనేక సామాజిక సేవాకార్యక్రమాలకు నాంది పలికిన యువతరేణ్యుడు స్వామి వివేకానంద. తన 39 సంవత్సరాల 6 నెలల జీవితకాలంలోనే మానవాళి సంక్షేమానికి, అభ్యున్నతికి, ఆధ్యాత్మిక ఉన్నతికి ఎనలేని కృషిచేసిన విశ్వజనీయమైన స్వామిజీ జీవితం నేటి ఆధునిక యువతరానికి ఎంతో ఆదర్శము. వారి జీవితంలో మచ్చుకు కొన్ని సంఘటనలు జనవరి 12వ తేదీ స్వామిజీ జయంతి సందర్భముగా ఆదర్శమూర్తి శీర్షికన శ్రీరామకృష్ణమఠం వారి "స్వామి వివేకానంద – జీవితం – సందేశం" గ్రంథము ఆధారంగా అందజేస్తున్నాము.



1884వ సంవత్సరం మొదట్లో నరేంద్రుడి తండ్రి మరణించారు. పెద్ద కుమారుడు కావడం వల్ల నరేంద్రుడే ఇక కుటుంబానికి పెద్ద అయినాడు. ఉద్యోగానికై ఎక్కే గడపా దిగే గడపా. ఫలితం శూన్యం. తినడానికి కూడా ఒక్కోసారి ఏమీ ఉండేది కాదు. తండ్రి మరణంతో నరేంద్రుడి జీవితం తెగిన గాలిపటమైంది. లోకం నరక కూపమైంది. అనేకమైన బాధలు చుట్టుముట్టినయ్యి. మనశ్శాంతి ఎక్కడైనా దొరుకుతుందంటే అది శ్రీరామకృష్ణుల వారి పాదపద్మాల చెంత మాత్రమే.

ఎక్కువ కాలం గురుసేవలో గడిపేవాడు నరేంద్రుడు. అప్పుడప్పుడూ కుటుంబానికి కావలసిన చిన్న చిన్న పనులు చేయడానికి బయటకు వెళ్ళినా, ఎక్కువ శాతం కాశీపూర్‌లోనే గురువుకి సపర్యలు చేస్తూ గడిపేవాడు. "దుర్లభమైన మానవ జన్మనెత్తిన వారికందరికీ జీవిత ఉద్దేశ్యం భగవత్సాక్షాత్కారమేననీ, అందుకై తీవ్రంగా ప్రయత్నించనివాడి జన్మ నిరర్థకమనీ, అందుకు గురూపదేశం ఎంతో అవసరమని" నరేంద్రుడి దృఢ విశ్వాసం. భగవంతుడిని ఎలా సాక్షాత్కరించుకోవాలి. అయనను ఎలా చూడాలి అనేదే అతడిలో రగులుతున్న జ్వాల, తపన. ఈ ప్రపంచమూ దానిలోని సుఖభోగాలు ఎండమావులనే సత్యం ఇప్పుడు బాగా తెలిసివచ్చింది. ఇక ఒకేఒక లక్ష్యం భగవత్సాక్షాత్కారం. గురువుగారి వద్ద ఉపదేశం పొంది, ఆయన ఆదేశనిర్దేశానుసారం రోజులో ఎక్కువ సమయం ధ్యానంలో గడిపేవారు. సాధనలో నరేంద్రుడికి అద్భుతమైన అనుభూతులు కలిగేవి. ఒక్కోసారి అంతర్జగత్తులో మునిగిపోయి బాహ్య ప్రపంచపు స్పృహని సైతం పూర్తిగా కోల్పోయేవాడు.

1886, ఆగష్టు 16వ తేదీన శ్రీరామకృష్ణ గురుదేవులు తమ భౌతికదేహం వీడేరు. బారానగర్‌లో ఒక పాడుబడ్డ చిన్న ఇంటిని ఒక భక్తుడి తోడ్పాటుతో అద్దెకు తీసుకున్నారు నరేంద్రుడు. ఇదే రామకృష్ణ సంప్రదాయం యొక్క ప్రథమ మఠం (సన్యాసులుండే ఆశ్రమం). వారికి కట్టుకోవడానికి గుడ్డలు కూడా సరిగా ఉండేవి కాదు. అన్నం, ఉడకబెట్టిన ఆకుకూరల్లో నంచుకోవడానికి ఉప్పు కూడా లేని పరిస్థితి.

ఇవేవి వారికి బాధ కలిగించలేదు. అసలు వారికి ఇవన్నీ ఆలోచించేందుకే సమయం ఉండేది కాదు. మనస్సంతా ఎల్లవేళలా భగవంతుడే నిండి ఉండేవాడు. శ్రీరామకృష్ణులు చెప్పినవన్నీ పాటించడానికి ప్రయత్నించేవారు.

స్వామిజీ 1888లో కాశీకి ప్రయాణమయ్యారు. అక్కడ త్రైలింగ స్వామి, భాస్కరానంద స్వామి అనే ఇద్దరు ప్రసిద్ధమైన మహానుభావుల్ని కలిశారు. కాశీలో ఒక సంఘటన జరిగింది. ఒకరోజు దుర్గా అమ్మవారి ఆలయానికి వెళ్ళి వస్తూంటే దారిలో ఒక కోతుల గుంపు కనిపించింది. అవి ఆయన వైపుకి పరుగెత్తి రాసాగాయి. అవి కరుస్తాయనే తలంపుతో స్వామీజీ వెనుదిరిగి చిన్నగా పరుగెత్త నారంభించారు. అవి ఇంకా వెంబడిస్తూనే ఉన్నాయి. ఏం చేయాలా అని ఆలోచిస్తూ పరుగెడుతున్న స్వామికి అటుగా వెళ్తున్న ఒక వృద్ధ సన్యాసి కనిపించాడు. అంతా గమనించిన ఆ సన్యాసి, "ఆగు వెనుదిరిగి ఆ జంతువునెదుర్కో", అని గట్టిగా అరిచాడు. స్వామిజీ ఆగి వెనక్కి తిరగగానే కోతులు కూడా ఆగి వెనుదిరిగాయి. స్వామీజీ రెండు మూడడుగులు వేసి భయపెట్టగానే అవి పరుగులంకించుకున్నాయి. తరువాతికాలంలో స్వామిజీ అమెరికాలో ప్రసంగిస్తూ ఇది తన జీవితంలో తాను నేర్చుకున్న ఒక గొప్ప పాఠం అనీ, ఆ "కోతుల్లాగా కష్టాలు మనల్ని వెంబడించినపుడు మనం భయపడి పారిపో ప్రయత్నించామా అవి మనల్ని వెన్నాడతాయనీ, ఎప్పుడైతే ఆగి మనం వెనుదిరిగి వాటి నెదుర్కొంటామో అప్పుడు అవే పారిపోతాయి'' అని బోధించారు.

ఈ పర్యాటనలలో స్వామీజీ ఎన్నో అనుభవాలు ఎదురైనాయి. కొన్ని మంచివి. కొన్ని చెడ్డవి. చాలాసార్లు ఆయనికి ఎన్నో రోజులు తినడానికి ఏమీ ఉండేవి కాదు. చాలా రాత్రులు ఆయనకి ఆకలీ

బదలికలే స్నేహితులుగా ఉండేవి. కరుణగలవారిని కూడా ఎందరినో చూశారు స్వామీజీ. కాని అలాంటి వారు ఎక్కువగా పేదలూ, సాంఘికంగా చాలా తక్కువస్థాయిలో ఉన్నవారిలోనే కనిపించేవారు. వారే ఆయనకి అన్నం పెట్టి, ఇంత నీడనిచ్చేవారు.

అటువిమ్మట మీరట్ వదిలి ఒంటరిగా స్వామి తిరుగనారంభించారు. ఒకసారి వీరుల రాజ్యమైన రాజ్‌పుటానాలోని అళ్వార్‌లో ఉండగా ఒక ఘటన జరిగింది. అక్కడి రాజు మంగళ్ సింగ్‌తో స్వామీజీ మాట్లాడుతున్నప్పుడు, రాజుగారు తనకు విగ్రహారాధనపై నమ్మకం లేదనీ, అలా చేయడం రాళ్ళు రప్పలని పూజించడమే అవుతుందని తెలిపారు. స్వామివారు రాజుగారి చిత్ర పటాన్ని ఒకదాన్ని తెప్పించమన్నారు. మంత్రి గారిని పిలిచి దానిమీద ఉమ్మివేయమన్నారు. అందరూ విస్తుపోయారు. మంత్రి భయపడుతూ, "స్వామీజీ! ఏమంటున్నారు మీరు? ఇది మా ప్రభువు చిత్రపటం. మేమెలా అటువంటి పని చేయగలం?" అని అన్నాడు. అప్పుడు స్వామీజీ ఇలా బదులు చెప్పారు. "చూశారా మహారాజా! నిజానికి మీరు ఈ చిత్రంలో లేరు. ఇది కేవలం ఒక చిత్రపటం మాత్రమే. అయినా మీ ఈ చిత్రపటానికి అవమానం జరిగితే అది మీకు జరిగినట్లేనని భావిస్తున్నారు మీ ప్రజలు. దానికి గౌరవం చూపిస్తే మీకు చూపించినట్లేననుకుంటారు వారు. చిత్రపటాలనీ, రాయినీ, చెక్కనీ ఎవరూ పూజించరు." అంతే, ఆ మహారాజు గారు చేతులు జోడించి, "స్వామీ, మీరు నా కళ్ళు తెరిపించారు" అన్నారు.

స్వామీజీ ఎక్కడికి వెళ్ళినా ఎక్కువగా కాలినడకనే వెళ్ళేవారు. ఎవరైనా డబ్బులిస్తామంటే వద్దని చెప్పి, కావాలంటే తను వెళ్ళవలసిన ఊరికి రైలు టిక్కెట్టు మాత్రం కొనిమ్మని చెప్పేవారు. స్వామీజీ ఎన్నోసార్లు తనకై తాను కొన్ని నియమాలు పెట్టుకునే వారు. ఎవరైనా పిలిచి ఆపితే తప్ప ఆగకుండా యాత్ర సాగిస్తూనే ఉండాలనీ, ఎవరైనా పిలిచి భిక్ష ఇస్తే తప్ప ఆహారం తీసుకోకూడదని ఇలాంటి కఠిన నియమాలెన్నో పాటించేవారు. భారతదేశాన్నంతా ప్రత్యక్షంగా తిరిగి చూశారు స్వామిజీ. అనాది కాలం నుండీ ప్రపంచానికి గురువై మార్గనిర్దేశం చేసినది తన మాతృభూమి. మిగతా దేశాల్లో వారు ఒంటికి రంగు పూసుకుని జంతువుల్లా బతికే సమయంలో అన్ని రంగాల్లోనూ అద్భుత ప్రతిభని కలిగి, పారమార్థిక సత్యాలని కనుగొనడమే కాక, అనుభూతికి తెచ్చుకుని ఋషులవలె జీవనం సాగించే సంస్కృతి కలిగిన తన పూర్వీకుల భూమి, పుణ్యభూమి, దేవభూమి, అప్పటికి వేయి సంవత్సరాలనుండీ, పరాయి దేశాల వారికి బానిసగా బతుకుతూ, పేదరికంలో మగ్గుతూ, మూఢ నమ్మకాల్లో కూరుకుపోతూ, ఆహార విహార నిద్రా మైథునాది క్రియల్లో రకరకాలుగా పాల్గొని ఆనందించడమే జీవిత పరమోద్దేశంగా భావించే వారు చెప్పిందే సత్యం, తమ పూర్వీకులు ఆ మాత్రం చేయ చేతగాని అవివేకులనీ, దద్దమ్మలనీ, వారి వేద పురాణేతిహాస వాఙ్మయమంతా బూటకమనీ, పిచ్చి కవితలనీ, కల్పితమనీ మ్లేచ్ఛులు చెప్పగా విని, విశ్వసించి స్వధర్మాన్ని విడనాడి పరధర్మమే పరమధర్మమనే భ్రమలో ఉన్నదే! అయ్యో! ఎవరు నా తల్లిని, నా మాతృభూమిని అంధకారం నుండి మేల్కొల్పుతారు? ఈ దేశ ప్రజల అలసత్వాన్నీ అజ్ఞానాన్నీ పటాపంచలు చేసి మరల దానికి తన పూర్వ వైభావాన్ని తీసుకురావడం ఎలా? ఇన్ని ప్రశ్నలూ, ఇంత ఆవేదనా మనస్సులో ఉవ్వెత్తున లేచి చేసే అల్లకల్లోలం ముందు, ఎదుట ఉన్న మూడు సముద్రాల అలల జోరు లెక్కలోనికి రానిదై స్వామీజీ కన్యాకుమారి వద్ద సాగరాన్ని ఈది ఒక శిలను చేరుకున్నారు.

బ్రహ్మతేజముట్టిపడే ముప్ఫై ఏళ్ళ ఆ యువ సన్యాసి కళ్ళలో నీరు ధారలై కారుతోంది. ఆధ్యాత్మిక జగత్తుకి రారాజైన ఆ సన్యాసి, భగవంతుడిని కాక తన మాతృదేశంపై, ఆవిడ పూర్వ వైభవంపై, ప్రస్తుత దాస్యంపై, ప్రశ్నార్థకమైన భవిష్యత్తుపై ధ్యానం చేయనారంభించాడు. శిలా ప్రతిమవలె, అపర బుద్ధుడి వలె నిశ్చలుడై భారత దేశాభిముఖుడై కూర్చున్న ఆయన, మూడు రాత్రులూ మూడుపగళ్ళూ, నిద్రాహారాలు లేక ధ్యానించాడు. పేదల కష్టాలు తీర్చడానికీ, విద్యా, వైద్య సదుపాయాలందించబడడానికీ, మూఢ నమ్మకాలు వదిలి, కుసంస్కృతిని వదిలి దేశ ప్రజలు సరైన దారిలో నడవబడడానికీ స్వామీజీ తన దేశపు రాజులకీ, విద్యావంతులకీ, ధనవంతులకీ ఎన్నో వినతులూ, విజ్ఞాపనలూ చేశారు. వారంతా ఆయనను ఒక సన్యాసిగా, ఒక ప్రతిభావంతుడైన మనిషిగా గుర్తించి, గౌరవించి, ఆదరించారేగానీ, దేశం పట్ల తమకున్న కర్తవ్యాన్ని విస్మరించారు. కొంతమంది తమ అశక్తతను వ్యక్తం చేశారు. మరి మార్గాంతరం? ఒకటే, పాశ్చాత్య దేశాలు ఆర్థికంగా, సాంకేతికంగా గొప్పవి. భారతదేశం ఆధ్యాత్మికంగా గొప్పది. వీటి మధ్య ఇచ్చిపుచ్చుకోవడం జరిగితే ఉభయులకూ శుభం జరుగుతుంది. అందుకు ఎవరో నాంది పలకాలి. పాశ్చాత్య దేశాలకి వెళ్ళి వారిని మెప్పించి, ఒప్పించి ఈ కలని నిజంచేయాలి. మూడవ రోజు అంతరంగంలో గురువు శ్రీరామకృష్ణ పరమహంస ఆజ్ఞ స్పష్టంగా వినవచ్చింది. అమెరికా దేశంలో సకల మతాల మహాసభ ఒకటి జరుగబోతున్నదని అంతకుముందు ఎక్కడో విన్నారు స్వామీజీ. ఆ సభలో పాల్గొని భారతదేశపు ధర్మాన్ని ప్రపంచానికి సరైన విధంగా తెలియజేయడానికై నిశ్చయించుకున్నారు స్వామీజీ.

స్వామీజీ అక్కడనుండీ మద్రాసు వెళ్ళారు. అక్కడ కొంతమంది యువకులు ఆయన ప్రణాళికను విని సహాయం చేయడానికై ముందుకు వచ్చారు. ఖేత్రీ మహారాజు ఈ సమయంలో స్వామివారిని ఆహ్వానించి, వారి ఆలోచన విని, కెనడాకి వెళ్ళే ఒక ఓడలో ప్రథమ శ్రేణి టిక్కెట్టు కొని ఇచ్చారు. ఆయన స్వామీజీకి మంచి కాషాయ వస్త్రాలు బహూకరించి, 'వివేకానంద' అనే నామధేయాన్ని స్వీకరించవలసిందిగా ప్రార్థించారు. స్వామీజీ ఈ విధంగా వివేకానంద స్వామి అయ్యారు. కాలాంతరములో తన సంకల్పాలను, గురువాజ్ఞను నేరవేర్చి భారతావనికి ప్రత్యేకించి యువతకు ఆదర్శముగా నిలచారు స్వామి వివేకానంద.

(జనవరి 12వ తేదీ స్వామి వివేకానంద జయంతి సందర్భముగా సమర్పణ)

సౌజన్యం : **"స్వామి వివేకానంద జీవితం-సందేశం"**

సేకరణ : **'విరించి'**

# స్ఫూర్తి ప్రధాత - జాతిపిత మహాత్మాగాంధీ

నా జీవితమే నా సందేశం అని చాటిన మహనీయుడు గాంధీజీ. అహింసాయుత మార్గంలోనే ఆయన సూర్యుడు అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించారు. ప్రపంచానికి ఆయన అందించిన పదునైన ఆయుధం అది. మహాత్మాగాంధీ అందించిన అహింసా ఉద్యమం యావత్ ప్రపంచానికి స్ఫూర్తిగా నిలిచింది. ఆయన ఎంచుకున్న బాట ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల్లో ఓ పాఠ్యాంశంగా మారింది.

లోకానికి మార్గదర్శిగా నిలిచిన మన జాతిపిత జన్మదినాన్ని ఏటా 'అహింసా దినోత్సవం'గా నిర్వహించుకుంటున్నాం. గాంధీ జీవితం, ఆయన నమ్మిన సిద్ధాంతాలు, నడిపిన ఉద్యమాలు ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి. వీటికి ప్రాతిపదికలు సత్యం, అహింసా. ఈ రెంటినీ కలిపి ఆయన సత్యాగ్రహమనే పదునైన ఆయుధాన్ని తయారు చేశారు. దానిని భారత స్వాతంత్ర్య పోరాటంలో వాడారు. "పరిపూర్ణమైన వ్యక్తిత్వానికి మొదటి మెట్టు కల్లాకపటం లేకుండా ఉండటమే, అలా ఉన్నవాడే విశ్వసత్యాన్ని తెలుసుకోగలుగుతాడు" అని గాంధీజీ చెప్పేవారు. **"నిజం మనిషికి ధైర్యాన్నిస్తుంది, పోరాడే శక్తినిస్తుంది"** అని గాంధీజీ అన్నారు. ఈ క్రమంలోనే ఆయన సత్యాగ్రహాన్ని బలమైన ఆయుధంగా ఎన్నుకున్నారు.



ప్రపంచంలో వచ్చిన చాలా ఉద్యమాలు హింసతో కూడుకున్నవే. భారత స్వాతంత్ర్యానికి ముందు ఆ తర్వాత ప్రపంచంలో వచ్చిన ఉద్దమాలన్నీ హింసాయుతమైనవే. వాటన్నింటినీ చూస్తూ, చదువుతూ పెరిగిన గాంధీజీ మాత్రం భారత స్వాతంత్ర్యోద్యమానికి అహింసాయుత పోరాటాన్ని ఎన్నుకున్నారు.

భారత స్వాతంత్ర్యం కోసం గాంధీజీ ఎంచుకున్న మార్గాన్ని తొలినాళ్లలో చాలా మంది విమర్శించారు. అది సాధ్యమయ్యే పనికాదన్నారు. అంత పెద్ద దేశం అహింసా మార్గంలో పోరాడటమేంటని ప్రపంచం కూడా నివ్వెరపోయింది. అయితే... గాంధీజీ మాత్రం తన సిద్ధాంతాన్ని బలంగా నమ్మేరు. ప్రేమతోనే గెలుస్తూ ముందుకుసాగారు. నిజానికి దక్షిణాఫ్రికాలో వర్ణ వివక్షపై పోరాట సమయంలోనే దీనికి బీజాలు పడ్డాయి. సత్యాగ్రహం అంటే ఏమిటో గాంధీజీ స్వయంగా వివరించారు. **"సత్యాగ్రహం అంటే సత్యం కోసం ఆగ్రహం కాదని, సత్యాన్ని దృఢంగా పట్టుకొని ఉండటము"** అని గాంధీజీ మాట. హింసను అహింసతో ఎదుర్కోవడమే సత్యాగ్రహం. అహింస అంటే హింస కానిది అని మాత్రమే అర్ధం కాదంటూ.... గాంధీజీ దానికి ఒక పరిపూర్ణ నిర్వచనం కూడా ఇచ్చారు.

గాంధీజీ **అహింస అంటే ప్రేమ. ప్రతి వ్యక్తి తనను ప్రేమించుకున్నట్లే ఇతరులనూ ప్రేమించాలని సూచించారు.** అదే అహింస అని పేర్కొన్నారు. సత్యాగ్రహం అనే గొప్ప ప్రక్రియకు సత్యం పునాది అయితే ప్రేమ ఓ ప్రాతిపదిక అని తెలిపారు. **ప్రతి హృదయంలోనూ ఏదో ఒక మూలను ప్రేమజ్యోతి మిణుకుమిణుకు మంటూ ఉంటుంది. దాన్ని ప్రకాశింపజేయటమే సత్యాగ్రహం** అని చెప్పారు. భారత స్వాతంత్ర్య సంగ్రామ కాలంలో ఉద్యమ విషయంలో ఆయన ఎన్నో అవహేళనలు ఎదుర్కొన్నారు. కానీ, వెనుకంజ వేయలేదు. తాను నమ్మిన సిద్ధాంతాన్ని బలంగా విశ్వసించారు. ఆచరణను మార్చుకోలేదు. ఎత్తుగడలు మార్చుకున్నారే తప్ప సిద్ధాంతాన్ని మాత్రం మార్చుకోలేదు. తన ప్రయత్నాలు, ప్రయోగాలు దారుణంగా విఫలమైన సందర్భాల్లోనూ ఆయన నియమం తప్పకపోవటం విశేషం.

**స్ఫూర్తి కలిగించే మహాత్మాగాంధీ బోధలు కొన్ని :**

1. ఇతరులు చేసిన ఏనుగంత తప్పును ఆవగింజంత చిన్నదిగా చూడు. నువ్వు చేసిన చిన్న తప్పును కూడ కొండంత తప్పుగా భావించు.
2. దేశం అభివృద్ధి చెందటము అంటే అద్దాలమేడలు, రంగుగోడలు కాదు పౌరులు నైతికాభివృద్ధే నిజమైన అభివృద్ధి.
3. ఎవరైనా మనకు ఇచ్చేది తాత్కాలికమైనదే, కష్టపడి మనం సంపాదించుకొనేది మాత్రమే శాశ్వతంగా మిగిలిపోతుంది.
4. గురువును మించిన పాఠ్యగ్రంథం లేదని నేను నిరంతరం విశ్వసిస్తాను
5. మహావృక్షం కూడ మౌనంగానే ఎదుగుతుంది, అలాగే మహానుభావులుగా మారాలి అంటే మాటల కంటే చేతలకు ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వాలి.
6. మీరు పుస్తకాలు పఠించవచ్చు కాని అవి మిమ్మల్ని ఎక్కువ దూరం తీసుకెళ్ళవు, మీలోని ఉత్తమ తత్వాన్ని బయటకు తేవటమే నిజమైన విద్య అని అనిపించుకుంటుంది. మానవత్వం అనే పుస్తకం కంటే వేరొక ఉత్తమ గ్రంథం ఏమి ఉంటుంది. ప్రపంచం ఆధిపత్యం వహించిన పటిష్టవంతమైన శక్తి-ప్రేమ మరియు అది వినయం గల కల్పనా రూపము. ప్రేమ ఎక్కడ ఉంటుందో దేవుడు కూడా అక్కడే ఉంటాడు.
7. విద్యార్థుల ఆలోచనలు, ఆచరణలు క్రమశిక్షణతోకూడి లేకుంటే వారు చదువంతా వృధా.
8. ఎవరైతే ముఖంపై చిరునవ్వుల్ని ధరించరో, వారు పూర్తిగా దుస్తులు ధరించినట్లు కాదు

(జనవరి 30వ తేదీ మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భముగా సమర్పణ)

సౌజన్యం : **జాతిపిత గాంధీజీ వీకీపీడియా మరియు ఇతర వ్యాసాలు**

సేకరణ : **"సత్యేంద్ర"**

# హజరత్ సయ్యద్ అహమ్మద్ ఆలీషా ఖాదరివలి బాబా (కొత్తలంక బాబా)

మహమ్మదీయులే కాక అన్ని మతముల వారు కూడా భక్తితో కొలిచే శ్రీ కొత్తలంక బాబావారి దర్గా ముమ్మిడివరం తాలూకా కొత్తలంకలో వున్నది. ప్రశాంత వాతావరణములో కొబ్బరితోట మధ్యలో విశాలంగా నిర్మించబడిన ఈ దర్గా అశేష భక్త జనావళికి నిరంతర యాత్రస్థలి అయింది. ఈ దర్గా నిర్వాహకులు మహమ్మదీయేతరులు కావటము విశేషము.



కొత్త లంక బాబాగా నేడు భక్తులచే కొలువబడే వీరి పూర్వ నామము హజరత్ సయ్యద్ అహమ్మద్ ఆలీషా ఖాదరి వలి బాబా. వీరి తల్లిదండ్రులు అరేబియా నుండి భారతదేశమునకు వలస వచ్చి ఇచ్చటనే స్థిరపడిరి. శ్రీ బాబావారు తెలంగాణాకు చెందిన నల్గొండ జిల్లాలోని గొల్లపల్లె గ్రామములో జన్మించిరి. అటుపిమ్మట శ్రీ బాబావారు కొత్తలంకకు వేంచేసిరి.

ఆ కాలములో అమలాపురము నుండి కొత్తలంక వెళ్ళుటకు "కోటిపల్లిరేవు" పడవ ద్వారా దాటవలసి వుండేది. బాబా వారిని పిచ్చి వానిగా భావించి డబ్బులు ఇవ్వనిదే రేవు దాటించనని పడవవాడు శ్రీవారిని పడవ దింపివేసెను. అప్పుడు శ్రీ బాబావారు రేవు ఒడ్డున పడివున్న ఒక తాటి ఆకును రేవులోకి విసిరి దానిపై కూర్చుండి పదమని దానిని ఆజ్ఞాపించెను. ఆశ్చర్యముగా ఆ తాటి ఆకు బాబావారిని ఎల్లప్పుడు పొంగి పొర్లుతుండే ఆ రేవుపై ఆవలి ఒడ్డుకు చేర్చెను. అద్భుతమైన ఆ మహిమను చూసిన పడవ ప్రయాణికులు, ఆ ప్రాంత ప్రజలు ఆ దిగంబరుడు పిచ్చివాడు కాదని ఒక మహిమోన్నతుడు అని గుర్తించి సేవించుచుండిరి. ఆ విధముగా సేవించు వారిలో ఆ గ్రామ సమీప వ్యవసాయ భూములను సాగు చేసుకొనే గేదల వెంకటరత్నం, గోవిందరాజులు, కాకారావు అనే సోదరులు కలరు.

శ్రీ బాబావారి మహత్యములు ఆనోట, ఈ నోట, మారుమూల గ్రామములకు సైతం, వ్యాపించటంతో, అశేష భక్త జనావళి బాబావారి దర్శనానికై వచ్చి, తమ అభీష్టములను నెరవేర్చుకొనేవారు. ఆ కాలమునే ఒక దంపతులకు వారి కుమార్తె వివాహము ఒక సమస్యగా పరిణమించి వుండెను. ఎన్ని ప్రయత్నములు చేసినను సంబంధము కుదిరేది కాదు. జనులనోట శ్రీవారి మహత్యమును విన్నవారు శ్రీవారిని దర్శించి తమ కుమార్తె వివాహము కుదిరితే పెండ్లి దుస్తులతో పెండ్లి కుమార్తెను తీసుకొని వచ్చి తమ దర్శనము చేసుకుంటాము అని మ్రొక్కుకొనిరి. బాబా దయవలన కొన్ని దినములలోనే వారి కుమార్తె వివాహము నిశ్చయము అయ్యెను. రాత్రి ముహూర్తము అగుటచేత ఆ రోజు సాయంత్రము పెండ్లి కుమార్తెను తీసుకొని ఆమె తల్లి శ్రీవారి దర్శనార్థము బయలుదేరెను. కొత్తలంక చేరుటకు ఆ రోజులలో గుర్రపు బగ్గీలో మాత్రమే వెళ్ళవలసివుండేది. శ్రీవారి దర్శనము చేసుకొని తిరుగుప్రయాణము అయ్యేసరికి ప్రొద్దుపోవుటతో గుర్రపు బండి వాడి కండ్లు పెండ్లి కుమార్తె నగలపై బడెను. అతను దురుద్దేశ పూర్వకముగా వారిని ఒక డొంక దారిలో బగ్గీని మళ్ళించి తల్లి కూతుళ్ళను చెట్టుకు కట్టివేసి వారి నగలను తీసుకొని బగ్గీమీద పారిపోయెను. అప్పుడు ఆ ఆడువారు దయనీయముగా బాబా వారిని తలంచుకొని నీ వద్దకు వచ్చినపుడు నీవే రక్షించకపోతే మాకు దిక్కెవరు తండ్రి అని ప్రార్థించసాగిరి. ఇంతలో డొంకదారి నుండి రహదారిపైకి చేరిన గుర్రపు బండివాడి చేతిలోని తాడు అదే విధముగా అతని బగ్గీలోని నగలమూట కూడా పాములుగా మారిపోవుటతో అతనే పాములు రక్షించండి, రక్షించండి అని కేకలు వేయసాగెను. అరుపులు విని అక్కడకు చేరిన జనులకు పాములకు బదులు నగల మూట కనబడుటతో వారు అతనిని నిలదీసిరి. విషయము తెలుసుకొని ఆ తల్లికూతుళ్ళను విడిపించి శ్రీవారి మహత్యమును వేనోళ్ళ కొనియాడిరి.

అది 1948వ సంవత్సరము జనవరి 23వ తేదీ మీలద్–ఎ–నబీ (హజరత్ మహమ్మద్ ప్రవక్త పుట్టిన రోజు) పర్వదినము శ్రీవారు తన తనువును చాలించి సిద్ధి పొందిరి. మహాత్ములకు మరణములేదు. వారు ఎల్లప్పుడు సజీవులే. ఆయన మహాత్యములను వర్ణించుట మానవ మాత్రులైన మన వలన సాధ్యము కానిపని. వారిని నమ్మక చెడునుగాని నమ్మి చెడిన వారు లేరు. నిశ్చలమైన నిష్టతో, నిర్మలమైన మనస్సుతో, భక్తితో ఎవరైతే తనను శరణు వేడుతారో వారిని శ్రీవారు తప్పక రక్షించుతారు.


కలకత్తా, ఢిల్లీ, హైదరాబాద్ వంటి వివిధ ప్రాంతాల నుండే కాక, పాకిస్తాన్, కువైట్, బంగ్లాదేశ్ వంటి వివిధ దేశముల నుండి కూడా శ్రీబాబా వారి సమాధి చుట్టూ ప్రదక్షిణ చేసి సమాధి శిరస్సు గల తావులను, వారి పాదరక్షలను తాకితే మదిలోని కోరికలు నెరవేర గలవన్నది ప్రగాఢ విశ్వాసము. భక్తజన సందోహముతో ఎల్లవేళల కొత్తలంక కళకళలాడుతూ వుంటుంది. శ్రీ బాబావారి ఉరుసు మహోత్సవము ప్రతి సంవత్సరము మీలద్–ఎ–నబీ పర్వదినమున జరుగుతుంది. ఆనాడు అశేష జనవాహినితో కొత్తలంక కనుల విందుగా వుండుట చూసి తరించవలసినదే గాని వర్ణించనలవి కానిది. ఆ యాత్ర స్థలమునకు తూర్పుగోదావరి జిల్లా, అమలాపురము నుండి ముమ్మడి వరమునకు అచ్చట నుండి కొత్త లంకకు బస్సు సౌకర్యము కలదు.

(జనవరి 23వ తేదీ శనివారము శ్రీ కొత్తలంకబాబాగారి ఆరాధనోత్సవము సందర్భముగా సమర్పణ)

సేకరణ : **శ్రీ కె.వి.యస్. హరి**, అమలాపురం

# బాల వికాసం - నమ్మకం

"మీ భారములు నాపై పడవేయుడు నేను మ్రోసెదను, నాసహాయముగాని సలహానుగాని కోరిన తక్షణమే ఒసంగ సంసిద్ధుడను" అన్నారు జగద్గురువైన శ్రీ శిరిడీసాయిబాబా. "సాయి అంటే ఐదున్నర అడుగుల మనిషి శిరిడీలోనే ఉన్నాడు" అని భావించేవారు నన్నసలు చూడని వారే. నీవు చూసేదంతా కలసి నేను. అన్ని రూపాలలో నీ చుట్టూ, నీలోపల ఉండి నిన్ను రక్షించేది నేనే అనటమే కాకుండా, ఎవరిని నిందించినా, సత్కరించినా తనకే చెందినట్లు రుజువు చేయటమే కాకుండా, ఆపద సమయంలో ఆర్తితో పిలిస్తేచాలు ప్రపంచంలో ఎక్కడ ఉన్నా తక్షణమే అనేక రూపాలలో శ్రీసాయి రక్షించిన సంఘటనలు అనేకం ఉన్నాయి. అది గుర్తించి, తదనుగుణంగా మనము ప్రవర్తించటమే సాయిపై భక్తిశ్రద్ధలు కలిగి ఉండటము. ఆపద్బాంధవుడైన శ్రీసాయి రక్షణ ఎలా ఉంటుందో ఈ కథ తెలియజేస్తుంది.



అనగనగా ఒక నది గట్టున ఒక ఊరు వుండేది. ఆ ఊరిలోని జనులంతా ప్రశాంతంగా, కలిసి కట్టుగా ఉండేవారు. ఆ ఊళ్ళో ఒక బాబా గుడి వుండేది. రోజూ గ్రామ ప్రజలు గుడికి వచ్చి పూజలు చేసేవారు. గుడిలో పూజారిని ఆదరించేవారు. అలాంటి పండంటి ఊళ్ళో ఒక సంవత్సరం ఉధృతంగా వర్షాలు పడి, నది పొంగి, వరదలు వచ్చాయి. ఊరంతా నీళ్ళు నిండి పోవడం మొదలయ్యింది. ఊరిలోని జనులంతా వరదనుంచి తప్పించుకోవటానికి, తమ ఇళ్ళను వదిలి ఇతర ప్రాంతాలకు బయలుదేరేరు. అంతలో ఆ ఊరి పెద్ద గుడివైపు పరుగెత్తి అందులోని పూజారి గారిని కూడా వారితో వచ్చేయమని ప్రాధేయపడ్డాడు. వరదనీళ్ళు ఊళ్లోకి వచ్చేసాయి. ఇంటి గడపలు దాకా నీళ్ళున్నాయి. పరిస్థితి ప్రమాదకరంగా వుంది. మేము అందరం ఊరు వదిలి వెళ్లిపోతున్నాము. మీరు కూడా మాతో వచ్చేయండి!" అని అన్నాడు గ్రామపెద్ద.

ఆ పూజారి ప్రశాంతంగా, "నా గురించి దిగులు పడకండి, నేను నిత్యం సేవించే నా సాయి నన్ను కాపాడుతాడు. మీరు వెళ్ళండి" అన్నారు. ఈ మాట విని ఆ పెద్దమనిషి వెళ్ళిపోయాడు. కొంతసేపటికి నీళ్ళు నడుము దాకా వచ్చేసాయి. పూజారిగారు గుడి గట్టున నుంచొని జపం చేసుకుంటుంటే, ఒక గుర్రపు బండిలో పోతున్న వారు కొంత మంది ఆగి, పూజారిగారిని కూడా బండి ఎక్క మన్నారు. కానీ పూజారిగారు మట్టుకు, "నన్ను బాబా కాపాడుతాడు" అని గుడిలోనే వుండిపోయారు. ఇంకొంచెం సేపటికి నీళ్ళు మెడ దాకా వచ్చేసాయి. పడవలో ప్రయాణం చేస్తున్న కొందరు చూసి వారితో వచ్చేయమని బ్రతిమాలుకున్నారు. "మీరు ఇంకా ఇక్కడే వున్నారా! ఇక్కడ వుండటం చాలా ప్రమాదం, నీళ్ళు చాలా వేగంగా వచ్చేస్తున్నాయి. మీరు మాతో రండి!" అన్నారు. కాని వారితో కూడా పూజారిగారు, "మీరు వెళ్ళండి, నన్ను బాబానే కాపాడతాడు" అన్నారు.


చలితో వణుకుతూ ఆ పూజారి ముక్కు దాకా నీళ్ళు వచ్చేసరికి ఇంక ఖంగారు పడ్డాడు. అతి త్వరలో గుడి మొత్తం నీళ్ళు నిండిపోయాయి, పూజారిగారు బాబా ధ్యానం చేసుకుంటూనే గుడి పైకి ఎక్కి కూర్చున్నారు. కొంతసేపటికి దిగులు మొదలయ్యింది. ఎప్పటికీ వాన ఆగటం లేదు, చలిగా వుంది. నీళ్ళు ప్రవాహం ఎక్కడా ఆగేలా కనిపించటంలేదు.

"బాబా! నేను నీకు ఏమి తక్కువ చేసాను? రోజూ శ్రద్ధగా పూజలు చేశాను, హారతలు ఇచ్చాను, నిన్నే నమ్ముకున్నాను' అయినా నన్ను కాపాడటానికిరావేమి!" అని ఎలుగెత్తి వేడుకోవటం ప్రారంభించాడు. అప్పుడు గుడిగోపురం పై బాబా దర్శనమిచ్చి, "నీ రక్షణ కోసం పెద్దమనిషి రూపంలో హెచ్చరించి రమ్మన్నాను, తర్వాత గుర్రపు బండిని పంపించాను, చివరకు పడవను కూడ పంపించాను! నువ్వే రాకుండా ఇక్కడ తిష్ట వేసావు. నువ్వు నన్ను గుర్తు పట్టకపోతే అది నాతప్పా?" అని మందలించి అదృశ్యమయినారు.

పూజారిగారికి వెనువెంటనే జ్ఞానోదయం అయ్యింది. ప్రతిరోజు బాబా చరిత్ర పారాయణ చేసి, అందరిలో బాబా ఉన్నాడు ఆర్తితో పిలచినవారిని అనేక రూపాలలో సాయి రక్షిస్తాడని, భక్తులకు చెప్పటమే చేశానుగాని, స్వయంగా నీవు చెప్పినా నేను ఆచరించలేకపోయినా, నా తప్పును మన్నించి నన్ను కాపాడమని హృదయపూర్వకంగా బాబాను క్షమాపణ కోరి ప్రార్థించాడు ఆ పూజారి. వెనువెంటనే ఆ వరద నీటిలో ఒక పడవలో ప్రయాణిస్తున్న కొందరు, గుడిపైన ఉన్న ఆ పూజారినిచూసి "పూజారిగారు! మీరు ఇంకా ఇక్కడే వున్నారని తెలిసి ఇటు వచ్చాము, మాతో రండి, ఇక్కడ వుండటం మంచిది కాదు" అంటూ పడవను గుడి దగ్గరకు పోనిచ్చారు. పూజారిగారు మరోమాట మాట్లాడకుండా పడవ ఎక్కి ప్రాణాలను కాపాడుకున్నారు.


ఆకలితో గాని, ఆపదలో గాని ఎవరు ఉన్నా వారిని ఆదుకోవటం శ్రీసాయికి దక్షిణ సమర్పించినట్లే అవుతుంది, అలాగానే మనకు ఎవరయినా ఆపత్సమయంలో ఏ సహాయం అందించినా అది భగవంతుని ప్రసాదముగా స్వీకరించటమే మనము భగవంతుని పట్ల నిజమైన భక్తి విశ్వాసములు కలిగి ఉన్నట్లు. శ్రీసాయి కోరుకునేది కూడా ఆ"రెండు" రూపాయల దక్షిణే మరి అవి సమర్పిద్దామా!

రచన, సేకరణ : **శ్రీమతి కె. సాయి ప్రత్యూష**, గోవా



# పుస్తక పరిచయం

## శ్రీ దత్తాత్రేయ స్తోత్రసంపుటి




పరమహంస పరివ్రాజకాచార్యులైన శ్రీ శ్రీ శ్రీ వాసుదేవానంద సరస్వతి స్వామి అనేక సందర్భములలో భక్తుల మనోభీష్టాలు నెరవేరుట కొరకు మరాఠీ మరియు సంస్కృతములో అందించిన అనేక అరుదైన అపురూప స్తోత్రములను పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారికి అత్యంత సన్నిహితులైన శ్రీ జె.వి. సుబ్బయ్యమాస్టారుగారి కుమార్తె శ్రీమతి బి. రాజ్యలక్ష్మిగారు శ్రీ వాసుదేవానంద నివాస్ ట్రస్టు (పూణె-మహారాష్ట్ర) ప్రస్తుత పీఠాధిపతి అయిన శ్రీ శరద్‌దత్త మహరాజ్ గారి అనుగ్రహ ఆదేశముతో తెలుగులోనికి అనువదించి, ఒకే సంపుటిగా రూపొందించిన అరుదైన అపురూప గ్రంథము శ్రీదత్తాత్రేయ స్తోత్రసంపుటి.

పేజీలు : 192 వెల : రూ. 40/-లు

**ప్రతులకు సంప్రదించవలసిన సెల్ నెం. : 8885787750**

మరిన్ని పుస్తకాల కొరకు :

Visit : www.sadhgurusrijvsmaster.com

## గురుదేవులు




పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిని దాదాపు 9 సంవత్సరాలు సేవించుకొని, వారిని నిశితంగా గమనిస్తూ వారి బోధలను హృదయగతం చేసుకొని, శ్రీ భరద్వాజగారిని గురుదేవులుగా తన గుండె గుడిలో ప్రతిష్ఠించుకొని, వారి మార్గనిర్దేశకత్వంలో జీవితాన్ని పండించుకుంటున్న శ్రీ వి.సి. వెంకటేశ్వర్లు (రిటైర్డు అసిస్టెంటు డైరెక్టరు - అగ్రికల్చరల్) అందించిన ఆణిముత్యం "గురుదేవులు" శ్రీ భరద్వాజగారి ఆచరణాత్మక బోధనలను ఆవిష్కరించే ఈ చిరు పుస్తకం సర్వులు పఠనీయమైనది.

పేజీలు : 34 వెల : రూ. 10/-

**ప్రతులకు : శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్**

ప్లాట్ నెం. 13, పవర్‌సిటీ గౌతులచ్చన్ననగర్ దగ్గర,
పరవాడ మండలం, విశాఖపట్నం - 531 021.

సెల్ నెం. : 9849645224

## శ్రీదత్త పంచకము





ప్రథమ దత్తావతారమైన శ్రీ దత్తాత్రేయుని చరిత్రతోపాటు కలియుగములో దత్తావతారులైన శ్రీపాద శ్రీవల్లభులు, శ్రీ నృసింహ సరస్వతి, శ్రీ మాణిక్యప్రభువు, శ్రీ అక్కల్‌కోటస్వామి, శ్రీ శిరిడీసాయిబాబా మరియు ఆంధ్రావనిలో సాయి సంప్రదాయాన్ని ప్రత్యేకించి శ్రీ దత్త సంప్రదాయాన్ని పరిచయం చేసిన శ్రీ పూజ్య ఆచార్య శ్రీఎక్కిరాల భరద్వాజగారి సంక్షిప్త చరిత్రలతో పాటు అనేక ఆధ్యాత్మిక విషయ విశేషాలతో కూడిన పుస్తకరాజము శ్రీ దత్తపంచకము.

పేజీలు : 64 వెల : రూ. 10/-

**ప్రతులకు : శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్**

C/o. శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టు
ప్లాట్ నెం .: 13, గౌతులచ్చన్న నగర్, పరవాడ మండలం,
విశాఖపట్నం - 531 021. సెల్ నెం. : 9849645224

## శ్రీ సాయి విశ్వదర్శనం




విశ్వరూపుడైన శ్రీ శిరిడీసాయి విశ్వ తత్వాన్ని ఆవిష్కరించే గ్రంథము. శ్రీ దత్తావతారుల చరిత్రలతోపాటు, సాయి స్వరూపులైన అవధూతల, మహాత్ముల సంక్షిప్త చరిత్రలతో పాటు అలనాటి శిరిడీలోని అపురూప, అరుదైన చిత్రపటాలతో కూడిన ప్రత్యేక సంచిక.


పేజీలు : 104 వెల : రూ. 25/-

**ప్రతులకు : శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్**

C/o. శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టు
ప్లాట్ నెం .: 13, గౌతులచ్చన్న నగర్, పరవాడ మండలం,
విశాఖపట్నం - 531 021. సెల్ నెం. : 9849645224

**ఈ పేజి సమర్పించినవారు :**

**శ్రీ సాయి మాస్టర్ సేవా సంఘం**, కెల్లవీధి, శ్రీకాకుళం.




## చట్టానికి, న్యాయానికి, ధర్మానికి కల తేడాలు

ఒకవ్యక్తి ఎటువంటి ప్రాంసరీ నోటు, పూచీకత్తులు లేకుండానే లక్ష రూపాయలు ఆర్థిక సహాయం చేసి, మన వ్యాపారాన్ని తద్వారా జీవన ప్రమాణాన్ని మెరుగు పర్చి మన జీవితం నిలబడటానికి సహకారి అయినాడు. కాలాంతరంలో అతని ఆర్థికస్థితి దెబ్బతిని అనారోగ్యంతో చనిపోగా అతని కుటుంబం బజారున పడింది, ఆ సమయములో

**చట్టం :** ఎటువంటి పూచీకత్తులు, కాగితాలపై వ్రాత కోతలు లేనందున ఆ డబ్బు తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదు అంటుంది చట్టం.

**న్యాయం :** అతను ఇచ్చిన పైకానికి వడ్డీతో తిరిగి చెల్లించాలి అంటుంది న్యాయం.

**ధర్మం :** కష్ట సమయంలో ఆర్థిక సహాయమందించి నీ కుటుంబాన్ని నిలబెట్టినందుకు కృతజ్ఞతగా అతని డబ్బు చెల్లించటంతో పాటు అతని కుటుంబం పూర్తిగా ఆర్థికంగా నిలబడే వరకు నిలబడాలి అంటుంది ధర్మం.

## విలువ

బడికి పోవటం మొదలయ్యాక తెలిసింది ఆటల విలువ
కాలేజీలో చేరిన తరువాత తెలిసింది చదువు విలువ
పదవీ విరమణ చేసిన తరువాత తెలిసింది ఉద్యోగం విలువ
మరణానికి చేరువు అవుతున్నప్పుడు తెలిసింది జీవతం విలువ
ఏదైనా మన చేతిలో ఉన్నప్పుడు తెలియదు దాని అసలు విలువ
కనుక ముందే తెలుసుకొని జీవితాన్ని ఫలవంతం చేసుకుందాము.

## అధిగమించు

1. అందరి దగ్గర సహాయంకోసం చేతులు చాచటం
2. జీవితంలో వచ్చే మార్పులకు భయపడటం
3. గతం మిగిల్చిన చేదు జ్ఞాపకాలలో జీవించటం
4. మనల్ని మనమే తక్కువ చేసుకొని చూసుకోవటం
5. ప్రతి చిన్న విషయానికి అతిగా ఆలోచించి బాధపడటం

ఈ పంచ సూత్రాలు ఆధిగమించిననాడు మన జీవితం నిత్య వసంతమవుతుంది.

## శిఖరాగ్రానికి మార్గాలు

1. గత యాభై ఏళ్ళలో సూర్యుడు ఎప్పుడూ నన్ను మంచంమీద చూడలేదు (సూర్యోదయానికి ముందే నిద్రలేవటం)

– ముఖేష్ అంబానీ, రిలయన్స్

2. ఆఫీసుబాయి కంటే ముందే నేనుండటమే నాకిష్టం, ఉద్యోగిగా చేరినప్పటినుంచి, సి ఇ ఓ అయ్యాక కూడా ఆ అలవాటు వదలలేదు.

– ది టీమ్‌మెన్ – యాపిల్

3. అందరికంటే రెండు గంటలు ముందు నిద్రలేచే అలవాటు ఉంటే ఓ నెల ఎక్కువ బ్రతికినట్లే

– అజీమ్ ప్రేమ్‌జీ – విప్రో

## జీవిత సౌధానికి పునాదులు

**1. విశ్వాసం :** వర్షాలు పడటం లేదని ఊర్లో వాళ్ళందరూ దేవుడిని ప్రార్థించటానికి గుడికి వెళ్ళేరు, కాని ఒకడు మాత్రం గొడుగు తీసుకువెళ్ళేడు. అదే విశ్వాసం.

**2. నమ్మకం :** తండ్రి చేతిలోని బిడ్డని పైకి ఎగురవేస్తాడు, ఆ బిడ్డ ఏడవదు కాని, నవ్వుతుంది. అదే నమ్మకం.

**3. ఆశ :** రేపు మనం బ్రతికే ఉంటామో లేదో తెలియదు కాని, అలారం పెట్టుకొని మరీ పడుకుంటాము. అదే ఆశ.

**4. ఆత్మవిశ్వాసం :** రేపు ఏమి జరుగుతుందో తెలియదు కాని, మన పరిస్థితులను ఎలా మెరుగుపరచు కోవాలో ప్రతికూల పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలో ఆలోచిస్తుంటాము. అదే ఆత్మవిశ్వాసం.

చేసే పనిమీద విశ్వాసం, చేయగలను అనే నమ్మకంతో చేస్తే జీవితం బాగుపడుతుంది అనే ఆశ, ఏమి జరిగినా ఎదుర్కోగలను అన్న ఆత్మవిశ్వాసమే మనిషి విజయానికి పునాదులు. పునాదులు ఎంత దృఢంగా ఉంటాయో జీవితసౌధవం అంత దృఢంగా, ఉన్నతంగా ఉంటుంది.

## ఆయుర్వేదం ఐదవ వేదమా?

నాలుగు వేదాలలో మొదటిది "ఋగ్వేదమునకు ఉపవేదంగా" ఆయుర్వేదంగా చెబుతారు. ఆయుర్వేద ఆవిర్భావం క్షీరసాగర మథనం సమయంలో జరిగిందని చెబుతారు, దేవతలు, రాక్షసులు చేసిన క్షీరసాగర మథనంలో మొదటగా పుట్టింది హాలాహలం తరువాత అమృతం, తరువాత 'ధన్వంతరి' ఉద్భవించాడు. ఈ ధన్వంతరిని మహావిష్ణువు అవతారంగా భావిస్తారు. ఇతడు ఒక చేతిలో అమృతభాండాన్ని, మరో చేతిలో ఆయుర్వేదాన్ని పట్టుకుని వచ్చాడు. ఈ ఆయుర్వేదమే సకల మానవకోటికి ఆరోగ్యాన్ని ప్రసాదించే జీవనవేదం, దీనిని ధన్వంతరి బ్రహ్మదేవునికి ఇచ్చాడు. తరువాత మానవాళి రోగాల బారిన పడి నశించకుండా దేవలోకం నుండీ భూలోకానికి ఆయుర్వేదాన్ని రప్పించడానికి విశ్వామిత్రాది ఋషులు నిర్ణయించుకున్నారు. అప్పుడు భరద్వాజ మహర్షి దేవలోకం వెళ్ళి ఆయుర్వేదాన్ని అభ్యసించివచ్చి 'ఆత్రేయుడు' అనే మహర్షికి భోదించారు. ఈ మహర్షి అగ్నివేశ మహర్షికి ఉపదేశం

చేశారు. అత్రేయుని వద్ద నేర్చుకున్న ఆయుర్వేద రహస్యాలను మహా శాస్త్రంగా అగ్నివేశుడు రచించాడు. దీనినే "అగ్నివేశతంత్ర" అంటారు. తరువాత ఇది **చరకసంహితగా** రూపుదిద్దుకుంది. ఈ చరకుడినే ఆయుర్వేదానికి ఆది గురువుగా మనం భావిస్తున్నాము.

## వంటింటి చిట్కాలు

1. కొబ్బరిముక్కను పెరుగులో వేస్తే తొందరగా పెరుగు పాడవదు.
2. పప్పు తొందరగా ఉడకాలంటే ఉడికేటప్పుడు డాల్డా గాని నూనెగాని వేయాలి.
3. పచ్చిమిరపకాయలు ముచ్చికలను తీసి ఫ్రిజ్‌లో నిల్వ ఉంచడం వల్ల తొందరగా పాడవవు.
4. అగరబత్తినుసితో ఇత్తడిపాత్రలను కడగడంవల్ల బాగా శుభ్రపడతాయి.
5. బిస్కెట్ పేకెట్ బియ్యండబ్బాలో ఉంచడం వల్ల తొందరగా మెత్తబడవు.
6. ఎండు కొబ్బరిచిప్ప కందిపప్పు డబ్బాలో వేసి నిల్వ ఉంచితే పప్పు పాడవదు.


షిర్డీ సాయి బాబా యాత్రా స్పెషల్
దత్తక్షేత్రములకు
08.02.2021 న ఒంగోలు,విజయవాడ గుడివాడ నుండి A/C బస్సు దత్తక్షేత్రములకు బయలుదేరును
టిక్కెట్టు : 11,500/- (2x2 A/C BUS)

| 10 రోజుల యాత్ర | దర్శించు క్షేత్రములు |
|---|---|
| 1.యాదగిరి గుట్ట | 10.షిర్డీ |
| 2.బాసర | 11.కోల్హాపూర్ |
| 3.మాహూర్ | 12.ఔదంబర్ |
| 4.కరంజా | 13.భిల్లవటి |
| 5.షేగాం | 14.నర్సోబవాడి |
| 6.కాండ్వా (ధునివాలాదాదా) | 15.అక్కల్ కోట |
| 7.ఎల్లోర (గృష్ణేశ్వర్) | 16.గాణ్గాపూర్ |
| 8.సప్తశృంగి | 17.మాణిక్యనగర్ |
| 9.పండరి | 18.కురుపపురం |

పై యాత్రకు రాదలిచిన వారు టిక్కెట్టు కి 5000 రూ॥ అడ్వాన్సు చెల్లించి మీ సీటు రిజర్వ్ చేసుకోవలెను. యాత్రకు వచ్చిన వారికి,రూములు మరియు భోజనాలు, టిఫిన్స్,కాఫీలు,మినరల్ వాటర్ యాత్ర నిర్వహించువారు సమకూర్చును.
ప్రతి ఒక్కరు మీతో శ్రీ గురు చరిత్ర,శ్రీ సాయి లీలామృతం వెంట తెచ్చుకొనవలెను.
ఆర్గనైజర్ : కోసూరి శ్రీనివాసరావు - 98495 31232, ఒంగోలు


# అన్నదానం

అన్నం పరబ్రహ్మ స్వరూపం. ఏది లోపించినా బ్రతకగలం. కానీ ఆహారం లోపిస్తే బ్రతకలేం. దానాలన్నింటిలోకి అన్నదానం మిన్న అని, అన్నదానాన్ని మించిన దానం మరొకటి లేదని చెప్తారు. ఎందుకంటే ఏది దానంగా ఇచ్చినా... ఎంత ఇచ్చినా కూడా ఇంకా ఇంకా కావాలనిపిస్తుంది. కాని అన్నదానంలో మాత్రం దానం తీసుకున్నవారు ఇంక చాలు అని చెప్పి సంతృప్తిగా లేస్తారు. ఏ దానం ఇచ్చినా దానం తీసుకున్నవారిని మనం సంతృప్తి పరచలేకపోవచ్చు. కాని అన్నదానం చేస్తే మాత్రం దానం తీసుకున్నవారిని పూర్తిగా సంతృప్తిపరచవచ్చు. అన్నదానాన్ని ఒక యజ్ఞంలా భావించి చేసేవారిని కూడా చూడవచ్చు. అన్నదానం చేయలేకపోయినా అన్నం పెట్టే ఇంటినన్నా చూపించమని పెద్దలు చెప్తారు. దీనికి సంబంధించిన ఒక కథనాన్ని కూడా చెప్తారు. మహాభారత యుద్ధంలో కర్ణుడు మరణించిన తరువాత స్వర్గానికి వెళ్ళాడు. అక్కడ కర్ణునికి అన్ని సౌకర్యాలు లభించాయి. స్వాగత సత్కారాలు లభించాయి. ఏది కావాలంటే అది పొందే అవకాశం ఉంది. అన్నీ అందుబాట్లో ఉన్నాయి. ఏంలాభం....! కర్ణుడికి ఏదో అసంతృప్తి. ఏదో వెలితి. ఎంత తిన్నా కడుపు నిండినట్టుండటంలేదు. సంతృప్తిఅనేది లేదు. ఎందుకు ఈ విధంగా ఉంటుందో అతనికర్థం కావడంలేదు. ఇదే మాట దేవేంద్రుడిని అడిగాడు కర్ణుడు. అప్పుడు "దేవేంద్రుడు చిరునవ్వుతో, నీవు అనేక దానాలు చేశానని, అడిగినవారికి లేదనకుండా ఇచ్చే దానకర్ణుడివని చెప్తారు. మరి... ఎప్పుడైనా అన్నదానం చేశావా?" అనడిగాడు. దానికి సమాధానంగా లేదు... నేనెన్నో దానాలు చేశాను గాని అన్నదానం మాత్రం చేయలేదు అన్నాడు కర్ణుడు. "పోనీ అన్నం పెట్టే ఇల్లయినా చూపించావా?" అనడిగాడు దేవేంద్రుడు. కాస్త ఆలోచించిన కర్ణుడు చెప్పాడు. "అవును. ఓ బీద బ్రాహ్మణుడు నా దగ్గరకు వచ్చి అన్నం పెట్టించమని అడిగాడు. అపుడు నేను ఏదో ధ్యాసలో ఉండి, నాకు అవకాశం లేదు గానీ.... అక్కడ ఆ ఇంటికి వెళ్ళు అని ఒక ఇంటిని చూపించాను" అన్నాడు కర్ణుడు. నీవు అన్నదానం చేసిన ఇంటిని చూపించిన వేలిను నోట్లో పెట్టుకో" అన్నాడు ఇంద్రుడు. సరేనని ఆ వేలిని నోట్లో పెట్టుకున్నాడు కర్ణుడు. ఒక్క గుటక వేసాడు. ఆ క్షణంలోనే అతని కడుపు నిండిపోయింది. అంతవరకున్న అసంతృప్తి మటుమాయమైంది. ఎనలేని తృప్తి కలిగింది. ఈ కథనం ద్వారా అన్నదానం యొక్క మహత్యం, దాని ప్రాశస్త్యం తెలుస్తోంది. నిత్య జీవితంలో మనం ఎదుర్కొనే అనేక ఇబ్బందులనుండి, ఇక్కట్ల నుండి బయటపడడానికి చక్కటి పరిష్కారంగా పనిచేస్తుంది అన్నదానం అని చెప్తారు పండితులు. అన్నదానం వలన ఎన్ని సమస్యలున్నా పరిష్కారమవుతాయని చెప్తారు. అన్నదానం చేసేటప్పుడు దైవభక్తులకు తాంబూలంతో పాటు దక్షిణ ఉంచి దానం ఇస్తే అద్భుతమైన ఫలితాలు పొందవచ్చనీ ప్రతీతి. కొందరు ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతుంటారు. ఎంత ప్రయత్నించినా సరైన రాబడి లేకపోవడం, దానికితోడు విపరీతమైన ఖర్చులతో సతమతమవడం జరుగుతుంది. అలాంటివారు అన్నంతో లడ్డు పెట్టి, తాంబూల సహితంగా దానం ఇస్తే అధిక ఆదాయం పొందడంతో పాటు శ్రీమంతులయ్యే అవకాశం ఉందని శాస్త్రాలు చెప్తున్నాయి. ఇక అనారోగ్యంతో బాధపడుతున్న వారు, దీర్ఘ రోగాలతో సతమతమవుతున్నవారు అన్ని రోగాలు తొలగి సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారు. కొన్నిసార్లు ఇంటిపై మాంత్రిక దోషాలు కూడా కలుగుతుంటాయి. అటువంటప్పుడు చిత్రాన్నంతోపాటు వడ దానం చేస్తే గృహంపై జరిగే ఏ విధమైన మంత్ర, తంత్ర సంబంధమైన దోషాలైనా తొలగిపోతాయి. బెల్లం అన్నం దానం చేస్తే శ్రీమంతులవుతారు. భోజనం చేసేముందు మొదటి ముద్దను పరమేశ్వరార్పణం చేసి దానిని కాకులకో, ఇతర పక్షులకో పెడతారు. ఇలా చేయడంవలన భగవంతునికి సమర్పించినట్లు అవుతుంది. ఇక అన్నం తినేముందు కొద్దిగా అన్నాన్ని కాకులకు వేయడం వలన శని దోషాలనుంచి బయటపడవచ్చని కూడా చెప్తారు.

"నాకు అర్పించకుండా ఎవరు ఏమీ తినరో వారికి నేను బానిసను" అన్నారు శ్రీ శిరిడీసాయిబాబా

సేకరణ : **శ్రీమతి కె. సాయి ప్రత్యూష**, గోవా

# 2021 సం॥లో శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టు (పవర్‌సిటీ) నిర్వహించే / పాల్గొనే ముఖ్య కార్యక్రమాలు

| | | |
|---|---|---|
| జనవరి | 1 | ఆంగ్ల నూతనసంవత్సర ప్రత్యేక సత్సంగం |
| | 15 | అవధూత శ్రీ రామిరెడ్డితాత ఆరాధనోత్సవము |
| ఫిబ్రవరి | 2 | శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టు 28వ వార్షికోత్సవము - పవర్‌సిటీ, విశాఖపట్నం |
| | 7,8&9 | 22వ అఖిలాంధ్ర శ్రీ సాయిమాస్టర్ భక్తసమ్మేళనము - ఒంగోలు |
| మార్చి | 11 | మహాశివరాత్రి - శ్రీ పాకలపాటి గురువుగారి ఆరాధనోత్సవము - నర్సీపట్నం |
| ఏప్రిల్ | 12 | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ఆరాధనోత్సవము |
| | 13 | "ఉగాది" శ్రీ " ప్లవ " నామసంవత్సరము ప్రత్యేక సత్సంగమము - పవర్‌సిటీ |
| | 21 | శ్రీరామనవమి |
| మే | 25 | పేద విద్యార్థులకు పుస్తక-వస్త్ర బహుకరణ, వివిధ సేవాకార్యక్రమములు - పవర్‌సిటీ |
| | 26 | బుద్ధజయంతి |
| జూన్ | 4 | హనుమజ్జయంతి |
| | 17 | అవధూత శ్రీ చివటంఅమ్మ ఆరాధనోత్సవము |
| | 24 | శ్రీ పాకలపాటి గురువుగారి జయంతి మహోత్సవము |
| జూలై | 2 & 3 | గురుపూర్ణిమ మహోత్సవములు - పవర్‌సిటీ, విశాఖపట్నం |
| | 3 | గురుపూర్ణిమ |
| ఆగష్టు | 14&15 | 27వ సద్గురువుల పాదుకామహోత్సవము - పవర్‌సిటీ |
| | 17 | శ్రీ తాజుద్దీన్‌బాబా ఆరాధనోత్సవము |
| | 22 | సద్గురువుల పాదుకామహోత్సవము - శ్రీ పాకలపాటి గురువుగారి ఆశ్రమము, నర్సీపట్నం |
| | 24 | అవధూత శ్రీ వెంకయ్యస్వామి ఆరాధనోత్సవము |
| | 30 | శ్రీ కృష్ణ జయంతి, కృష్ణాష్టమి |
| సెప్టెంబరు | 3 | అవధూత శ్రీ చీరాలస్వామి ఆరాధనోత్సవము |
| | 10 | వినాయక చవితి<br>శ్రీపాద శ్రీవల్లభుల జయంతి |
| అక్టోబరు | 15 | విజయదశమి 103వ శ్రీ శిరిడీసాయి మహాసమాధి మహోత్సవము |
| | 30 | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి జయంతి |
| నవంబరు | 4 | దీపావళి |
| | 7 | శ్రీ సాయిదీక్షలు (మండలం) ప్రారంభం - పవర్‌సిటీ |
| | 19 | కార్తీకపూర్ణిమ |
| | 28 | శ్రీ సాయిదీక్షలు (అర్ధమండలం) ప్రారంభం - పవర్‌సిటీ |
| డిసెంబరు | | |
| | 16,17&18 | శ్రీ దత్త జయంతి మహోత్సవములు - పవర్‌సిటీ |
| | 18 | శ్రీ దత్త జయంతి, శ్రీ సాయిదీక్షలు విరమణ |
| | 30 | భగవాన్ శ్రీ రమణమహర్షి జయంతి |
| | 31 | ఆంగ్ల సంవత్సర (2021) వీడ్కోలు ప్రత్యేక సత్సంగమము - పవర్‌సిటీ |

నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలతో ఈ పేజీ సమర్పించిన వారు :

**శ్రీ కె. అశోక్ కుమార్, శ్రీమతి అరుణ కుమారి, కుమారి సాయి సౌభాగ్య శ్రీ, చి॥ మేధా సాయి - శ్రీకాకుళం**

# ఏరిన ముత్యాలు

## విలువలు

తగ్గి ఉంటున్నావంటే తప్పుచేస్తున్నట్లు కాదు
బంధానికి విలువ ఇస్తున్నావని అర్థం, తప్పుచేయకుండా
తలవంచ వద్దు, నమ్మకం లేనిచోట వాదించవద్దు.

## పుస్తకం

బంధం అన్నది అందమైన పుస్తకం లాంటిది
పొరపాటు అనేది అందులోని ఒక పేజీ మాత్రమే,
దానిని మాత్రమే సరిచేయాలి కాని,
మొత్తం పుస్తకాన్ని చించి పారవేయకూడదు.

## ప్రార్థన

భగవంతుడా నాకు కోపంవచ్చినప్పుడు నా కళ్ళనుండి
కన్నీరు రానివ్వు, కాని, నోటి నుండి మాట జారనీయవద్దు
కన్నీటిలో కోపం కరిగిపోతుంది, కాని, జారిన మాట
అవతల వారి హృదయాన్ని గాయపరుస్తుంది.

## గురువు

వికసించే పుష్పం నేర్పింది, సౌరభం వెదజల్లుతూ
జీవించమని, రాలిపోతున్న ఆకు నేర్పింది,
జీవితం శాశ్వతం కాదని, ప్రవహించే వాగు నేర్పింది,
అవరోధాలు దాటుకుంటూ గమ్యం చేరమని,
మెరిసే మెరుపు నేర్పింది, కనీసం ఒక్కక్షణంఅయినా
వెలుగులు పంచమని.

## ఆలోచించు

మనస్సుకు గాయం చేసారని మనుషులను దూరం
చేసుకోవటంవలన సమస్యకు పరిష్కారం లభించదు
అందుకు దోహదమైనపరిస్థితులను అర్థం చేసుకుంటే
నూటికి తొంభైతొమ్మిది సమస్యలు తీరిపోతాయి.

## ఆలోచించు

ఎదురుదెబ్బ తగిలినప్పుడు తొందరపడకు,
కాసేపు ఆగి ఆలోచించు, జీవితం నీకేదో నేర్పటానికి
ప్రయత్నిస్తుందని గ్రహించు.

## ఒంటరితనం

అందరినీ వదిలివేసి దూరంగా ఉండటముకాదు
ఒంటరితనం,
మన బాధలు పంచుకోవటానికి వీలులేని మనుష్యుల మధ్య
ఉండటమే నిజమైన ఒంటరితనం.

## నిజాయితీ

నిజాయితీగా ఉండేవారు ఎప్పుడూ పొగరుగానే ఉంటారు
ఎందుకంటే వాళ్ళకు నటించటం తెలియదు,
ఆత్మగౌరవంతో జీవించటం తప్ప.
వాళ్ళు ఎవరికీ నచ్చరు, నచ్చితే వారిని వదులుకోలేరు.
అదే వారి బలము, బలహీనత.

## నిర్ణయం

కాలం నువ్వు కలిసే వ్యక్తులను నిర్ణయిస్తుంది
హృదయం మీరు కోరే వ్యక్తులను నిర్ణయిస్తుంది
మీ ప్రవర్తన మీతో ఉండే వారిని నిర్ణయిస్తుంది.

## గొప్పవాడు

ఓడిపోతే గెలవటం నేర్చుకోవాలి, మోసపోతే జాగ్రత్తపడటం
నేర్చుకోవాలి, చెడిపోతే బాగుపడటం నేర్చుకోవాలి,
గెలుపును ఎలా పొందాలో తెలిసినవాడికంటే,
ఓటమిని ఎలా స్వీకరించాలో తెలిసిన వాడు గొప్పవాడు.

## సమస్యలు

జీవితంలో ఎప్పుడూ అనుకోని సమస్యలే ఎదురవుతూ
ఉంటాయి, వాటిని ఎలా ఎదుర్కొనాలో తెలుసుకోవటమే
జీవితం, దీనిలో గెలుపు ఓటమిలు ఉండవు. పాఠాలు,
అనుభవాలు మాత్రమే ఉంటాయి.

## విధానం

దారిలో అడ్డంవస్తే ఆపాల్సింది ప్రయాణం కాదు,
నడిచే పద్ధతి. చేసే పనిలో అడ్డంకులు వస్తే ఆపాల్సింది
పనికాదు ప్రయత్నించే విధానం